జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



దేశ ప్రగతికి విద్య, వైద్యమే బలమైన పునాది

నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

03


సంపుటి 09, సంచిక: 192 | శుక్రవారం | 12-06-2026 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నా

# అభివృద్ధి పథంలో భారత్




- ‘వికసిత్ భారత్’ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి
- దేశ ప్రగతి ప్రస్థానంలో యువత, మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలి
- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి పథంలో బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత, మహిళల సాధికారత ఎంతో కీలకమన్న మోదీ, దేశ ప్రగతి ప్రస్థానంలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్, ఇతర సభ్యులు కూడా పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూరేలా సమగ్ర మానవాభివృద్ధిని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశలో కేంద్ర, రాష్ట్రాల సమష్టి బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు వీలుగా భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని తరువాయి 8లో




### కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా

# దేశవ్యాప్తంగా ఆందోళనలు

- ఈ నెలాఖరులో ప్రారంభించి 23 నెలల పాటు కొనసాగింపు
- సీట్ల చోరీపై న్యాయపరంగానూ, రాజకీయంగానూ పోరాటం
- కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం వార్తలు నిరాధారం
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళనబాట పట్టనుంది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ గురువారం ప్రకటించారు. ఇవి జూన్ నెలాఖరులో ప్రారంభమై, 23 నెలల పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. అలాగే, తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి) పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కానుందని వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను తిరస్కరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇతర పార్టీల ఎంపిలతో రాజీనామా చేయించి బిజెపిలో చేర్చుకోవడం ‘సీట్ చోరీ’ లాంటిదని విమర్శించారు. కాంగ్రెస్ కమిటీ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ‘గురువారం జరిగిన సమావేశంలో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ అంశంపై కూలంకషంగా చర్చించాం. రాజ్యసభలో మెజారిటీని సాధించడానికి వారు అనుసరిస్తున్న విధానం ఇది. ఇతర పార్టీల ఎంపిలతో రాజీనామా చేయించి, వారిని బిజెపి ఎంపిలుగా మార్చుకుంటున్నారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదు, ఏకంగా సీట్ల చోరీ. దీనిపై మేం న్యాయపరంగానూ, రాజకీయంగానూ పోరాడుతాం. అలాగే, దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంపై కూడా మా సమావేశంలో చర్చించాం. పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్ ధరలు తరువాయి 8లో

# గృహిణులు దేశ నిర్మాతలు

### వారికి నెలకు రూ.30,000 పరిహారం చెల్లించాల్సిందే: సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ :** దేశంలో గృహిణుల శ్రమపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహిణులు దేశ నిర్మాతలు అని, వారు చేసే పనికి కనీసం రూ.30,000 పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన కేసులపై విస్తృత ప్రభావం చూపే తీర్పులో, ఒక మోటారు వాహన ప్రమాదంలో భార్యను కోల్పోయిన వ్యక్తికి అదనపు పరిహారం మంజూరు చేస్తూ జస్టిస్‌లు సంజయ్ కరోల్, ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వును జారీ చేసింది. గృహిణి మానవజాతి, దేశాభివృద్ధికి దోహదపడుతుందని తాము భావిస్తున్నామని, గృహిణి దేశాన్ని నిర్మిస్తుదని, అందుకే తాము సూత్రాలను తరువాయి 8లో



# తెలంగాణ ప్రాజెక్టులకు సహకరించండి

### గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మహారాష్ట్రతో చర్చలకు వీలు కల్పించండి

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ప్రత్యేకంగా భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని సిఎం వివరించారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రధానితో సిఎం భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్–2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు.హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) పనులకు వెంటనే ఆమోదం తరువాయి 8లో

# సుప్రీంకోర్టుకు మీనాక్షి నటరాజన్

### పిటిషన్‌పై నేడు విచారణ



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సంబంధించిన నామినేషన్ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఆమె నామినేషన్ పత్రాలను తిరస్కరించిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిని శుక్రవారం విచారించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తరువాయి 12లో






### అమెరికా సైన్యం దాడి

# ముగ్గురు భారత నావికులు మృతి

- హోర్ముజ్‌లో రెండు మృతదేహాలు స్వాధీనం : మరొకరికోసం గాలింపు
- 21 మంది భారీ నావికులు సురక్షితం
- సెంట్‌కామ్ దాడులను ఖండించిన కేంద్ర ప్రభుత్వం
- ఆ నౌక దిగ్బంధన నిబంధనలు ఉల్లంఘించింది : సెంట్‌కామ్ ప్రకటన
- దాడులు ఆపండి : నౌకా రవాణా స్వేచ్ఛ ఉండాలని ఐక్యరాజ్యసమితిలో భారత్ డిమాండ్
- ఢిల్లీలో అమెరికా దౌత్యవేత్తను పిలిచి దాడులను తీవ్రంగా తప్పుపట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ :** హోర్ముజ్ జలసంధిలో అమెరికా సైన్యం చేసిన వైమానిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించారని కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ‘‘పలావు’’ జెండాతో వెళుతున్న ట్యాంకర్‌లో ఉన్న 24 మంది భారతీయ సిబ్బందిలో ముగ్గురు నావికులు బుధవారం గల్లంతయ్యారని, వారిలో ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, మరో నావికుడి కోసం గాలింపు కొనసాగుతోందని విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ గగనతల దాడి చాలా తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. ఈ ట్యాంకర్‌లో మిగిలిన 21 మంది భారత నావికులను ఒమన్ సహాయ బృందాలు కాపాడి సురక్షిత ప్రాంతానికి చేర్చినట్లు పేర్కొంది. హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణా స్వేచ్ఛ ఉండాలని ఐక్యరాజ్యసమితి వేదికపై భారతదేశం ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. ఈ యుద్ధంలో ఇటీవలికాలంలో అనేకమంది భారతీయులు మరణిస్తున్నారని, ఈ దాడులను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేసింది. భారతీయ నావికులు ఉన్న ట్యాంకర్‌పై అమెరికా దాడి, ముగ్గురు నావికులు గల్లంతైన విషయం తెలియగానే బుధవారం సాయంత్రానికి భారత ప్రభుత్వం ఢిల్లీలో ఉన్న అమెరికా డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. మరోవైపు అమెరికా సైనిక విభాగం సెంట్‌కామ్ అధికారులు ఒక ప్రకటన చేస్తూ భారతీయ నావికులు ఉన్న సరుకు రవాణా ట్యాంకర్ హోర్ముజ్‌లో తాము విధించిన దిగ్బంధన నిబంధనలను ఉల్లంఘించిందని, ఒమన్ గల్ఫ్‌లో తరువాయి 8లో



### లేబర్ కోడ్‌లు వద్దు.. రాష్ట్రంలో

# అమలు చేయొద్దు

- వాటికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించొద్దు
- కార్మిక సంఘాల నాయకులు హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితులో అమలు చేయొద్దని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం అములుకు పూనుకుంటే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. లేబర్ కోడ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయరాదని, ఇందుకు సంబంధించి నియమ నిబంధనల రూపొందించొద్దని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, తరువాయి 8లో

# ‘ఇగ్నైట్’ గుట్టురట్టు

- ‘క్యూనెట్’ సంస్థ కొత్త పేరుతో కార్యకలాపాలు
- నాలుగు రాష్ట్రాల్లో ముమ్మర దాడులు : ఆరుగురి అరెస్టు
- కంపెనీ పెట్టిన 18 రోజులకే ఆట కట్టించిన పోలీసులు
- రూ.5,000 కోట్ల మోసానికి అడ్డుకట్ట




ప్రజాపక్షం/హైదరాబాద్

డైరెక్ట్ సెల్లింగ్, మల్టీ లెవెల్ మార్కెటింగ్ ముసుగులో దేశవ్యాప్తంగా భారీ మోసాలకు పాల్పడేందుకు సిద్ధమైన ‘ఇగ్నైట్’ నెట్‌వర్క్‌ను హైదరాబాద్ సిటీ పోలీసులు భగ్నం చేశారు. గతంలో వివాదాస్పదమైన ‘క్యూనెట్’ సంస్థ కొత్త పేరుతో కార్యకలాపాలు ప్రారంభించగా, సంస్థ ఏర్పాటైన కేవలం 18 రోజుల్లోనే దాని గుట్టును రట్టు చేసి రూ.5,000 కోట్లకు పైగా జరిగే అవకాశం ఉన్న మోసాన్ని అడ్డుకున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా తరువాయి 12లో

### ఉమ్మడి ఖమ్మం సాగునీటి ప్రాజెక్టులు

# వేగవంతంగా పూర్తి

- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పర్యావరణ అనుమతుల ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకువెళ్లాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆదేశం
- ఎన్‌జిటి కేసులు, ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీతారామ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. గురువారం జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమగ్ర సమీక్ష సమావేశంలో తరువాయి 12లో

# దక్షిణాన వర్షాలు ఉత్తరాన వడగాడ్పులు

### రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం

పలు జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజా బులెటిన్‌లో వెల్లడించింది. రాష్ట్రంలో ఒకవైపు ఎండ తీవ్రత, వడగాడ్పులు కొనసాగుతుండగానే, మరోవైపు భారీ వర్షాలు, ఈదురు గాలులు ముంచెత్తనున్నాయి. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో వడగాడ్పులు, మరికొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, ఉరుములు మెరుపులు, ఈదురుగాలులు తరువాయి 12లో

# తృణమూల్ కాంగ్రెస్ భవిష్యత్ ఏమిటి?

'వేయి పశువులను తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకూలింది' అనే నానుడి నేటి రాజకీయరంగంలో పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్‌కు వర్తిస్తుంది. ఫైర్‌బ్రాండ్‌గా పిలవబడే మమతా బెనర్జీ కాంగ్రెస్ నుంచి బయటకువచ్చి, సిపిఐ(ఎం) ప్రభుత్వంపై పోరాడేందుకు 1998 జనవరి 1న అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ పేరుతో సొంత పార్టీ ఏర్పాటు చేశారు. టాటాల నానో కార్ల ఫ్యాక్టరీకోసం వామపక్ష సంఘటన ప్రభుత్వం నందిగ్రాంలో రైతుల భూములు సేకరించటానికి వ్యతిరేంగా పెద్ద ఆందోళన నిర్వహించిన ఆమె 2011 అసెంబ్లీ ఎన్నికల్లో, 34సంవత్సరాల ఎల్.ఎఫ్ పాలనను అంతంచేసి అధికారం చేబట్టారు. మూడుసార్లు వరుసగా అధికారంలోకి వచ్చిన ఆమె జాతీయ రాజకీయాల్లో బలమైన వాణిగా ఎదిగారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి 28 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులతో పార్లమెంటులో మూడవపెద్ద పార్టీగా టిఎంసి ఉందంటే రాష్ట్రంలో ఆమె పాలనకున్న బలాన్ని – ఎన్ని అవకతవకలు, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు, అణచివేతలు నిత్యకృత్యంగా ఉన్నప్పటికీ – ఊహించుకోవచ్చు. 1998లో వాజ్‌పేయి ప్రభుత్వంలో రైల్వేమంత్రిగా పనిచేసిన మమతాబెనర్జీ రాష్ట్ర రాజకీయ క్షేత్రంలో బలమైన సిపిఐ(ఎం), కాంగ్రెస్‌లను నిందారోపణలతో, దౌర్జన్యాలతో, హింసా కృత్యాలతో అణగదొక్కారు. బిజెపి క్రమంగా ప్రధాన ప్రత్యర్థిగా ఎదిగింది. ఈ బలమైన ప్రాంతీయ పార్టీనుంచి అధికారం గుంజుకునేందుకు 2021 ఎన్నికల్లో తీవ్రమైన ప్రయత్నం చేసిన బిజెపి, మొన్నటి ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ సహాయం కూడా తీసుకుని తన లక్ష్యం నెరవేర్చుకుంది. అనూహ్యమైంది జరిగిపోయింది. తిరుగులేదనుకున్న మమతా బెనర్జీ రెక్కలు విరిగిన పక్షి అయింది. ఆమె కూడా ఓడిపోయారు. ఆమె దురవస్థపట్ల కనీసం సానుభూతి చూపే పార్టీ బెంగాల్‌లో లేకపోయిందంటే ఆమె ఎంతగా ఏకాకి అయినారో అర్థం చేసుకోవచ్చు.

దీని పర్యవసానం? మమతా బెనర్జీ స్థాపించిన పార్టీయే తనది కాకుండా పోయే పరిస్థితి నెలరోజుల్లోనే దాపురించింది. 80మంది టిఎంసి శాసనసభ్యుల్లో 58మంది తిరుగుబాటుచేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా తమ సొంత మనిషి రిటబ్రత బెనర్జీని ప్రతిపాదించారు. మమత అంతకు ముందు రోజే అతన్ని పార్టీనుంచి బహిష్కరించారు. స్పీకర్ వెంటనే గుర్తింపు ఇచ్చారు. వారు ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకున్నారు. తిరుగుబాటుదారులు వ్యూహాత్మకంగా 'మమతా బెనర్జీ' పట్ల విధేయత ప్రకటిస్తూ, పార్టీ ప్రధాన కార్యదర్శి, మమత మేనల్లుడు, రాజకీయ వారసుడు అభిషేక్ బెనర్జీ అథారిటీని బహిరంగంగా నిరాకరించారు. ఈ తిరుగుబాటు కొద్దిరోజుల్లోనే కోల్‌కతా నుంచి న్యూఢిల్లీకి విస్తరించిందంటే ఇదంతా ఒక 'అజ్ఞాత శక్తి' మార్గదర్శకత్వంలో పథకం ప్రకారం జరుగుతున్నట్లు సులువుగానే ఊహించవచ్చు. ఒకప్పుడు మమతా బెనర్జీకి గట్టి అనుయాయి, లోక్‌సభలో పార్టీ మాజీ చీఫ్ విప్ శ్రీమతి కకోలీ ఘోష్ దస్తీదార్ తిరుగుబాటు ముఖంగా ముందుకు వచ్చారు. తమకు 20 మంది లోక్‌సభ సభ్యుల తోడ్పాటు ఉందని, తమను సభలో ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని స్పీకర్ ఓం బిర్లాకు ఆమె లేఖ రాయటంతోపాటు తమ గ్రూపు ఎన్‌డిఎని బలపరుస్తుందన్నారు. అంటే వారి విధేయత మమతా బెనర్జీ నుండి నరేంద్రమోదీ, అమిత్ షా ల వైపు మారింది. 20 సంఖ్య ముఖ్యం. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు తప్పించుకోవాలంటే పార్టీ సంఖ్యాబలం లో మూడింట రెండు వంతులు వేరుపడాలి. కోల్‌కతాలో ఎమ్మెల్యేలు, ఢిల్లీలో లోక్‌సభ సభ్యులు నేర్పుగా ఆ ఆంక్షను అధిగమించే సంఖ్యలు కూర్చారు. అసెంబ్లీ స్పీకర్‌గాని, లోక్‌సభ స్పీకర్‌గాని లేఖలపై సంతకందారులను రూఢిపరుచుకున్న దాఖలాలు లేవు. రెండోవైపున, ప్రతిపక్ష నాయకునిగా అధికార అభ్యర్థిని తెలియజేస్తూ అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు రాసిన లేఖలో ఫోర్జరీ సంతకాలున్నాయని రిటబ్రత చేసిన ఫిర్యాదుపై సిఐడి విచారణ జరుగుతోంది. రాజ్యసభలో మరో వ్యూహం నడుస్తోంది. 11మంది టిఎంసి ఎంపిల్లో ముగ్గురు ఇప్పటికి పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ ఖాళీలు భర్తీ చేయటానికి అసెంబ్లీనుంచి ఉప ఎన్నికలు వస్తాయి. బిజెపివారు, ఒక తిరుగుబాటుదారు ఆ స్థానాలు నింపవచ్చు. డీలిమిటేషన్, లోక్‌సభ సీట్లు పెంపుదల ద్వారా మహిళా రిజర్వేషన్ అమలు, ఒక దేశం – ఒక ఎన్నికలు వంటి రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదంకోసం పార్లమెంటు ఉభయసభల్లో కనీస మెజారిటీకోసం బిజెపి వ్యూహాలు పన్నుతున్నది. తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తిరుగుబాటు ఆ దిశలో బిజెపికి పెద్ద ప్రోత్సాహం.

ఇప్పుడు మమత ఏమి చేస్తారు? తిరుగుబాటుదారుల ప్రకటనల ప్రకారం వారి పోరాటం టిఎంసి వారసత్వ రాజకీయంపై తప్ప మమతాబెనర్జీపై కాదు. ఆమె ఇప్పటికీ చాలామంది నాయకులకన్నా ఎక్కువ ప్రజాదరణ గల వ్యక్తి. మేనల్లుడు అభిషేక్ బెనర్జీని పక్కనబెట్టి తిరుగుబాటుదారులతో సయోధ్య సాధించటం సాధ్యమా? లేక ప్రజల్లోకి వెళ్లి బిజెపి ప్రభుత్వంపై, కేంద్ర నాయకత్వంపై పోరాటం కొనసాగిస్తూ సమయమొచ్చినపుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటారా? ఇండియా కూటమి ఢిల్లీ సమావేశానికి మమతా బెనర్జీ స్వయంగా హాజరుకావటం, కూటమిని పటిష్టం చేదామని చెప్పటం, సోనియాగాంధీతో ముఖాముఖీ చర్చలు, రాహుల్‌తో అభిషేక్ బెనర్జీ చర్చలు దృష్ట్యా ఆమె పోరాటానికి సిద్ధమవుతున్నారని భావించవచ్చు. ఈలోపు పార్టీ పేరు, గుర్తు లీగల్‌గా చేజారిపోకుండా చూసుకోవటం అవసరం. ఏమైనా ఇది సంఖ్యల ఆట. మహారాష్ట్ర నాటకం గుర్తుచేసుకోదగింది. శివసేన, ఎన్‌సిపిలను బిజెపి చీల్చింది. మెజారిటీ సంఖ్యాబలంతో పార్టీపేరు, ఎన్నికల గుర్తు చీలిక గ్రూపులకు దక్కాయి.!



### క్లిష్ట పరిస్థితుల్లో మమతకు అండగా ఉంటా

**నా రాజకీయ జీవితంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు మమతా బెనర్జీ నాకు అండగా నిలిచారు. ఆమె కష్టకాలంలో నేనూ ఆమె వెంటే ఉంటాను. దీదీని ఎప్పటికీ వదిలిపెట్టను. ఆసన్సోల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని నాడు మమత చెప్పడంతోనే ఎన్నికల బరిలోకి దిగాను. టిఎంసిపై నాకు పూర్తి నమ్మకముంది. ఆ పార్టీతోనే నా రాజకీయ ప్రయాణం కొనసాగుతుంది.**

- తృణమూల్ కాంగ్రెస్ ఎంపి, నటుడు శత్రుఘ్న సిన్హా




## ఎవ్వరో ఈ పిల్లలు నింగిలో నెలవంకలు ఎవ్వరో ఈ బిడ్డలు అడవిమల్లె పువ్వులు

** పొద్దు పొద్దునే లేస్తరు వారు చిత్తు కాగితాలు ఏర్తరు కార్ఖాన పొగలోనే ఉంటరు.*
*వారు కన్నీటి కష్టాలే చూస్తరు.*
** ఇటుక బట్టీలలో ఉంటరు వారు నేలమ్మ మట్టినే తింటరు*
*బడికి రాకుండ ఉంటరు వారు బాలకార్మికులవుతున్నరు*
** ఎన్ని ప్రభుత్వాలు మారెనో జండ పండుగలెన్ని వచ్చెనో ?*
*వారి జీవితాలు మారవాయే, వారి రాతలు చెడపరాయే*
** పలకా బలపం చేతికిద్దాం అక్షరాలు నేరిపిద్దాం ..*
*నమసమాజం మీదని చెప్పి నమసమాజం స్థాపించి ఇద్దాం!*

అవును ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది పాలకులు మారినా బాలకార్మిక వ్యవస్థ మారడం లేదు. వారి జీవితాలు మార్చడం లేదు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించుటకు 40 ఏళ్ళ క్రితం అనగా 1986లో ఒక చట్టం తీసుకువచ్చినారు. అందులో 14 సంవత్సరాల లోపు పిల్లలు మరియు 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలు అని రెండు గ్రూపులుగా చేసినారు. అందులో 14 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలను ఎవ్వరు కూడా పనులలోకి తీసుకోవద్దు, పనులకు పెట్టుకోవద్దు అని, అలాగే 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను కౌమారదశలో ఉన్నవారిని, వారిని యవ్వనదశలో ఉన్న యువత అని తెలియజేసి వారికి మాత్రం పని కల్పించవచ్చు. పనులలోకి తీసుకోవచ్చు. కాని రోజుకు కేవలం 6 గంటలు మాత్రమే వారితో పనిచేయించాలి అని చైల్డ్ లేబర్ యాక్ట్ అనే ఒక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. బాలబాలికలను ఎవ్వరైనా పనులకు పెట్టుకుంటే ,ఆ యజమానికి ఆరు నెలల జైలు శిక్ష లేక 25000 వేల జరిమానా లేక ఆ రెండు ఒకే సారి శిక్షగా విధించే చట్టాన్ని ప్రవేశపెట్టినారు కానీ ఆ చట్టాన్ని ఎవ్వరు పాటించడంలేదు. ఇప్పటికీ అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, ఇటుకబట్టీలు, హెూటళ్లు, పంక్చర్ దుకాణాలు, హైదరాబాద్ నగరంలోని చార్మినార్ ప్రాంతంలో కుటీర పరిశ్రమలుగా ఇళ్లల్లో గాజులు తయారుచేసే పరిశ్రమలలో అనేకమంది బాలకార్మికులు పనిచేస్తుంటే ఇటీవల అధికారులు వారికి విముక్తి కల్గించివారు. అలాగే మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ వంటి ప్రాంతంలో ఇప్పటికీ వేలమంది బాలకార్మికులు బడికి వెళ్ళకుండా బాలకార్మికులుగా ఉన్నారు.

దీనికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు వారికి, వారి ప్రాంతంలో ఉపాధి దొరక్క పోవడం వలన వారు ఇతర ప్రాంతాలకు వలస వస్తున్నారు. అలా వలస వచ్చిన ప్రాంతంలో పెద్దవారు ఏదో ఒక పనికి వెళ్ళడం వారి పిల్లలు మాత్రం ఇళ్ళల్లో ఉంచుతున్నారు. ఇళ్లల్లో ఉంచితే వారికి రక్షణలేదు అని వారికి కూడ ఏదో ఒక పనిలో చేర్చి వారిని బాలకార్మికులుగా మారుస్తున్నారు. మరికొన్ని కుటుంబాలలో ఇంటి పెద్దలు తాగుడుకు బానిసగా మారడం వలన ఆ కుటుంబాన్ని పోషించడానికి వారి పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారు. మరికొంతమంది పిల్లలు తల్లిదండ్రులు లేకపోవడం వలన అనాథలుగా మారి వారు బాలకార్మికులుగా మారుతున్నారు. కావున ప్రభుత్వాలు వలస కుటుంబాలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో ప్రభుత్వ బడులను ఏర్పాటుచేసి వారి పిల్లలను అందులో చేర్పించి వారికి విద్యను అందచేస్తే వారి జీవితాలలో మార్పు వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రజలు ఎవ్వరు కూడ వారి ఇండ్లల్లో బాలకార్మికులను పనికి తీసుకోవద్దు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై తీసుకువచ్చిన చట్టాన్ని ఖచ్చితంగా అమలుచేస్తే మార్పువస్తుందని, అలాగే వారికి ఉచిత విద్య, వైద్యం, ఉండడానికి హాస్టళ్లు ఏర్పాటుచేస్తే వారి జీవితాలను మార్చిన వారుగా అవుతాము. అలాగే వారి జీవితాలలో వెలుగులు నింపిన వారమవుతాము.



**యాసాని కరుణాకర్ రెడ్డి**
STUTS రాష్ట్ర కార్యదర్శి

# విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ... చిన్న మదుపరులకు నష్టం

**కునాల్ బోస్**

కొన్ని ముఖ్యమైన మినహాయింపులు మినహా ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్ సైనిక, ఆర్థిక సంపత్తిపై, అగ్ర రాజకీయ నాయకత్వంపై దాడి ప్రారంభించినప్పటి నుంచి ఐటి, బ్యాంకింగ్/ఆర్థిక సర్వీసులు, ఎఫ్ఎంసిజి, చమురు, సహజవాయువు వంటి దాదాపు అన్ని రంగాలలోని ఈక్విటీ షేర్ల విలువలు వివిధ స్థాయిలలో క్షీణించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి బెంజామిన్ నెతన్యాహు నేతృత్వంలోని ప్రభుత్వాల మొండి వైఖరి కారణంగా తలెత్తిన ఈ అనవసరమైన సంఘర్షణ ప్రపంచాన్ని తీవ్రమైన భౌగోళిక రాజకీయ సంక్షోభంలోకి నెట్టివేసింది. ఇంకా పరిష్కారం లభించని ఈ సంఘర్షణ కారణంగా పరిస్థితి మరోలా ఉండేందుకు ఆస్కారం లేదు.

ఈ నేపథ్యంలో బిఎస్ఇ, ఎన్ఎస్ఇలలోని షేర్ ధరల సూచీలు కొన్ని రోజులలో ఏ దిశలోనైనా వేగంగా కదులుతుండటంతో, బుల్స్, బేర్స్ మధ్య అడపాదడపా పోటీని ఊహించవచ్చు. యుద్ధం ప్రారం భం కావడానికి ముందే దీర్ఘకాలిక పెట్టుబడిగా షేర్లు కొనుగోలు చేసిన దాదాపు అందరు వ్యక్తిగత పెట్టుబడిదారుల పోర్ట్‌ఫోలియోలు నేడు నష్టాల్లో ఉన్నాయి. మెరుగైన రోజులలో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటి షేర్లు, ముఖ్యంగా ఐటిసి ఎఫ్ఎంసిజి షేర్లు కొనుగోలు చేసినవారే తాజా పతనంలో అత్యంత తీవ్రంగా నష్టపోయారు.

గత మూడున్నర సంవత్సరాలలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టిఎల)పై సంతకాలు చేయడంలో గొప్ప విజయం సాధించామని, జులై మధ్య నాటికి అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం మొదటి విడతను అమలు చేసే అవకాశం ఉందని పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ప్రకటించారు. అయినప్పటికీ, అధిక ఇంధన ధరలు, సరఫరా గొలుసు అంతరాయాలు, క్లిష్టమైన వాణిజ్య దృక్పథం వంటి తీవ్ర నిరాశాజనక పరిస్థితుల కారణంగానే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు, స్వింగ్‌స్టేక్స్(ఇలా వచ్చి అలా లాభం తన్నుకుపోయేవారు) ఆడేవాళ్ళు స్టాక్ మార్కెట్లో ధనాన్ని నష్టపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్టాక్, కమోడిటీ లేదా కరెన్సీ మార్కెట్ ఏదైనా, అది సానుకూలమైనా లేదా ప్రతికూలమైనా, ఏదైనా ప్రధాన ఆర్థిక లేదా రాజకీ య వార్తలకు అత్యంత సున్నితంగా స్పందిస్తుంది.

ఈ వారాంతంలో కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ పలు చర్యలను ప్రకటించాయి. వీటిలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పిఐ) ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీ, మూలధన లాభాలపై పన్ను మినహాయింపు, విదేశీయులు పెట్టుబడి పెట్టేందుకు వీలుగా సెక్యూరిటీల జాబితాను విస్తరించడం, సెబీ రిజిస్ట్రేషన్ లేకుండా ట్రేడ్ అయ్యే ఈక్విటీ సాధనాలలో ఎన్నారైలు, ఓసిఐలు, భారతదేశం వెలుపల నివసించే వారందరికీ పెట్టుబడి పరిమితులను పెంచడం వంటివి ఉన్నాయి. ఈ చర్యలు విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంతో పాటు రూపాయిని కూడా బలోపేతం చేస్తాయి. ఊహించిన విధంగానే ప్రభుత్వం, ఆర్‌బిఐ ప్రకటన తరువాత అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గత రెండు నెలల్లోనే అత్యధికంగా 84 పైసలు పెరిగి రూ.94.95కు చేరింది మళ్లీ క్షీణించి రూ.96 దాటింది.

రూపాయి విలువను పెంచడానికి అధికారికంగా జోక్యం చేసుకోవాలా, వద్దా, ఒకవేళ చేసుకుంటే ఏ దశలో చేయాలి, ప్రస్తుతం సుమారు 685 బిలియన్ డాలర్లుగా ఉన్న నిల్వల నుండి డాలర్లను విక్రయించటం ద్వారా ఈ జోక్యం చేసుకోవాలా అనే విషయంపై విధాన రూపకర్తలు, కేంద్ర బ్యాంకర్లు, ఆర్థికవేత్తల మధ్య ఏకాభిప్రాయం ఇంకా కుదరలేదు. వాస్తవానికి, కరెన్సీ విలువ సాధారణ ప్రజలకు ఒక భావోద్వేగ సమస్యగా మిగిలిపోయింది. అయినప్పటికీ, రూపాయి విలువ పడిపోతూనే ఉంటే, అధికారం లో ఉన్న ప్రభుత్వం విమర్శలకు గురవుతుంది. ఇక్కడ విస్మరిస్తున్న విషయం ఏమిటంటే, కరెన్సీ విలువను దాని అసలు విలువ కంటే ఎక్కువగా నిర్ణయిస్తే, ఎగుమతిదారులు విదేశీ మార్కెట్లలో తమ పోటీతత్వాన్ని కోల్పోతారు.

***విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) భారతీయ కంపెనీల షేర్లను నిరంతరం అమ్మడం పరిస్థితిని మరింత దిగజార్చింది. జూన్ 3వ తేదీ నాటికి వారి ఖాతా నుండి రూ.2.6 లక్షల కోట్ల మేర నిధులు బయటకు వెళ్లగా, ఇది గత ఏడాది మొత్తం రూ.1.7 లక్షల కోట్ల కంటే చాలా ఎక్కువ. దేశంలో బలమైన దేశీయ మదుపుదారుల బలం ఉండ టం ఒక ఆశాకిరణం, ఈ బలం గురించి చాలా దేశాలు చెప్పకోలేవు.***




చైనా విషయాన్నే తీసుకుందాం. అమెరికా నుండి నిరంతర ఒత్తిడి, ఐఎంఎఫ్ ప్రోత్సాహం ఉన్నప్పటికీ, అనుసరిస్తున్న ఆర్థిక నమూనాను బట్టి చైనీస్ యువాన్ విలువ 15 నుండి 25 శాతం తక్కువగానే ఉంది. వాస్తవం ఏమిటంటే, ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా, స్థిరంగా 1 ట్రిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య, విదేశీ మారకపు మిగులును నమోదు చేస్తోంది. ఒక స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థలో ఇలాంటి పరిస్థితి ఉండి, అక్కడి సెంట్రల్ బ్యాంక్‌పై ప్రభుత్వ ఒత్తిడి లేకపోతే, కరెన్సీ విలువ పెరిగి ఉండేది. అమెరికా ఎంత అసంతృప్తిగా ఉన్నప్పటికీ, యువాన్ విలువను కృత్రిమంగా తక్కువగా ఉంచడం ద్వారా ప్రపంచ మార్కెట్లో ఎగుమతిదారులు తమ పోటీతత్వాన్ని నిలుపుకోవడానికి బీజింగ్ నిశ్చయించుకుంది.

ఏది ఏమైనప్పటికీ, విదేశీ పెట్టుబడిదారులు, విదేశాలలో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించి భారతదేశం చేసే ప్రకటనలు మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచాలి. ఎందుకంటే విదేశీ కరెన్సీ ప్రవాహాలు పెరగనున్నాయి. అదే సమయంలో, 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బిఐ తన జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) అంచనాను ఏప్రిల్‌లో అంచనా వేసిన 6.9 శాతం నుండి 6.6 శాతానికి తగ్గించడంతో, పెట్టుబడిదారులు, బ్రోకర్లు అప్రమత్తంగా ఉండటానికి కారణాలు ఉన్నాయి. అధిక ఇంధన, వస్తు ధరలు, పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల సరఫరాలో ఏర్పడిన అంతరాయాలు, నిరాశాజనకమైన రుతుపవనాల అంచనాలు వంటి అంశాలు వృద్ధి అంచనాలను తగ్గించడానికి ఆర్‌బిఐపై ఒత్తిడి తెచ్చి ఉండవచ్చు.

భౌగోళిక రాజకీయ సంక్షోభం, పెరిగిన ఇంధన ధరలు, టారిఫ్ అనిశ్చితులు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా గొలుసులలో ప్రకంపనలు వంటి కారణాలతో భారత స్టాక్ మార్కెట్ ఎదుర్కొంటున్న ప్రతికూలతలు ప్రపంచంలోని మిగతా ప్రాంతాలలో కూడా ఉన్నాయి. అయితే, ఈ అంశా లు భారతీయ కంపెనీల ఆదాయ అవకాశాలను విస్తృతంగా మసకబార్చడంతో పాటు, దాదాపు అన్ని షేర్ల ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) భారతీయ కంపెనీల షేర్లను నిరంతరం అమ్మడం కూడా పరిస్థితిని మరింత దిగజార్చింది. జూన్ 3వ తేదీ నాటికి వారి ఖాతా నుండి రూ.2.6 లక్షల కోట్ల మేర నిధులు బయటకు వెళ్లగా, ఇది గత ఏడాది మొత్తం రూ.1.7 లక్షల కోట్ల కంటే చాలా ఎక్కువ. దేశంలో బలమైన దేశీయ మదుపుదారుల బలం ఉండ టం ఒక ఆశా కిరణం, ఈ బలం గురించి చాలా దేశాలు చెప్పుకోలేవు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఎఎంఎఫ్ఐ), దాని సభ్య సంస్థలు చేస్తున్న నిరంతర ప్రచారం కారణంగా ఈక్విటీల పట్ల ఆదరణ పెరుగుతూనే ఉంది.

అయితే, విదేశీ పెట్టుబడిదారులలో భారతీయ ఈక్విటీల పట్ల ఈ మధ్యకాలంలో ఇంతటి నిరాసక్తతకు కారణమేమిటి? ఇతర అనేక మార్కెట్లతో పోలిస్తే భారతదేశంలో విలువ మదింపులు చాలా ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు ఏకాభిప్రాయంతో ఉన్నారు. తులనాత్మకంగా మంచి మదింపు అందుబాటులో ఉన్నందున ప్రస్తుతం దక్షిణ కొరియా, తైవాన్‌లు విదేశీ పెట్టుబడిదారులకు ప్రాధాన్య మార్కెట్లుగా ఉన్నాయి. అంతేకాకుండా, ఆ రెండు సుదూర తూర్పు దేశాలు ఏఐలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి, అక్కడి కంపెనీలు వాటిని స్వీకరిస్తున్నాయి. విదేశీ పెట్టుబడిదారులు నిరంతరం మదింపు తేడాలను గమనిస్తుంటారు. అయితే, సిటీ గ్లోబల్ సిఇఒ జేన్ ఫ్రేజర్ ఎకనామిక్ టైమ్స్‌కు చెప్పినట్లుగా: భారతదేశం దీర్ఘకాలిక కథ చెక్కుచెదరకుండా ఉంది. పెట్టుబడిదారులు భారతదేశాన్ని విడిచిపెట్టలేదు. వారు కేవలం కొన్ని చక్రీయ, ఇతర అంశాలు తమ ప్రభావాన్ని చూపడం కోసం వేచి చూస్తున్నారు.

మనం ఇప్పుడు చూస్తున్నది భారతదేశం నుండి నిర్మాణాత్మకంగా దూరం కావడం కాదు, కేవలం ఒక విరామం మాత్రమే. ఎందుకంటే పెట్టుబడిదారులు ప్రపంచ పరిస్థితులను వాటి విలువలను, భౌగోళిక రాజకీయ ప్రమాదాలు లేదా ద్రవ్య విధానం కావచ్చు పునఃసమీక్షిస్తున్నారు. కానీ ప్రాథమికంగా, భారతదేశం ప్రత్యేకంగా నిలుస్తూనే ఉంది. దాని కథ చెక్కుచెదరకుండా ఉంది. జేన్ ఫ్రేజర్ సందేశం భారత మార్కెట్‌కు చేరుతుందని ఆశిద్దాం.

# సింగరేణి పరిరక్షకుడు కొమరయ్య

## హక్కుల సాధనతో యూనియన్ కొమరయ్యగా కీర్తి

నేడు ప్రభుత్వ ఆధీనంలో సింగరేణి సంస్థ పని చేస్తుంది అంటే అందుకు ఒకే ఒక వ్యక్తి కారకుడు. ఆయనే మనుబోతుల కొమరయ్య అలియాస్ యూనియన్ కొమరయ్య. సింగరేణి పీకల లోతు నష్టాల్లో కూరుకుపోయినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగరేణిని ప్రైవేటీకరించాలని నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సింగరేణిలోని కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. తన అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పుడు ఏ కార్మిక సంఘం నాయకుడు సరైన రీతిలో స్పందించ లేదు. అప్పుడు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ప్రధాన కార్యదర్శిగా కొమరయ్య లేచి నిలబడి నష్టాల కారణంగానే సింగరేణిని ప్రైవేటీకరించదలిస్తే కార్మికులంతా ఏకమై సింగరేణిని లాభాల బాట పట్టించి సింగరేణిని కాపాడుకుంటాం, మాకు అవకాశం ఇవ్వండి అని కోరారు. సింగరేణి చరిత్రలో కొమరయ్యకు ఉన్న అనుభవం, ఆయన పోరాట పటిమ, కార్మికుల్లో ఆయనకు ఉన్న గౌరవం తెలుసుకున్న చంద్రబాబు నాయుడు తాత్కాలికంగా ప్రైవేటీకరణను వాయిదా వేస్తున్నాం. లాభాలు రాని పక్షంలో ప్రైవేటీకరించక తప్పదని ఓ అవకాశాన్ని ఇచ్చారు. ఆ అవకాశాన్ని సానుకూలంగా మార్చుకున్న కొమరయ్య సింగరేణివ్యాప్తంగా నిరంతరం పర్యటిస్తూ సమ్మెకు, పోరాటాలకు తాత్కాలిక విరామం ఇచ్చి కార్మికుల సహకారంతో సింగరేణిని లాభాల బాట పట్టించాడు. నాటి కొమరయ్య ఆలోచన, కార్మికుల సహకారమే ఈనాడు సింగరేణి సంస్థ ప్రైవేటీకరించకుండా నిలబడింది. అంతటి నేపథ్యం కలిగిన యూనియన్ కొమరయ్య 12 జూన్ 1928న పారిశ్రామిక ప్రాంతమైన ఇల్లందులో కార్మిక కుటుంబంలో జన్మించారు. ఇల్లందులో జరిగిన ఉబ్బసమ్మె సందర్భంగా ప్రజా ఉద్యమాలకు ఆకర్షితుడై చదువుకు స్వస్తి చెప్పి దేవూరి శేషగిరిరావు నేతృత్వంలో ప్రజా పోరాటాలకు వెళ్లారు. 1940లోనే కొత్తగూడెం సింగరేణి మెయిన్ వర్క్‌షాపులో టర్నర్‌గా ఉద్యోగంలో చేరారు.

1942లో భారతదేశంలో రైల్వేస్ తర్వాత ప్రముఖ ఘటన కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావం. ప్రథమ మహాసభ నిర్వహణలో కొమరయ్య కీలక భూమిక పోషించారు. సింగరేణిలో 12 గంటల పని విధానానికి వ్యతిరేకంగా కొమరయ్య నడిపిన చారిత్రాత్మక ఉద్యమంతో ఎనిమిది గంటల పని విధానం అమల్లోకి వచ్చింది. ఎనిమిది లక్షల మంది బొగ్గు గని కార్మికుల పక్షాన ఏఐటియుసి తరుపున ఐబిసిసిఐలో చాలా కాలం శాశ్వత ప్రతినిధిగా కొమరయ్య పనిచేశారు. కొమరయ్య జీవితం ఆది నుంచి పోరాటమే. 1947లో అరెస్టు అయి 1948 వరకు జైలు



నేడు కొమరయ్య జయంతి



ఇటీవల కొత్తగూడెంలో ఆవిష్కరించిన కొమరయ్య విగ్రహం

జీవితం గడిపాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఏడాది పాటు రహస్య జీవితం గడుపుతూ ఖమ్మం జిల్లాలో జరిగిన గుంపెన పోరాటంలో ఆయన పాల్గొన్నారు. కొమరయ్య చురుకుతనం చూసి అప్పటి ప్రభుత్వం ప్రమాదకర వ్యక్తిగా భావించి అరెస్టు చేసి మహారాష్ట్రలోని జల్నా జైలు కు ఆయనను తరలించింది. అనేక చిత్ర హింసలకు గురి చేసింది. మూడేళ్ల పాటు జైలు జీవితం గడిపిన కొమరయ్య జైలునుంచి విడుదలైన తర్వాత సింగరేణిలో కార్మిక హక్కుల సాధన కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించారు. రజాకార్ మూకలు రెండు సార్లు కొత్తగూడెం యూనియన్ కార్యాలయాన్ని ధ్వంసంచేసి ఆక్రమించుకుంటే జైలు నుంచి విడుదలైన తర్వాత కార్మికుల సహకారంతో యూనియన్ కార్యాలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని యూనియన్ పతాకాన్ని ఎగుర వేశారు. ఒక జంట హత్యల కేసులో కొమరయ్యను ముద్దాయిగా చేసి అవమాన పరిచేవిధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించింది. దాదాపు 100మందిని జైలుపాలు చేశారు. సాక్ష్యాధారాలు సమర్పించి ఎలాంటి శిక్ష లేకుండా వారందరిని విడుదల చేయించడమే కాకుండా తిరిగి ఉద్యోగాలు వచ్చేవిధంగా కొమరయ్య కృషి చేశారు. 1966 లో రామకృష్ణాపురం సహా పలు ప్రాంతాల్లో యూనియన్ విస్తృతికి కొమరయ్య కృషి చేస్తున్న సమయంలో అనేక దాడులను ఎదుర్కొన్నారు. అయినా వెరవక యూనియన్ కోసం తుదిశ్వాస వరకు శ్రమించారు. ఏఐటియుసి వర్కింగ్ కమిటీ సభ్యులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా పనిచేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఆయన పనిచేశారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్నది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి సింగరేణి కార్మికులకు శాపం గా మారింది. కార్మికులు హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ స్థితిలో సింగరేణి పరిరక్షణకు, హక్కుల సాధనకు మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది. కొమరయ్య స్ఫూర్తి, యూనియన్ చారిత్రక పోరాట నేపథ్యం సింగరేణిని సంక్లిష్ట స్థితి నుంచి కాపాడుతుందని ఆశిద్దాం. కొమరయ్యకు నివాళులు.

**ఏనుగు వెంకటేశ్వరరావు,** ఖమ్మం





# దేశ ప్రగతికి విద్య, వైద్యమే బలమైన పునాది

- విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం6 టాస్క్ ఫోర్స్'ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ 6 మహానగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని సూచించారు. ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోట్ల చొప్పున అందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సమావేశంలో పలు ప్రతిపాదనలు చేశారు. దేశం ప్రగతి సాధించడానికి విద్య, వైద్యం బలమైన పునాదిగా నిలుస్తాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సిఎం నొక్కి చెప్పారు. భూమి కంటే విద్య సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో వెల్లడైందన్నారు. రాష్ట్రపతి భవన్‌లో గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కుల గణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను సమావేశంలో వివరించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో 2వ దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని సిఎం కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అని, ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (ఎస్ఇఇఇపిసి)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో ఆర్థిక స్థితిగతులు, భూమి కంటే విద్య సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా వెల్లడైందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఈ ప్రాధాన్యత నేపథ్యంలోనే విద్యా శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న విషయాన్ని, విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలను ప్రస్తావించారు. గడచిన 75 ఏళ్లలో ఉచిత విద్య అందించేందుకు అందరూ ప్రయత్నించారు. కానీ నాణ్యమైన విద్యను అందించడం ఒక సవాల్‌గా మారిందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందనిపేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తెలంగాణలో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా స్కూల్స్ సందర్శిస్తే సంతోషిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమన్నారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటి, ఐఐఐటి, నల్సార్, ఐఎస్‌బి వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నాయని గుర్తు చేస్తూ, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని దాని ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో బాలికలదే మొదటి స్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో మొదటి సంవత్సరంలో 68.71 శాతం, ద్వితీయ సంవత్సరంలో 47.70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో కూడా బాలికలే మొదటి స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో బాలికలు 76.10 శాతం, బాలురు 62.57 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలికలు 52.56 శాతం, బాలురు 47.45 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇంటర్ బోర్డ్ సూచించిం ది. ఉత్తీర్ణత సర్టిఫికెట్ అందే వరకు విద్యార్థులు ఈ డౌన్‌లోడ్ చేసుకున్న డిజిటల్ మార్క్స్ మెమోలనే రికార్డుగా భద్రపరుచుకోవాలని సూచించింది. ఇంటర్ ఫలితాలను ఇంటర్‌బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ గురువారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,98,459 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవ్వగా ఇందులో మొదటి సంవత్సర విద్యార్థులు 1,72,056 మంది (68.71 శాతం), ద్వితీయ సంవత్సరంలో 56,904 మంది (47.70 శాతం) విద్యార్థులు పాస్ అయ్యారు. గత 2024 సంవత్సరంలో 63.82 శాతం, 2025లో 67.36 శాతం, ప్రస్తుతం అధికంగా 68.71 శాతం ఉత్తీర్ణత సాధించారు.అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2024లో 43.79 శాతం, 2025లో 50.96 శాతం, ప్రస్తుతం 47.70 శాతం ఉత్తీర్ణత పొందారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉతీర్ణత శాతం తగ్గింది. కాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 88.33 శాతంతో ములుగు మొదటి స్థానంలో నిలువగా, 33.39 శాతంతో చివరి స్థానంలో హైదరాబాద్ –1 ఉన్నది. అలాగే మొదటి సంవత్సరంలో 91.26 శాతంతో ములుగు మొదటి స్థానంలో ఉండగా, 52.81 శాతంతో హైదరాబాద్2 ఉన్నది.

## 'సర్' ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఒవైసీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలంతా అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఎఐఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసి అన్నారు. ఓటర్ల జాబితాలో పేరు తొలగించబడితే పౌరసత్వ నిర్ధారణ, భవిష్యత్ సంక్షేమ పథకాల అర్హత వంటి అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని తమ పేర్లు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇప్పటికే అనేక మందికి శిక్షణ ఇచ్చి వారి వివరాల మ్యాపింగ్, పత్రాల అప్‌లోడ్ నమోదు ప్రక్రియలో సహాయం చేస్తున్నామని తెలిపారు. ఓటు హక్కు, పౌరసత్వ హక్కులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలాధారాలని, వాటి పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ పేర్లు, కుటుంబ వివరాలు, పత్రాలను సరిచూసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులను లేదా సహాయక కేంద్రాలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కును ధృవీకరించుకునేందుకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన 12 రకాల పత్రాలలో తెలంగాణలో అమలులో లేని 'పర్మనెంట్ రెసిడెన్స్ సర్టిఫికెట్' వంటి 3 రకాల పత్రాలను జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. రాష్ట్రంలో ఫ్యామిలీ రిజిస్టర్ వ్యవస్థ కూడా లేదని, ఎన్ఆర్‌సిని రాష్ట్రంలో చేపట్టకపోవడం వల్ల ఈ 3 పత్రాలు అందుబాటులో లేవని వివరించారు. వీటి స్థానంలో రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులను చేర్చాలని ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని ఆయన కోరారు.

## తహసీల్దార్, ఆర్‌డిఓ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా అద్దె, శిథిలావస్థ భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్‌టిఓ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం రెవెన్యూ, హౌసింగ్ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన, గౌరవప్రదమైన సేవలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు హుందాగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ భవనాల నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించామన్నారు.

### మొదటి దశలో 125 తహసీల్దార్ కార్యాలయాలు

రాష్ట్రంలో అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల వివరాలను అధికారుల నుంచి మంత్రి సేకరించారు. తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్‌డిఓ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు ఇవ్వాలని రెవెన్యూ కార్యదర్శిని ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అన్ని భవనాలు తక్కువ ఖర్చుతో, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒకే నమూనా (యూనిఫామ్ డిజైన్)లో ఉంటాయని, సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి, వీటికి తుది రూపు ఇస్తామన్నారు.

### ఒఆర్ఆర్ పరిధిలో 12 క్లస్టర్లు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పటికే అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. గచ్చిబౌలి, మేడ్చల్‌మల్కాజిగిరి, పటాన్‌చెరు, కోహెడలలో ఇప్పటికే భవనాలకు శంకుస్థాపనలు పూర్తయి, పనులు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అక్కడ జరిగే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌ల సంఖ్యకు అనుగుణంగా నిర్మిస్తామన్నారు. ఈ క్రమంలో రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 4,000 నుండి 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే మోడల్‌లో నిర్మించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు, ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. కొన్ని మండలాలను రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చేలా అస్తవ్యస్తంగా మార్చారని, అనేక కార్యాలయాల్లో కనీస వసతులు, సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందన్నారు. దీనిపై త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించబోతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## ఆర్‌జిఐఎలో ఓవర్‌స్టే ఛార్జీలపై డ్రైవర్ల ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జిఐఎ)లో ఇటీవల అమలు చేసిన 8 నిమిషాల ఉచిత డ్రాప్‌ఆఫ్ పరిమితి, ఓవర్‌స్టే ఛార్జీల విధానంపై తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (డిజిపిడబ్ల్యుయు) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విమానాశ్రయ ర్యాంపుల వద్ద ట్రాఫిక్ రద్దీ, ప్రయాణికుల లగేజీ నిర్వహణలో జాప్యం, వృద్ధులు, దివ్యాంగులకు సహాయం చేయాల్సిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఈనిర్ణయం అమలు చేయడం డ్రైవర్లపై అదనపు భారం మోపుతోందని యూనియన్ ఆరోపించింది. ప్రస్తుతం 8 నిమిషాలకు మించి నిలిచిన వాహనాలపై రూ.250 నుంచి రూ.500 వరకు జరిమానాలు విధిస్తున్నారని, ఇప్పటికే ఇంధన ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ఓలా, ఉబెర్, రాపిడో డ్రైవర్లకు ఇది మరింత భారంగా మారిందని పేర్కొంది. డ్రాప్‌ఆఫ్ సమయాన్ని కనీసం 10 నుంచి 15 నిమిషాలకు పెంచాలని, ఓవర్‌స్టే జరిమానాలను సమీక్షించి తగ్గించాలని, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచాలని డిమాండ్ చేసింది. డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఓలా, ఉబెర్, రాపిడో డ్రైవర్లు ఎయిర్‌పోర్ట్ ట్రిప్‌ల బహిష్కరణను పరిశీలించాల్సి వస్తుందని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ హెచ్చరించారు.

## యూనిఫాం ఒక హోదా కాదు.. కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక

**బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో 'దీక్షాంత్ పరేడ్'లో మంత్రి జూపల్లి**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యూనిఫాం ఒక హోదా కాదు.. కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక అని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్)లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా విధుల్లోకి అడుగు పెడుతున్న అధికారులు ప్రజాసేవ, కర్తవ్యనిష్ఠ, నిజాయితీని తమ సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్ కట్టడికి,సింథటిక్ డ్రగ్స్, ఆన్‌లైన్ నార్కోటిక్ నెట్‌వర్క్‌లు కొత్త సవాళ్లు. డ్రగ్స్ నెట్‌వర్క్‌ల కట్టడికి ఏఐ, డేటా అనలిటిక్స్,డ్రోన్లను ఉపయోగించాలని మంత్రి సూచించారు. తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి నిఘా వ్యవస్థలను తీసుకువస్తాం డ్రగ్స్,గంజాయి ముఠాలపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి,అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా ఆరు నెలల కఠోర సంస్థాగత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు,89 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖ మాత్రమే కాదని,యువతను వ్యసనాల భారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించే అత్యంత కీలకమైన విభాగమని మంత్రి స్పష్టం చేశారు. నేటి కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వినియోగించి కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడానికి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలు కొత్త అధికారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ,అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమిషనర్ అంజన్ రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి,చీఫ్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యూనియన్ హెచ్చరించింది. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న స్థానిక వంట విధానాన్నే కొనసాగించాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ విధానం వల్ల వేలాది మంది కార్మికుల ఉపాధికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో నిర్వహించిన అల్పాహార కార్యక్రమాలకు సంబంధించిన రూ.23 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరింది. పెండింగ్ బిల్లుల కారణంగా కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన బియ్యం, పప్పులు, నూనె, గ్యాస్, కోడిగుడ్లు తదితర సరుకులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేసింది. ఒక వేళ అది సాధ్యం కాకపోతే ప్రస్తుతం అమలులో ఉన్న స్లాబ్ రేట్లను రూ.25కు పెంచాలని కోరింది. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని అధికారికంగా కార్మికులుగా గుర్తించి, ఎవరినీ విధుల నుంచి తొలగించకుండా రక్షణ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, అది సాధ్యం కాకపోతే గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలైన రూ.10 వేల వేతనాన్ని అయినా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేమ పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు కమలారెడ్డి, తోపునూరు చక్రపాణి, ఉపాధ్యక్షులు ముంతాజ్, వసంత, కవిత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





### మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్

| NIT No & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 09/DB/ EE-II/Bowenpally Circle/ MMC/2026-27, తేది: 11.06.2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, బోయిన్‌పల్లి సర్కిల్-03 పరిధిలోని వివిధ ప్రాంతాలలో క్యాచ్‌పిట్ (catchpit) వివరాలు మరియు గోడ నుండి దాని దూరాన్ని సూచిస్తూ రేడియం స్టిక్కరింగ్ మరియు పెయింటింగ్ పనులు చేపట్టడం. (1 పని) | రూ.2.60 లక్షలు | 11.06.206 సా.4.30 గం.లకు | 12.06.2026 సా.4.30 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.

DIPR R.O. No. : 4094-PP/CL/ADVT/2026-27, Date: 11-06-2026

### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

GHMC

ఇఇ - డివిజన్-40, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

"E"-procurement - NIT నం.: 13/EE/Div-40/SBZ/GHMC/2026-27, తేదీ: 11.06.2026

**పని పేరు: జిహెచ్ఎంసి - ఎస్‌బిజెడ్:-** జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్ వెటర్నరీ విభాగంలో (1) సంవత్సరం కాలానికి, రోజుకు 8 గంటల పని వేళలతో కుక్కలను పట్టుకునే పనుల కోసం డ్రైవర్‌తో కూడిన (4) అనుకూలీకరించిన (కస్టోమైజ్డ్) పికప్ వాహనాలు లేదా తత్సమాన వాహనాలు మరియు (4) సెమీ-స్కిల్ వర్కర్లను వినియోగించుకోవడం. **బిడ్ సమర్పణకు చివరి తేదీ & సమయం:** 15.06.2026, మధ్యాహ్నం 03:00 గంటలకు. **సంప్రదించవలసిన అధికారి:** శ్రీమతి డి.ఆశాలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-, సర్కిల్-40, కవాడిగూడ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి; సెల్: 7995007374. **చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-40, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి, అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్: www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / జెడ్‌సిటిఓ, డివిజన్-40, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 4110-PP/CL/ADVT/2026-27, Date: 11-06-2026

### తెలంగాణ ప్రభుత్వము
### ఉపసంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము, మంచిర్యాల్ జిల్లా.

ఆర్.సీ.నం. A2/106/2025 — టెండరు ప్రకటన — తేది : 11.06.2026

ఉపసంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, మంచిర్యాల్ జిల్లా లోని (17) Pre Matric (08) Post matric వసతి గృహాలకు 2026-2027 సంవత్సరానికి గాను దిగువ తెలుపబడిన సేవలు అందించుట కొరకు మంచిర్యాల జిల్లా కి చెందిన అర్హులైన ఏజెన్సీ వారి నుండి కోరబడుచున్నవి.

| క్రమ సంఖ్య | సేవల వివరాలు | వివరాలు | ధరావత్తు | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| (17) Pre Matric and (08) Post matric వసతి గృహాలకు 2026-2027 సంవత్సరానికి గాను దిగువ | | | | |
| 1 | కూరగాయలు మరియు పండ్లు | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | రూ.3000=00 | రూ. 3000=00 |
| 2 | చికెన్ ( స్కిన్ లేకుండా) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | రూ. 30,000=00 | రూ.30,000=00 |
| (08) Post matric వసతి గృహాలకు 2026-2027 సంవత్సరానికి గాను దిగువ | | | | |
| 1 | క్యాటరింగ్ (వంట చేయుటకు) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | రూ. 5,00,000=00 | రూ. 3000=00 |
| 2 | స్వీపింగ్ మరియు సానిటేషన్ | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |
| 3 | డే మరియు నైట్ వాచ్ మెన్ (సెక్యూరిటీ సర్వీస్) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |

కావున ఆసక్తి గల మంచిర్యాల జిల్లా కి చెందిన ఏజెన్సీ వారు పైన తెలుపబడిన సేవలను అందించుట కొరకు రూ.3000-00 Demand Draft **Deputy Director Sc Development Department, Mancherial** జిల్లా పేరున టెండర్ ఫారం నియమ నిబంధనల ప్రకారం తేది **12.06.2026 ఉ. 10.30 నుండి 19.06.2026 సాయంత్రం 4:00** గంటల వరకు ఉపసంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము, మంచిర్యాల్ జిల్లా నుండి పొందవచ్చును పూర్తి చేయబడిన టెండర్లు తేది 20.06.2026 నాడు సాయంత్రం 4:00 గంటల లోపు స్వీకరించబడును. ఇట్టి టెండరు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మంచిర్యాల్ కార్యాలయము నందు తేది **22.06.2026 నాడు సమయం సాయంత్రం 3:00 PM గంటలకు తెరువ బడును.** గడువు తరవాత వచ్చిన టెండర్ ఫారములు స్వీకరించబడవు. ఇట్టి టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దు పరుచాటకు గాని అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్) మంచిర్యాల్ జిల్లా గారికి పూర్తి అధికారము కలదు.

సం/- అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) (తరపున)
చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ, మంచిర్యాల్ జిల్లా

DIPR R.O. No. : 4058-PP/CL/ADVT/2026-27, Date: 11-06-2026



## సర్ పేరుతో ఓటర్ హక్కులను హరించొద్దు : ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సర్ పేరుతో ఓటర్ హక్కులను హరించవద్దని ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కత్తి వెంకట స్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సర్ వల్ల పేదలు, కార్మికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. వారి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమీషన్‌కు ఉందని అన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని ఇది గొప్ప ఆయుధమన్నారు. దీనిని హరించేలా వ్యవహరించడం సరి కాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామిక హక్కులకు భంగం కల్గించే చర్యలను అంగీకరించమన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తుందని, ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, జానయ్య పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కు సమృద్ధిగా అందుబాటులో ఎరువులు

ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్** : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.గురువారం నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల నిల్వలు, సరఫరా పరిస్థితులు, రైతుల అవసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎరువుల కొరత తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈసమావేశంలో నకిరేకల్ ఏడీఏ టీ.విజయేందర్‌రెడ్డి,ఏవో.మహమ్మద్ జానీ మియా,మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఎఐ' సాంకేతిక వినియోగం ద్వారా పనితీరులో వేగం, సామర్థ్యం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతోపాటు సమయాన్ని ఆదా చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం వచ్చినా దొరల పాలనా?

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టె

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్ధాలు గడిచినా, సూర్యాపేటలో ఇప్పటికి దొరల పాలన కొనసాగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లక్షలాది మందికి చేరవేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌లో జరిగిన ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, సూర్యాపేటలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పేదలు మున్సిపాలిటి అనుమతులతో ఇళ్లు నిర్మించుకుని పదేళ్లకు పైగా నివసిస్తున్న వెంచర్లలో అక్రమ పద్ధతుల్లో డాక్యుమెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సూర్యాపేటలో పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు దొరల ఆధిపత్యానికి బలికావద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు బొల్లె సైదులు, మమహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, కుంభం వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## 45 రోజుల జైలుశిక్ష

**ప్రజాపక్షం/చివ్వెంల** : బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఓ వ్యక్తికి 45 రోజుల జైలు శిక్ష విధించినట్లు చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు. మండలంలోని దురాజుపల్లి గ్రామానికి చెందిన రాపాని శ్రీను గతంలో జరిగిన కొట్లాట కేసులో నింధితుడుగా ఉన్నాడని అతడిని 2025 నవంబర్ 4న మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (తహశీల్దార్) ఎదుట సత్ప్రవర్తనకు సంబంధించి బైండోవర్ చేసినట్లు చెప్పారు. కాగా బైండోవర్ అమలులో ఉండగానే మరో కేసులో ఉండి నిబంధనలను ఉల్లంఘించినట్లు తాము గుర్తించామన్నారు. అతడిని తహశీల్దార్ ఎదుట హాజరు పర్చుగా నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.3లక్షలు చెల్లించాలని అది చెల్లించనిచో 45 రోజుల జైలు శిక్ష విధించడంతో జైలుకు తరలించినట్లు తెలిపారు.

### ఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులను

# జూలై 31 లోగా పూర్తి చేయండి

ఎఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులపై మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి



**ప్రజాపక్షం/నల్లగొండ:** సుమారు రూ.442 కోట్లతో చేపట్టిన ఎఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులను జూలై 31 లోగా సాధ్యమైనంత ఎక్కువగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన నల్గొండ మండలంలోని నర్సింగ్‌బట్ల,కుదవన్‌పూర్,గుండ్లపల్లి వద్ద ఎఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులను పరిశీలించారు.పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి,పనులను ఇంకా వేగవంతం చేయాలని, జూలై 31 లోగా ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువ పనులు పూర్తి చేసి ఎక్కువ నీరు సులభంగా కిందికి వెళ్లేలా చూడాలని అన్నారు. లైనింగ్ కోసం తాను ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.442 కోట్లను మంజూరు చేయించానని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు మేలు కలిగే విధంగా ఈ వానాకాలం పంటకు ఎక్కువ నీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఎంఆర్‌పి కాలువ లైనింగ్ పనులు అంగడిపేట నుంచి మొదలుకొని మూసీ వరకు సుమారు 136 కిలోమీటర్ల మేర చేపట్టారు.1985/86లో ఏఎమ్ఆర్‌పి కాలువ తవ్వకం పూర్తి కాగా,40 సంవత్సరాల తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో లైనింగ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. కాలువ లైనింగ్ పనులు పూర్తయితే 2.20 లక్షల ఎకరాలకు సాగునీటిని సులభంగా అందించవచ్చు. ప్రస్తుతం లైనింగ్ లేనందువల్ల ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లైనింగ్ పూర్తయితే కాలువలో నీరు సులభంగా ప్రవహించి త్వరగా చివరి వరకు చేరుతుంది, అంతేకాక ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఉంది.మంత్రి వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ భద్రు, ఈఈ నెహ్రూ నాయక్ తదితరులు ఉన్నారు.

## ఫోన్ చోరీ మని యాప్‌తో నగదు స్వాహా!



వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట** : గ్రామాలకు వెళ్లే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని మొబైల్ ఫోన్లను దొంగలించి మని యాప్‌ల ద్వారా డబ్బులు దొంగలిస్తున్న ముఠాను తుంగతుర్తి పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.2లక్షల 70వేల నగదు, 27 స్మార్ట్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె. నరసింహ మీడియాకు వెల్లడించారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పలయ్య గత నెల 22వ తేదీన సూర్యాపేట నుండి తుంగతుర్తి మీదుగా అన్నారం గ్రామానికి బస్సులో వెళ్లే సమయంలో మార్గం మధ్యలో సెల్‌ఫోన్ దొంగతనానికి గురైంది. వరి ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో ఉన్నాయి ఫోన్ దొంగలించిన వ్యక్తులు అదే రోజు రైతు ఫోన్‌లో ఉన్న మని యాప్ యూపిఐల పిన్ నంబర్ గుర్తించి దఫాల వారీగా రూ.1లక్ష 80వేల డబ్బులను వివిధ అకౌంట్‌లలోకి పంపి డ్రా చేశారు. ఈ విషయంపై బాధితుడు తుంగతుర్తికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరొక వ్యక్తి తుంగతుర్తి గ్రామానికి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు తుంగతుర్తి నుండి సూర్యాపేటకు బస్సులో వెళ్లే క్రమంలో వెలుగుపల్లి గ్రామ శివారులో వెళ్లేసరికి అతని ఫోన్ దొంగతానికి గురైంది. ఇతని బ్యాంక్‌లో ఉన్న డబ్బు రూ.97,800 మని యాప్‌ల ద్వారా ఇతర అకౌంట్లకు పంపి దొంగతనం చేశారు. బాధితుడు తుంగతుర్తి పిఎస్ నందు ఫిర్యాదు చేయగా ఐటి చట్టాల ప్రకారం రెండు కేసులను నమోదు చేసి ధర్యాప్తు చేయగా సాంకేతికత ఆధారాలు ఇతర ఆధారాల ద్వారా గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో తుంగతుర్తి ఎస్ఐ, జిల్లా సిసిఎస్ సిబ్బంది కలిసి తుంగతుర్తి బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో తుంగతుర్తి వైపు నుండి ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు నంబర్ టిఎస్12ఈజె9817పై అనుమానం వచ్చి తనిఖీ చేయగా అందులో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా డ్రోన్ గ్రామానికి చెందిన సెంట్రింగ్ పని చేసే పాముల రాములు అలియాస్ ఎరుకల రాముగా గుర్తించడం జరిగింది. ఇతనితోపాటు కారులో మరో ఇద్దరు మైనర్లను గుర్తించారు. ఈ నింధితులు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉండే బస్టాండ్‌లలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని మొబైల్ ఫోన్లను దొంగతనం చేస్తూ యూపిఐ పిన్‌లను ఊహించి డబ్బులను పెట్రోల్ బంకులు, బట్టల దుకాణాలు, ఆయా వ్యాపార సంస్థల నుండి నగదును తీసుకుంటున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రజలు బ్యాంక్ ఖాతాలు ఉపయోగించే మొబైల్‌లకు బలమైన సిక్రెట్ పాస్వర్డ్‌ను పెట్టుకోవాలని, అలాగే మనీ యాప్లకు కూడా సాధారణ పిన్ నెంబర్ల 1234 లాంటివి, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీలు కాకుండా బలమైన పిన్ నంబర్లను పెట్టుకోవాలని సూచించారు. కేసు పర్యవేక్షణ చేసిన డిఎస్‌పి ప్రసన్న కుమార్‌ను కేసు చేధనలో బాగా పనిచేసిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, హరి కృష్ణ, తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్, పోలీస్ టెక్నికల్ టీం ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ సాగర్ రావు, కానిస్టేబుల్ మల్లేష్, ఆనంద్, శివ, సతీష్, ప్రభాకర్, మహేష్, సైదులు, రవిలను అభినందించి, రివార్డ్సును అందజేశారు.



## డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రాణాలకు భద్రత

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : డిఫెన్సివ్ డ్రైవింగ్ తో అందరి ప్రాణాలకు భద్రత ఉంటుందని రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ రూల్స్ పట్ల సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మెదులుకోవాలని డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ పోలీస్ అకాడమీ ఐపీఎస్ అభిలాష్ బిష్త్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ అధ్యక్షతన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, పోచంపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె భాస్కర్ రెడ్డి, సిఐ రాములు డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి ల సౌజన్యంతో బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలో రోడ్ సేఫ్టీ గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెకు స్వాగతం చెబుతూ పోలీసు ఉన్నత యంత్రాంగం గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏటా లక్షాడ్బై వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయని రోజుకు సగటున 20 ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ను పూర్తిగా నివారించాలనీ యూత్‌కు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక కమిటీని ఏర్పాటు చేసి తీర్మానంతో హెల్మెట్ తప్పనిసరిగా చేస్తూ యువకులు డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యతనీ ఎమ్మెల్యే అనిల్ రెడ్డి స్పష్టం చేశారు.హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితుల పాటింపు, మద్యం సేవించి వాహనాలు నడపడం తప్పు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ, . ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే అభిలాష బిష్త్ స్థానిక యువకులకు హెల్మెట్లను పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీ నారాయణ, వినోద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

## ఆలేరు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు



**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మండలంలోని అన్ని విత్తనాల మరియు ఎరువుల దుకాణాలలో జిల్లా అంతర్గత విత్తన తనిఖీ బృందం తనిఖీలు జరిపింది. ఆలేరు ఏఓ శ్రీనివాస్‌తో కలిసి విత్తన తనిఖీ బృందం సభ్యులు మోత్కూరు ఏఓ కీర్తి, పోలీస్ కానిస్టేబుల్ సతీష్ కలిసి తనిఖీలు నిర్వహించి, విత్తనాల స్టాక్ రిజిష్టర్లును మరియు విత్తన ప్యాకెట్ల పై గల వివరాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విత్తనాలను తప్పకుండా ఎంఆర్‌పి ధర మేరకు మాత్రమే అమ్మాలని అంతకు ఎక్కువగా అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ రోజూ తప్పకుండా స్టాక్ బోర్డు రాయాలని ఆదేశించారు. విత్తనాల డీలర్లు రైతులు అడిగిన కంపెనీల విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, అలా కాకుండా డీలర్లు వారికి నచ్చిన విత్తనాలను రైతులకు ఇవ్వకూడదని సూచించారు. పత్తి విత్తనాల విషయంలో ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న పత్తి విత్తనాలు అన్ని కూడా బీటీ2 హైబ్రిడ్ విత్తనాలే, అన్ని రకాల విత్తనాలు ఒకే విధమైన దిగుబడిని ఇస్తాయి. రైతులు కొన్నిచోట్ల ఒకటి, రెండు కంపెనీల విత్తనాల కోసం డిమాండ్ చేయడం, ఆ కంపెనీల విత్తనం మాత్రమే కావాలని అడుగుతున్నారు. కానీ యాజమాన్య పద్ధతులే దిగుబడికి కారణం అవుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతంలో కూడా రైతులు ఇలాగే ఒకే రకమైన విత్తనాలు కావాలని కోరితే, మార్కెట్లో అందుబాటులో ఉన్న హైబ్రిడ్లపై విశ్వవిద్యాలయం అధ్యయనం చేసి దిగుబడులపై అంచనా వేసింది. ఆ హైబ్రిడ్ల దిగుబడుల్లో పెద్దగా తేడా లేదని పరిశోధనలో తేలింది.

## వేగంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పనులు

: కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్, ఒట్టిముక్కకృష్ణాపురం, చింతపల్లిదున్నపోతులగండి లిఫ్ట్ ఇరిగేషన్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాలువలు,డిండి మెయిన్ కెనాల్, నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్, శివన్నగూడెం, అంబాభవాని తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిని ప్రాజెక్టుల వారీగాసమీక్షించారు.భూసేకరణకు సంబంధించి ఇంకా ఎంత భూమి పెండింగ్‌లో ఉందో ఎంత భూమి స్వాధీ నం చేసుకున్నారో,అవార్డులు ఎంత మేరకు పాస్ అయ్యాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు.భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో అవార్డులు త్వరితగతిన పాస్ చేసి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ నాయక్, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## వాహనాల వేలం రూ.1,06,410 ఆదాయం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన 11 వాహనాలను గురువారం జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్. లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో 11 వాహనాలకు గాను 7 వాహనాలు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని మిగిలిన 4 వాహనాలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. 7 వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర మొత్తం రూ.48వేలు కాగా జిఎస్‌టితో కలిపి వేలంలో రూ.1,06,410 ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరిందని చెప్పారు.

## రూ.1200 కోట్లు వసూలు చేస్తారా?

తెలంగాణ రక్షణ సేన చీఫ్ ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/నల్లగొండ:** వ్యవసాయ రంగాన్ని,రైతులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు.నల్లగొండలో ఏర్పాటు చేసిన రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎగ్గొట్టడంతో పాటు రైతులు ఆరుగాలాలు శ్రమించి పండించిన వరి ధాన్యం కొనుగోలులో తరుగు,రవాణా పేరుతో రైతుల నుంచే రూ.1200 కోట్లు కప్పం కట్టించుకున్న సిగ్గులేని ప్రభుత్వం ఇదని మండిపడ్డారు.క్వింటాల్‌కు 6కిలోల తరుగు తీస్తూ, రవాణా ఛార్జీలు రైతుల పైనే వేస్తూ దాదాపు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంపై ఈ వసూళ్లు చేశారని ఆరోపించారు.రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే కుట్ర జరుగుతోందని కవిత అన్నారు. కొత్త డిస్కం ఏర్పాటు చేసి ఉన్న వాటిలో ఒకదాన్ని ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నం జరుగుతోందని, ఈఆర్సీ పబ్లిక్ హియరింగ్ వల్లే ఈ విషయం బయటపడిందని తెలిపారు. జిల్లాలో రైతులు సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని,పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో నల్లగొండకు నీళ్లిచ్చే అంశాన్ని సీఎం మాట్లాడడం లేదని అన్నారు. దిండి ప్రాజెక్ట్ సోర్స్ పాయింట్‌ను మార్చి నల్గొండ, పాలమూరు మధ్య వివాదం లేకుండా చేయాలన్నారు. అసైన్డ్ భూములను పరిశ్రమల పేరుతో లాక్కుంటున్నారని, జిల్లాకు చెందిన మంత్రి ఒకరు వందల ఎకరాల అసైన్డ్ భూములు కొన్నారని ఆరోపించారు.

**రౌండ్ టేబుల్ 10 తీర్మానాలు** : సమావేశంలో 10 తీర్మానాలను ఆమోదించినట్లు కవిత తెలిపారు. రైతు డిస్కం వద్దు,యూరియా యాప్ తీసేయాలి,బకాయి పడ్డ రైతు భరోసా వెంటనే ఇవ్వాలి,కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి,రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలి,నకిలీ విత్తనాలు,మందులు అమ్మేవారిపై కఠిన చర్యలు,మూసీ కాలుష్య నివారణ,నిమ్మ, బత్తాయి రైతులకు అండ, పత్తి రైతుల సమస్యల పరిష్కారం,రైతు సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ. అనంతరం మాడుగుల మండలం ఇందుగుల గ్రామంలో బత్తాయి తోటను పరిశీలించి రైతుల కష్టాలు తెలుసుకున్నారు. బత్తాయి, నిమ్మ, పత్తి రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అంతకుముందు క్లాక్ టవర్ సర్కిల్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, శ్రీకాంత్ చారి విగ్రహానికి నివాళులర్పించారు. జూలై 2న ఉద్యమకారుల భూమి కోసం ఉప్పల్ భగాయత్‌లో భూపోరాటం చేస్తామని ప్రకటించారు.

## ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్, ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

రూ.2 లక్షల విలువగల 3 బైక్‌లు, రూ.7.71లక్షల నగదు,2 కట్టర్లు, 4 పానాలు, హ్యాండ్ గ్లోవ్స్ స్వాధీనం

నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర పరిధిలోని వివిధ జిల్లాల్లో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్,ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ లీడర్ హమీద్ హుస్సేన్‌తో పాటు ఐదుగురు రోహింగ్యా నిందితులను జిల్లా పోలీసులు అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి వెల్లడించారు. గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల కాలంలో పెరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్,ఆయిల్, అల్యూమినియం వైర్ దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి పోలీసులు అప్రమత్తంగా నిఘా నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.గత డిసెంబర్17,2025న నార్కట్‌పల్లిలోని కళ్యాణి స్టీల్ లిమిటెడ్ కంపెనీ అడ్మిన్ ఇన్‌చార్జ్ నెల్లుట్ల చందు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీలోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 21 వేల లీటర్ల ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్,220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఓఎల్‌టీసీ ఆన్ లోడ్ ట్యాప్ చేంజర్‌కు చెందిన 3 హెచ్‌వి, 3 ఎల్‌వి కాపర్ ఎలిమెంట్స్, కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. దీంతో నార్కట్‌పల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు నార్కట్‌పల్లి గ్రామ శివారులో ఎన్‌హెచ్65 రోడ్డుపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో రెడ్డయ్య ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మూడు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. బైక్‌లకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో పాటు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు పలు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్, అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు: ఎ1.హమీద్ హుస్సేన్, ఎ2. జహంగీర్ ఆలం, ఎ3. నూర్ కాసిం, ఎ4.నూరుల్ అమీన్,ఎ5. నూరుల్ ఆలం అలియాస్ మహబూబ్ ఆలం. వీరి నుంచి రూ.2 లక్షల విలువగల 3 బైక్‌లు, రూ.7,71,000 నగదు, 2 కట్టర్లు, 4 పానాలు, హ్యాండ్ గ్లోవ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి,నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ సతీష్ వర్మ,ఎస్ఐ విష్ణుమూర్తి,హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, వహీద్ పాషా, కానిస్టేబుళ్లు అస్రార్, శివరాజ్, నరేష్, జునేద్, కమల్ కిషోర్‌లను జిల్లా ఎస్‌పి అభినందించారు.



## పంట నిల్వలకే ప్రభుత్వ గిడ్డంగులు

కో-ఆపరేటివ్ ఎండి శ్యామ్‌కుమార్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను మద్దతు రాకుంటే నిల్వ చేసేందుకు గిడ్డంగుల ఏర్పాటు చేసి ఆదుకుంటుందని కో–ఆపరేటివ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్యామ్ కుమార్ తెలిపారు. గురువారం నాడు జడ్చర్ల పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయావరణలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి గిడ్డంగుల ఉపయోగం గురించి వివరించారు. కొందరు రైతులు తమ పండించిన పంటకు మద్దతు రాగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గ్రహించిన ప్రభుత్వం గోడౌల ద్వారా నిలువ చేసి న్యాయం చేసిందన్నారు. కొంతమంది దళారులు ఏకమై రైతులు పండించిన పంటలకు తక్కువ ధర ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని అలాంటి వాడికి నుంచి కాపాడేందుకు ఈ గొడంలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అదేవిధంగా మార్కెట్లలో ఇంటి పరిసరాలలో పంటలను సంచులలలో నింపి నిలువ చేసుకోవడం వల్ల వర్షానికి ప్రమాదాలకు గురవుతారని గ్రహించిన ప్రభుత్వం ప్రతి ప్రాంతంలో గొడౌలను ఏర్పాటు చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. గోదాములలో నిర్వహించిన ధాన్యాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు. అంతకుముందు ఆయన గోడౌన్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యకరమంలో సింగిల్ విండో చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్, రేణుక, కుమారస్వామి జీవన గుండప్ప పాల్గొన్నారు.



## పంచదేవ్ పహాడ్ గ్రామ సర్పంచ్, ఆర్ఐకి సన్మానం

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో బుధవారం రోజు నూతనంగా వీధిలోకి గిర్ధవరి విధులు చేపట్టడం జరిగింది. అదేవిధంగా గురువారం పంచదేవ్ పహాడ్, పంచలింగల్ సర్పంచులు కొత్తగా విధులకు వచ్చినటు వంటి గిర్ధవరి కి సాల్వ్ తో సన్మానించి కంగ్రాట్స్ తెలుపుతూ, స్వీట్ తినిపిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదిరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్ యజమానిపై దాడి

డి.సి రాజశేఖర్ నుంచి ప్రాణహాని

**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి మాడ్రన్ రైస్ మిల్ యజమాని బోరిశెట్టి రామ్మోహన్‌శెట్టిపై బుధవారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో డి.సి రాజశేఖర్, అతని అనుచరులు కలిసి మూకుమ్మడిగా కత్తులతో, రాడ్‌లతో దాడి చేశారని గురువారం బాధితుని నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. అతనిపై దాడి చేసిన వివరాలను తెలుపుతూ రియల్ ఎస్టేట్ ఇళ్ల ప్లాట్ల విషయంలో తలెత్తిన వివాదమే ఈ దాడికి రాజశేఖర్ తనపై తీవ్రంగా గాయపరుస్తూ దాడి చేశారని ఆరోపించారు. ఆరోజు రాత్రి పది గంటల ప్రాంతంలో పెట్రోల్ బంక్ కార్యకలాపాలు ముగించుకొని తన ఇంటికి వచ్చిన సందర్భంలో ఆ వ్యక్తి కాపుగాసి కారులో నుంచి తనను బయటకు లాగి కత్తితో పొడిచి రాడులతో తీవ్రంగా కొట్టారని ఆయన ఆరోపించారు. ఈ దాడి ఘటనలో తన వద్ద ఉన్న రెండున్నర లక్షల రూపాయల నగదు, తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకొని పోయారని బాధితుడు విలేకరులతో వాపోయారు. గతంలో పీడీ యాక్ట్ కింద అక్రమ రేషన్ బియ్యం దందా నడుపుతున్న డి.సి. రాజశేఖర్ జైలుకు పోయిన సంఘటన కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా తన ఇంటి పై రాత్రి వేళలో తలుపులు తట్టి రాళ్లతో కొట్టిన సందర్భాలు ఉన్నావని తెలిపారు. తనకు రాజశేఖర్ నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన పై దాడి చేసిన ఆ వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## పుంజనూర్ గ్రామ ఎంఇవిఎస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/మాగనూర్ :** మండల పరిధిలోని పుంజనూర్ గ్రామంలో మాల ఎడ్యుకేషనలో వేల్ఫేర్ సొసైటీ ఎంఇవిఎస్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా ఎంఈవిఎస్ ఉపాధ్యక్షులు పాలెం వెంకటేయ్య మాట్లాడుతూ, మాలలను విద్యాపరంగా, ఉన్నతంగా తీర్చిద్దడమే ఎంఈవిఎస్ ప్రధాన లక్ష్యమని అన్నారు. మాలలు గ్రామస్థాయిలో ఇంకా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రోస్టర్ పాయింట్ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాలల వెనుకబాటుకు ప్రధాన కారణం విద్యలేమేనని, అందుకు విద్యనే ప్రధాన అజెండాగా ఎంఈవిఎస్ పనిచేస్తుందని తెలిపారు. అధ్యక్షులుగా నరసింహ, ఉపాధ్యక్షులుగా భీమేష్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగ రాజు, కోశాధికారిగ పెద్ద భీమేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, మారెప్ప, వీరేష్, నరసింహ, అంజప్ప, కీరప్ప, భరత్ ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బందారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రాము, జిల్లా కార్యదర్శి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర కృష్ణ పాల్గొన్నారు.

## తిమ్మాజీపేట కెజిబివి అక్రమాలపై విచారణ చేపట్టాలి : కెజిబివి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తిమ్మాజీపేట కెజిబివిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల విద్యాభివృద్ధి, భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, అలాంటి నిధులను దుర్వినియోగం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యామని విద్యార్థినులకు అందాల్సిన ఆహారం, వసతి, ఇతర సదుపాయాలను దారి మళ్లించడం క్షమించరాని నేరమని తిమ్మాజిపేట కెజిబివి సిబ్బంది చేసిన ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకునేలా జిల్లా అధికారులకు సూచిస్తామని ఆయన స్పష్టం చూశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో అవినీతికి పాల్పడుతూ విద్యార్థినుల భవిష్యత్తులో చెలగాటమాడే వారిని వదిలిపెట్టబోమని ఎమ్మెల్సీ హెచ్చరించారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట కేజీబీవీ సిబ్బంది, బి.ఎస్.ఎఫ్, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, బి.ఎస్.ఎఫ్, జిల్లా అధ్యక్షులు సాయి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు మేలుకైన సేవలే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని కల్వకుర్తి పట్టణ, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించి కలెక్టర్ ఆయా పనులు పురోగతిని సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి ప్రాజెక్టు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి కావాలని, వాటి నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మొదటగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన కలెక్టర్ , షాపుల కేటాయింపు విధానం, వినియోగ పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ వాణిజ్య సముదాయం ద్వారా స్థానిక యువతకు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న దుకాణాలను కార్పొరేషన్ సంబధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, మున్సిపల్ కమిషనర్ అహ్మద్, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెటింగ్, ఐకెపి, గృహ నిర్మాణ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## నాణ్యతతో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి రూరల్ :** నాణ్యతతో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని, వరి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత ఉండాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ రైతులకు అందిస్తున్న కనీస మద్దతు ధర ఎంఎస్‌పి ప్రయోజనం ప్రతి రైతుకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం లభించేలా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కల్వకుర్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి, ఎదురువుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, మున్సిపల్ కమిషనర్ అహ్మద్, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెటింగ్, ఐకెపి, గృహ నిర్మాణ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మినీ స్టేడియం నిర్మాణానికి భూమి విరాళం

మంత్రి జూపల్లికి ఎంఆర్‌పిఎస్ నేత కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో మినీ స్టేడియం, క్రీడా ప్రాంగణం నిర్మాణం కోసం తన సొంత నాలుగు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి అందించిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తీసుకున్న ఈ నిర్ణయం వీపనగండ్ల మండల యువతకు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మినీ స్టేడియం నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల యువత తమ క్రీడా ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రీడల అభివృద్ధికి మంత్రి చేసిన ఈ సేవ చిరస్మరణీయమని కొనియాడారు. క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా తీసుకున్న ఈ చర్యకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మీసాల నాగరాజు అన్నారు.

# లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం





నూతన కమిటీ హాల్‌కు నిధులు

మంజూరు : డి.కె.అరుణ

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాన్ని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె అరుణమ్మ గురువారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, కోనేరు, భక్తుల సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డికె అరుణకు శాలువా, పూలమాలతో ఘన సన్మానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు ఆలయ చరిత్ర, బ్రహ్మోత్సవాల విశేషాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ హాల్‌కు హామీ భక్తుల మనవి మేరకు స్పందించిన ఎంపి డికె అరుణ మాట్లాడుతూ, ఆలయంలో నూతన కమిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే తన ఎంపి విధుల నుండి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీ కృష్ణదేవరాయల కాలం నాటి ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. సహకారం అందిస్తానని తెలిపారు. కార్ణటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కళ్యాణ మండపం, కోనేరు అభివృద్ధి కాటేజీల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరించండి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలం సామన్‌పల్లి గ్రామంలో గురువారం గ్రామ నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె.అరుణను పెద్దపొర్ల గ్రామ ప్రతినిధులు కలిసి గ్రామ అభివృద్ధికి అవసరమైన పలు పనులను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తనయుడు బోయిన్‌పల్లి నరేష్, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ రవికుమార్ కాంట్రాజ్ హన్మంతు, బోయిన్‌పల్లి అంజప్ప, శ్రీకాంత్, పూజారి లింగప్ప, ఎంఎస్ సిద్దు తదితరులు ఎంపిని కలిసి గ్రామంలోని రహదారులు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. వారి వినతిపై ఎంపి డికె అరుణ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పినట్లు నాయకులు తెలిపారు.



## గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుంటే వివిధ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను 16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగంకు రూపొందించాల్సిన జిపిడిపి (గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్, డిపిడిపి (డిస్ట్రిక్ట్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్)పై జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామపంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళిక రూపొందించుకుంటేనే ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గ్రామస్థాయిలో పనిచేసే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర జిపిడిపి రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్‌కి యోజన, సబ్కా వికాస్ సైట్‌లో జిపిడిపి వివరాలను ఈనెల 30వ తేదీలోగా అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. వివిధ జాతీయ పంచాయతీ అవార్డులను పొందేలా గ్రామపంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసుకునేందుకు జిపిడిపి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఒ శ్రీకాంత్, మిషన్ భగీరథ ఇఇ శ్రీధర్ రెడ్డి, డిఆర్డీఓ ముషాహిదా బేగం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కచ్చితంగా ఉద్యోగం సాధించే విధంగా శిక్షణ పొందాలి

గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** నిరుద్యోగ యువతకు ఎ.ఐ ఆర్టిఫిషల్ ఇంటెలిజెంట్ పైన ఎంప్లాయిమెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కల్పించాలని, కనీసం 50 నుండి 100 మంది విద్యార్థులకు కచ్చితంగా ఉద్యోగం సాధించే విధంగా శిక్షణ పొందాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో బిసి స్టడీ సర్కిల్ నందు మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఐ ఎంప్లాయిమెంట్ స్కిల్స్ డెవలప్‌మెంట్ నాలుగు రోజుల ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి బిసి స్టడీ సర్కిల్ మేనేజ్‌మెంట్ వారు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో యువత చదువుతోపాటు టెక్నాలజీ అనుకూలంగా ప్రపంచ దేశాలలో ముందుకు దూసుకెళ్తున్న ఎఐ టెక్నాలజీ అవగాహన ప్రతి ఒక్కరికీ ఉండాలని పేర్కొన్నారు. కాబట్టి యువత ఒక లక్ష్యంతో శిక్షణ పొందితే కచ్చితంగా ఉద్యోగం సాధించడానికి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిపి విజయ్, బిసి స్టడీ సర్కిల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం నుండి 620 బస్తాల పాత ధాన్యం తరలింపు...?

జిల్లా అధికారులకు అందిన సమాచారం

విచారణ చేపట్టాలని తహసీల్దార్‌కు ఆదేశం

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి పాత వరి ధాన్యంతో లారీ లోడ్ నుంచి శ్రీరంగాపూర్ రైస్ మిల్లుకు తరలించగా మిల్లు యజమాని ధాన్యాన్ని పరిశీలించగా పాత ధాన్యం ఉన్నట్లు గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు సమాచారం. విషయం జిల్లా అధికారులకు చేరడంతో వెంటనే పానుగల్ తహసీల్దార్ కు విచారణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్తీక్ రావు మాందాపూర్ చేరుకుని లారీలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు, టెక్నికల్ అధికారులు ధాన్యం శాంపిల్ తీసుకొని ధాన్యం పై విచారణ చేపడుతున్నారని తెలిపారు. వాస్తవానికి మాందాపురం గ్రామం నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేతేపల్లి రైస్ మిల్లుకు గాని, గద్వాల రైస్ మిల్లులకు పంపాల్సి ఉండగా శ్రీరంగాపూర్ రైస్ మిల్లుకు పంపడంపై పలు అనుమానాలను తావిచ్చింది. తక్ షీట్లో ధాన్యం కొనుగోలు చేసే కమిటీ సభ్యుల సంతకాలు లేకుండా పంపించడంతో పలు అనుమానాలకు తెరలేపింది. ఐకెపి సిసిల నిర్లక్ష్యం కారణంగా పర్యవేక్షణ లేక విఒఎలు అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## బిసి కాలనీలో పార్క్ ఏర్పాటు చేయాలి

సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శికి కాలనీవాసుల వినతి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రమైన వీపనగండ్ల గ్రామంలోని బిసి కాలనీలో చిన్నారుల కోసం ఆటస్థలం, పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉపసర్పంచ్ బాలపీర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డికి శ్రీరామంజనేయ యూత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి కాలనీలో చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం పిల్లలు రహదారులపై, ఖాళీ ప్రదేశాల్లో ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, దీనివలన ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి ఆటస్థలాలు, పార్కులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కాలనీ సమీపంలోని భూలక్ష్మి వెంచర్‌లో గ్రామపంచాయతీకి చెందిన ఖాళీ స్థలం అందుబాటులో ఉందని, ఆ స్థలంలో పార్క్ నిర్మాణం చేపడితే చిన్నారులతో పాటు యువత, మహిళలు, వృద్ధులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పార్క్‌లో మొక్కలు నాటడం, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేయడం ద్వారా కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. అదేవిధంగా సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులు విశ్రాంతి తీసుకునేందుకు, వాకింగ్ చేసేందుకు కూడా ఈ పార్క్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేక చొరవ తీసుకుని పార్క్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని శ్రీరామాంజనేయ యూత్ సభ్యులు కోరారు.

## పోగొట్టుకున్న మొబైల్‌ను అప్పగించిన ఎస్ఐ వెంకటేష్ గౌడ్




**ప్రజాపక్షం/ధన్వాడ :** మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధన్వాడ పట్టణానికి చెందిన సంద బాల స్వామి తండ్రి బాలయ్య మొబైల్ ఫోన్ గతంలో పోగొట్టుకోవడంతో ధన్వాడ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారూ. పోలీస్ అధికారులు ఫిర్యాదును స్వీకరించిన వెంటనే ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ పర్యవేక్షణలో సిఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ వివరాలను నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో ట్రేసింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో పిఎస్ స్థాయి సిఇఐఆర్ ఆపరేటర్ బి. రామాంజనేయులు ప్రత్యేక శ్రద్ధతో ఫోన్ ను గుర్తించే పనిలో నిమగ్నమై, సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను విజయవంతంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అవసరమైన ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి, గురువారం సంబంధిత వ్యక్తికి మొబైల్ ఫోన్ ను సంద బాలస్వామికి అప్పగించారు. బాధితుడు తమకు ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి లభించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ , వేగంగా స్పందించి ఫోన్ ను గుర్తించి అందించిన ధన్వాడ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి లేదా సిఇఐఆర్ పోర్టర్ ద్వారా అప్లయ్ చేయాలని సాంకేతిక ద్వారా వాటిని గుర్తించి తిరిగి అందించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజల ఆస్తుల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## శాస్త్రీయ దృక్పథం ద్వారానే సమాజంలో సానుకూల మార్పు

పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్

డా.బైరెడ్డి సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** సమాజాన్ని పట్టిపీడిస్తున్న కుల, మత, ఆర్థిక అసమానతలు, దోపిడీ, పీడన వంటి సామాజిక రుగ్మతలు నిర్మూలించాలంటే విద్యార్థులు, యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బైరెడ్డి సతీష్ రెడ్డి అన్నారు. ఉట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులు ప్రారంభానికి ముందు పిడిఎస్‌యు బిగిపిడికిలి జెండాను రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి లోలా అనిల్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ప్రతినిధులు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ పూర్వ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రారంభోపన్యాసం చేయగా, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నారాయణపేట జిల్లా కార్యదర్శి బి.రాము సంఘీభావం సందేశం అందించారు. అనంతరం భౌతికవాదం,హేతువాదంశాస్త్రీయ దృక్పథం అంశంపై డా.బైరెడ్డి సతీష్ రెడ్డి ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, మునిగల శివప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సురేష్, కర్క గణేష్, బోయినపల్లి అజయ్, రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ పి.అనూష, రాష్ట్ర నాయకులు సీతారాం, అనిల్, మారుతి, లక్ష్మణ్, అషూర్, హరీష్, మహేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- 'మిస్సింగ్ లింక్ రోడ్'ల ప్రాజెక్ట్ రెండవ దశ షురూ
- 18 ప్రాంతాల్లో 53 కిలోమీటర్ల మేర అనుసంధాన రహదారుల నిర్మాణం
- శంషాబాద్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ జోన్‌లలో జిహెచ్‌ఎంసి కసరత్తు
- రాబోయే 20 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా రోడ్ల విస్తరణ
- మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జిహెచ్‌ఎంసి కొత్త ప్రతిపాదనలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కీలక చర్యలు చేపట్టింది. నగరంలోని ప్రధాన రహదారులపై వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 18 ప్రాంతాల్లో సుమారు 53 కిలోమీటర్ల మేర కొత్త లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇప్పటికే గుర్తించిన మాస్టర్ ప్లాన్ రహదారులతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా మరికొన్ని కొత్త మార్గాలను కూడా ఇందులో చేర్చినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ పరిస్థితులతో పాటు రాబోయే రెండు దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 60 అడుగుల నుంచి 200 అడుగుల వెడల్పుతో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఎక్కువ ప్రాంతాల్లో 80, 100, 150 అడుగుల వెడల్పు గల రహదారులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి భూసేకరణ, ఆస్తుల ప్రభావంపై ప్రాథమికనివేదికలు సిద్ధం చేస్తున్నారు.

### మిస్సింగ్ లింక్ ప్రాజెక్టుకు ఊతం

హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డిసిఎల్) ఆధ్వర్యంలో అమలవుతున్న 'మిస్సింగ్ లింక్ రోడ్'ల ప్రాజెక్ట్ మూడో దశలో శంషాబాద్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ జోన్‌ల పరిధిలో మొత్తం 18 కీలక రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

**– శంషాబాద్ జోన్ :** బడంగ్‌పేట్ – తుర్కయాంజల్– నాదర్‌గూల్ మార్గం, మల్లాపూర్ క్రాస్ రోడ్ కుర్మల్‌గూడ, కుర్మల్‌గూడ – నాదర్‌గూల్, ఆర్‌సిఐ ఎక్స్ రోడ్ శ్రీశైలం హైవే, పెద్దగోల్కొండ– ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్ శంషాబాద్ రైల్వే క్రాసింగ్– ధర్మగిరి రోడ్ ఎన్‌హెచ్ 44 నుంచి రాళ్లగూడ మార్గం వంటి పలు రహదారుల విస్తరణ చేపట్టనున్నారు. కొన్ని మార్గాల్లో వందల సంఖ్యలో ఆస్తులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**–రాజేంద్రనగర్ జోన్ :** బైరాగిగూడ– నార్సింగి, కిస్మత్‌పూర్ – చేవెళ్ల రోడ్ ఎల్.బి.ప్రసాద్ కంటి ఆసుపత్రి అనుసంధాన మార్గం, ఫర్మాయిష్ హోటల్– తారామతి బరాదరి మధ్య కొత్త వంతెనతో కూడిన రహదారి నిర్మాణం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే బాపూఘాట్ బ్రిడ్జి నుంచి పి అండ్ టీ కాలనీ వరకు కొత్త రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**– ఖైరతాబాద్ జోన్ :** రాజ్‌భవన్ రోడ్ గ్రీన్‌ల్యాండ్స్ జంక్షన్, నెక్లెస్ రోడ్ బేగంపేట్ రైల్వే స్టేషన్ ప్రాంతాలను అనుసంధానించే కీలక లింక్ రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా ఉన్న కొన్ని మార్గాలను కూడా విస్తరించనున్నారు.

### గతంలో 45 ప్రాంతాల్లో పూర్తి

నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గతంలో రూ.825 కోట్ల వ్యయంతో 50 ప్రాంతాల్లో లింక్ రోడ్ల నిర్మాణపనులు చేపట్టగా, వాటిలో 45ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో భూసేకరణ, సాంకేతిక సమస్యల కారణంగా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పూర్తి చేసిన లింక్ రోడ్ల ద్వారా ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో మరిన్ని ప్రాంతాలకు ఈ ప్రాజెక్టును విస్తరించాలని జిహెచ్‌ఎంసి నిర్ణయించింది. సమగ్ర సర్వేలు పూర్తయిన అనంతరం తుది ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే భూసేకరణ, నిర్మాణ ప్రక్రియలను వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగరంలోని కీలక ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపడి, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీకి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అధికారులు అంటున్నారు.

## ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి : ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఉద్యోగ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా ఎఐవైఎఫ్ ఇంచార్జ్ పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. గురువారం ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సరూర్ నగర్ మండలంలోని కామ్రేడ్ ధర్మబిక్షం భవనంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఖాళీలపై పూర్తి వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేసోందని విమర్శించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, యువకులు శివ, ఎనివాస్, సందీప్, అర్జున్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తిచేయాలి

మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్ పరిధిలో మిగిలిన సిసి రోడ్డు, డ్రైనేజీ. పార్కులు పనులు త్వరితరగతిన పూర్తి చేయాలని వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని హిల్ కాలనీ వాసుల పిలుపు మేరకు పూర్తియిన సిసి రోడ్డు పనులు కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో మిగిలి పనులు ప్రభుత్వ సహకారంతో పూర్తి చేయడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రఘుపతిరెడ్డి, మంగు జీవన్, సూర్తి నర్సింగ్ రావు, వినోద్, విశ్వనాథ్ జాదవ్, కిరణ్ గౌడ్, చంటి, మధుకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, చక్రవర్తి, అంజద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి స్పందన



**ప్రజాపక్షం/యాచారం :** నందివనపర్తి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పంధన లభించిందని మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం గ్రామంలోని అరోగ్య ఉప కేంద్రంలో టిబి, ముక్త్ భారత్ క్యాంప్‌ను గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఇఒ అనంద్‌రాజ్, ఎక్స్‌రే రెడియోగ్రాపర్ శ్రీనివాస్‌రెడ్డి, ల్యాబ్ రాములు, వేణుగోపాల్, టిబి సూపర్ వైజర్ శివమల్లిక, నందివనపర్తి అరోగ్య ఉప కేంద్రం ఎఎన్‌ఎం రమణ, మంజుల, అశావర్కర్లు సైదమ్మ, సువర్ణ, యాదమ్మ, అలివేలు,హెచ్‌వి జ్యోతి, ప్రాథమిక అరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్నాం

ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి...


ధర్మన్నగూడ గ్రామ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామ సర్పంచ్ పండుగ పద్మావతి బాల్‌రాజ్ దంపతులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు అకర్శితులై తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం, రాచర్ల వేంకటేశ్వర్లు, ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురనాథ్‌రెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మ, గడ్డమల్లాయగూడ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య, ఈశ్వర్, పొలమోని రామకృష్ణ యాదవ్, కంకర్ల కిష్టయ్య, రాజయ్య, సురేశ్, శివ పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమానికి విజయం.. చెత్త డంపింగ్ యార్డు రద్దు

జెఎసి కమిటీ చైర్మెన్ అంబటి ప్రభాకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజా ఉద్యమానికి విజయం చెత్త డంపింగ్ యార్డు రద్దు అని జెఎసి చైర్మన్ అంబటి ప్రభాకర్ అన్నారు. గురువారం కొత్తూరు మండల పరిధిలో జెఎసి నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసిప ఫలితం దక్కిందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయ సహకారాలతోనే చెత్త డంపింగ్ యార్డు రద్దు చేశారన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేశారని గుర్తుచేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్‌తోపాటు వివిత గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా కరుణశ్రీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా ఎం.కరుణశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో అధికారులు సన్మానించారు. ఎం.కరుణశ్రీ గతంలో పరిగి, కామారెడ్డి, హైదరాబాద్..2 డిపోల్లో డిఎంగా విధులు నిర్వహించారు. డిపోను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కరుణశ్రీ సిబ్బందిని కోరారు.

## సూపర్ మిడ్‌ఇయా పేరుతో మోసాలకు.. పాల్పడుతున్న వారిపై సిఎంఆర్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ రిటైల్ సంస్థ సిఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు ఉపయోగించి కొందరు వ్యక్తులు ప్రజలను మోసం చేస్తున్నట్లు సంస్థ యాజమాన్యం వెల్లడించింది. ముఖ్యంగా సూపర్ మిడ్‌ఇయా పేరుతో నిర్వహిస్తున్న ఒకసంస్థ తమతో ఎలాంటి సంబంధం లేకపోయినా, సిఎంఆర్ పేరును ఉపయోగించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొంది. సిఎంఆర్ గ్రూప్ పేరుతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, ఖరీదైన యువతీ ముత్యాల కలెక్షన్‌పై ముస్లిం పురుషులకు 10 శాతం నుంచి 50 శాతం వరకు తగ్గింపు వంటి ప్రకటనలు ప్రచారం చేస్తున్నారని సంస్థ తెలిపింది. ఈ ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో సిఎంఆర్ గ్రూప్‌నకు మంచి గుర్తింపుఉందని, తమ సంస్థ ఎప్పుడూ మతం, కులంలేదా ప్రాంతాల ఆధారంగా ఎలాంటి ప్రత్యేక రాయితీలు ప్రకటించదని యాజమాన్యం స్పష్టంచేసింది. నాలుగు దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని పొందిన సంస్థగా కొనసాగుతున్నామని తెలిపింది. సిఎంఆర్ పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభించినట్లు సంస్థ వెల్లడించింది. అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు నమోదు చేసినట్లు తెలిపింది. సోషల్ మీడియా వేదికల్లో వైరల్ అవుతున్న తప్పుడు పోస్టులు, సందేశాలను నమ్మవద్దని సంస్థ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అధికారిక సమాచారం కోసం సీఎంఆర్ అధికారిక వేదికలను మాత్రమే అనుసరించాలని కోరింది. తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు సంస్థ కట్టుబడి ఉందని ప్రకటనలో పేర్కొంది.

## గుడిసెలు వేసుకున్న పేద కుటుంబాలను జనగణనలో చేర్చాలి



### రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిపిఐ నేతల వినతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి కుంట్లూరు రెవెన్యూ, ఆర్.ఎన్.ఆర్ కాలనీ, సర్వే నెం. 215 నుండి 224 వరకు గల 100 ఎకరాల భూదాన భూమిలో గుడిసెలు వేసుకుని 4 సంవత్సరాల నుండి ఉంటున్న నిరుపేద కుటుంబాలను జనగణనలో చేర్చడంతో పాటు ఓటర్ నమోదుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పక్షాన పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకత్వం, గుడిసెవాసులతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి, కుంట్లూరు రెవిన్యూలో రానినారాయణరెడ్డి కాలనీ, సర్వే నెం.215 నుండి 224 వరకు గల 100 ఎకరాల భూదాన్‌భూములలో 2022లో గుడిసెలు వేసుకొని సుమారు 7000 కుటుంబాలు నివాసం ఉంటున్నాయ న్నారు. వీరందరు ఇండ్లులేని నిరుపేదలు, అరకొర సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన 2027 జనగణలో ఈ కుటుంబాలను అధికారులు చేర్చుకోవడంలేదని, ఎన్యుమరేటర్లను అడిగితే అధికారులు అనుమతి లేకుండా చేపట్టలేమని అంటున్నారన్నారు. జనాభా లెక్కలో మేము ఉండకూడదా? అని నివాసిత ప్రజలు ఆవేదన పడుతున్నారన్నారు. జనగణన, ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌లో పై సర్వే నెంబర్లలో నివాసము ఉంటున్న వారిని భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కల్పించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, పైమీదబేగం, నాయకులు పబ్బతి లక్ష్మణ్, గ్యార క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భూముల సరిహద్దులు గుర్తించడానికి, కొలవడానికి సమర్పించిన (ఎఫ్‌లైన్)పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సహాయ సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్(ఎడి,ఎస్‌ఎల్‌ఆర్)ఆధ్వర్యంలో జిల్లాలోని మండల సర్వేయర్లు, డిఐఒఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌లైన్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి,సేవా హామీ చట్టం (ఎస్‌ఎల్‌వి) గడువును దాటిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత సర్వేయర్లను ఆదేశించారు. మండలాల వారీగా ఎఫ్‌లైన్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల స్థితిని సమీక్షించారు. ముఖ్యంగా సేవా హామీ చట్టం గడువును దాటిన కేటగిరీబి దరఖాస్తులపై ప్రత్యేకంగా చర్చించి, తదుపరి సమీక్ష సమావేశం నాటికి అన్ని పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు లేదా ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకతతో పని చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో వేగం, నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ సేవలను సకాలంలో ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో సహాయ సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రాంరెడ్డి, మండల సర్వేయర్లు, డిఐఒఎస్‌లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్‌సిడిఎలో విధుల నిర్వహణ ఆరంభం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) అభివృద్ధి ప్రయాణంలో మరో కీలక ఘట్టం ఆరంభమైంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌సిడిఎ నూతన కార్యాలయ భవనాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించి, సంస్థ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ప్రత్యక్షం గా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశాంక కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి సహకారం, సమన్వయం, అంకిత భావం ఈ కార్యక్రమ విజయానికి బలమైన పునాది అయ్యాయి. ఈ సందర్భం గా ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారిక వెబ్‌సైట్ https://fcda. telangana. gov.in, సంస్థ అధికారిక లోగోను ఆవిష్కరించారు. అలాగే పర్యావరణ హిత నిర్మాణ ప్రమాణాలను అనుసరించి నిర్మించిన ఎంసిడిఎ నూతన కార్యాలయ భవనానికి భారత గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి)ప్రదానం చేసిన గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ను ఐజిబిసి ప్రతినిధులు ముఖ్యమంత్రి సమక్షంలో ఎఫ్‌సిడిఎ కమిషనర్ శశాంకకు అందజేశారు. ఈ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి 28.09.2025న శంకుస్థాపన చేయగా, 2025 డిసెంబర్ మొదటి వారంలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆరునెలల వ్యవధిలో నిర్మాణాన్ని పూర్తి చేయ డం జరిగింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉం చుకొని నిర్మించిన ఈ కార్యాలయ భవనంలో ఐజిబిసి గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు, బయోఎస్‌టీపీ ద్వారా మురుగు నీటి శుద్ధి వ్యవస్థ, సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ వంటి పర్యావరణ అనుకూల సదుపాయాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటి ద్వారా పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, పర్యావరణ పరిరక్షణకుతో డ్పాటు అందించనుంది. ఆధునిక కార్యాలయ వసతులు, సమావేశ మందిరాలు, సాంకేతికమౌలిక సదుపాయా లు, సిబ్బందికి అనుకూలమైన పని వాతావరణంతో ఈ భవనం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించబడింది. ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలందించేందుకు ఇది దోహదపడనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎఫ్‌సిడిఎ కమిషనర్‌గా నియమితులైన ఐఎఎస్ శశాంక, నూ తన కార్యాలయంలో అధికారిక కార్యకలాపాలను గురువారం నుంచి మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీడీఏకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది కూడా నూతన కార్యాలయం నుంచి తమ విధులను ప్రారంభించారు.

## రోడ్డు విస్తరణ, విగ్రహాల ఏర్పాటుపై వివరణ కోరిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మిర్యాలగూడ–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిలో గరిడేపల్లి నుంచి అలంగిపూర్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు, రహదారులపై అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రోడ్డు విస్తరణను ఇరువైపులా సమానంగా కాకుండా ఒకవైపే చేపడుతున్నారని, దీంతో అక్రమ నిర్మాణాలకు రక్షణ కల్పిస్తున్నారని పిటిషనర్ వాదించారు. ఈ అంశాలపై నివేదిక ఇవ్వాలని రోడ్లు–భవనాల శాఖను ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## అక్రమ నిర్మాణాలు చేసి కోర్టుకు రావడం సరికాదు: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి, అధికారులు చర్యలు ప్రారంభించిన తర్వాత కోర్టులను ఆశ్రయించడం సరైన ధోరణి కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. జీడిమెట్లలో నిర్మించిన భవనంపై మున్సిపల్ అధికారులు జారీ చేసిన నోటీసును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నిర్మాణాలకు ముందుగానే అవసరమైన అనుమతులు పొందాల్సిన బాధ్యత యజమానులదేనని స్పష్టం చేసిన కోర్టు, అక్రమ నిర్మాణాలు రుజువైతే భారీ జరిమానాలు విధించే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణను జూలై 7కు వాయిదా వేసింది.

# సీనియర్లో, మేనల్లుడో తేల్చుకోండి

- కళ్యాణ్ బెనర్జీ



**కోల్‌కతా :** టిఎంసి పార్టీలో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుతున్నట్లు కనిపిస్తున్నాయి. పార్టీకి చెందిన ఎంపి టిఎంసి అధినేత మమతా బెనర్జీకి అల్టిమేటం జారీ చేశారు. తన లాంటి సీనియర్లు కావాలో లేక మీ మేనల్లుడు అయిన అభిషేక్ బెనర్జీ కావాలో తేల్చుకోవాలన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అహంకారంతో ఉన్నారని, ఆయన మనస్తత్వం స్థిరంగా లేదని కూడా ఆయన ఆరోపించారు. సీనియర్ న్యాయవాది కూడా అయిన కళ్యాణ్, అభిషేక్‌కు సంబంధించిన అన్ని న్యాయపరమైన విషయాలు, కోర్టు పిటిషన్ల నుంచి తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే టిఎంసి పార్టీకి సంబంధించిన కేసులలో మాత్రం తాను వాదిస్తూనే ఉంటానని ఆ ఎంపీ తెలిపారు. సిఐడికి చెందిన సంతకాల ఫోర్జరీ కేసులో కలకత్తా హైకోర్టులో అభిషేక్ తరపున వాదిస్తున్న కళ్యాణ్‌కు, మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలోని టిఎంసి కార్యాలయంలో, అభిషేక్ కామాక్ స్ట్రీట్ కార్యాలయంలో సిఐడి నిర్వహించిన సోదాలకు సంబంధించి డైమండ్ హార్బర్ ఎంపి ఒక ప్రత్యేక రిట్ పిటిషన్ దాఖలు చేశారని తెలియడంతో ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. 'ఈ రెండు కేసులకు సంబంధం ఉంది. సంతకాల ఫోర్జరీ కేసును విచారిస్తున్న ధర్మాసనం ముందు నేను సోదాల అపరేషన్ విషయాన్ని ప్రస్తావించాను. ఆ కేసును గురువారం విచారణకు న్యాయమూర్తి జాబితా చేశారు. ఆ తర్వాత, అభిషేక్ తరపు ప్రతినిధులు కొందరు నా వద్దకు వచ్చి, సిఐడి సోదాల విషయంలో ప్రత్యేకంగా ఒక రిట్ దాఖలు చేశారని చెప్పారు. నాకు ఆ విషయం తెలియకపోవడంతో నేను ఆశ్చర్యపోయాను,' అని కళ్యాణ్ విలేకరులతో అన్నారు. నను ఎందుకు విశ్వాసంలోకి తీసుకోలేదని తాను ప్రశ్నించగా, పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు అలా చేశారని వారు చెప్పారని ఆ న్యాయవాది ఆరోపించారు. శ్రీరాంపూర్ లోక్‌సభ ఎంపి అభిషేక్ తన 45 ఏళ్ల వృత్తిపరమైన అనుభవానికి ఎలాంటి గౌరవం చూపలేదని ఆరోపిస్తూ ఆయనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తనను చెత్తబుట్ట లాగానో, లేదా ఆయన కామాక్ స్ట్రీట్ కార్యాలయంలోని ఉద్యోగిలాగానో చూడటానికి వీల్లేదని కళ్యాణ్ తేల్చి చెప్పారు. అభిషేక్‌ను అన్ని నాయకత్వ పదవుల నుండి తొలగించి, కేవలం ఒక సాధారణ కార్యకర్తగా మాత్రమే కొనసాగిస్తేనే ఈ పార్టీలో ఉంటానని, సీనియర్లతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, బాస్‌లా వ్యవహరించే అభిషేక్ తనకు నాయకుడిగా ఉండలేరని, ఆయన నాయకుడిగా కొనసాగితే, తాను టిఎంసి కొనసాగడం సాధ్యం కాదన్నారు.

**రాజ్యసభకు మరో టిఎంసి ఎంపి రాజీనామా**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రోజుకో ఎదురుదెబ్బ తగులుతోంది. గురువారం మరో రాజ్యసభ ఎంపి రాజీనామా చేశారు. గత నాలుగు రోజుల్లో రాజీనామా చేసినవారి సంఖ్య మూడుకు చేరింది. ప్రకాశ్ చిక్ బరైక్ తమ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్‌కు లేఖ రాశారు. దీంతో రాజ్యసభలో 13 మంది ఎంపిలను కలిగి ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల బలం ఇప్పుడు 10కి తగ్గింది. సోమవారం నాడు సీనియర్ నాయకుడు సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సీటు,తృణమూల్ సభ్యత్వాన్ని వదులుకున్నారు. పార్టీలో చాలా కాలంగా నెలకొన్న పరిస్థితుల కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పారు. ఆ తర్వాత తృణమూల్ పార్టీకి చెందిన అసోం ప్రముఖ నాయకురాలు సుష్మితా దేవ్ కూడా పార్టీని వీడారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న సుష్మితా దేవ్, 2021లో మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీలో చేరారు. రానున్న రోజుల్లో మరో ముగ్గురు తృణమూల్ ఎంపిలు సభకు రాజీనామా చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కాగా తన రాజీనామాను తక్షణే ఆమోదించాలని, రాజ్యసభ సభ్యుడిగా పదవీకాలంలో నాకు సహాయ సహకారాలు అందించిన మీకు, గౌరవనీయులైన డిప్యూటీ చైర్మన్‌కు, రాజ్యసభ సచివాలయ అధికారులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ప్రకాశ్ తన లేఖలో పేర్కొన్నారు. గత నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో నెలకొన్న తీవ్ర సంక్షోభం నేపథ్యంలో, రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకున్న తృణమూల్ కాంగ్రెస్ మూడవ ఎంపి ఉత్తర బెంగాల్‌కు చెందిన నాయకుడు బరైక్. మీడియా ప్రశ్నలకు బరైక్ స్పందిస్తూ 'పశ్చిమ బెంగాల్‌లో ప్రజల తీర్పు తృణమూల్ కాంగ్రెస్‌కు అనుకూలంగా లేదు. నా నియోజకవర్గంలో తృణమూల్ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. ప్రజల తీర్పు బిజెపికి అనుకూలంగా ఉంది. ఆ తీర్పును గౌరవిస్తూ, నేను తృణమూల్, రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను' అని అన్నారు. తన భవిష్యత్తు కార్యాచరణ గురించి అడిగినప్పుడు, రాజకీయాల్లో తనకు భవిష్యత్తు ఉందని ఆయన చెప్పారు. కాలమే సమాధానం చెబుతుందన్నారు.

# ఇక డిఎంకె కూటమిలో భాగం కాబోం

- ప్రజాస్వామ్య శక్తులుగా డిఎంకె, అన్నాడిఎంకె, టివికె పార్టీలను సిపిఐ ఇప్పటికీ పరిగణిస్తోంది
- తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ ప్రకటన

**చెన్నై :** తమిళనాడు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తరువాత రాజకీయాల్లో పెద్ద ఎత్తున మార్పులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డిఎంకె నేతృత్వంలోని ఎన్నికల కూటమిలో భాగం కాలేమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ గురువారం ప్రకటించారు. అయితే, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కలిసి పనిచేయగలిగే ప్రజాస్వామ్య శక్తులుగా డిఎంకె, అన్నాడిఎంకె, టివికె పార్టీలను సిపిఐ ఇప్పటికీ పరిగణిస్తోందని ఆయన స్పష్టం చేశారు. డిఎంకె నేతృత్వంలోని 'సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్' ఇక ఉనికిలో లేదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం ప్రకటించిన కొద్ది రోజులకే ఈ ప్రకటన వెలువడింది. 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి డిఎంకె ప్రధాన మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలు ఇప్పుడు కొత్తగా ఏర్పడిన టివికె ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్, ఐయుఎంఎల్, విసికె పార్టీలు టివికె మంత్రివర్గంలో చేరగా, వామపక్ష పార్టీలు బయటి నుంచి మద్దతు ఇస్తున్నాయి.

**ప్రస్తుతం కూటమికి అవకాశం లేదు**

సిపిఐ రెండ్రోజుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం వీరపాండియన్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో జరిగే ఏ ఉప ఎన్నికలోనైనా సిపిఐ వైఖరిని, ఆనాటి రాజకీయ పరిస్థితులను అంచనా వేసిన తర్వాత పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తుందని చెప్పారు. 'కాంగ్రెస్ దూరమైంది, తాము 'ఇండియా' కూటమిలో భాగం కాబోమని డిఎంకె ప్రకటించింది, అలాగే అనేక ఇతర పార్టీలు టివికె నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరాయి. ఇటువంటి పరిస్థితుల్లో, ఒక సమగ్ర ఎన్నికల కూటమిగా పనిచేయడానికి ప్రస్తుతం ఎటువంటి ఆస్కారం లేదు' అని ఆయన అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమే సిపిఐకి రాజకీయ ప్రత్యర్థులని ఆయన నొక్కి చెప్పారు. 'తమిళనాడులో ఏ రాజకీయ పార్టీ కూడా మాకు శత్రువు కాదు. దేశం, ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలపై మేము ఏ ప్రజాస్వామ్య శక్తినైనా కలుపుకుని ముందుకు సాగగలము' అని ఆయన పేర్కొన్నారు.




**సిపిఐ నిర్ణయాలు సమష్టిగా ఉంటాయి**

కూటముల విషయంలో నిర్ణయాలు తీసుకునేలా మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సిపిఐపై ఒత్తిడి తెచ్చారన్న వార్తలను వీరపాండియన్ తోసిపుచ్చారు. డికెంకె నాయకుడు ఎప్పుడూ సిపిఐ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదని, పార్టీ రాజకీయ నిర్ణయాలను నిర్దేశించడానికి ప్రయత్నించలేదని ఆయన చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు తమ సంస్థాగత నిర్మాణం ద్వారా సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాయని, తమ పార్టీ తమ కమిటీలలో చర్చల తర్వాతే నిర్ణయాలు తీసుకుంటుందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అందువల్ల ఈ వైఖరిని తీసుకునేలా ఎవరైనా మమ్మల్ని బలవంతం చేశారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని చెప్పారు.

**ప్రజా తీర్పు ఆధారంగా టివికెకు మద్దతు**

టివికె ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇవ్వాలన్న సిపిఐ నిర్ణయాన్ని వివరిస్తూ, ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ గౌరవిస్తోందని వీరపాండియన్ పేర్కొన్నారు. టివికె 108 స్థానాలను గెలుచుకుందని, డిఎంకె లేదా అన్నాడిఎంకె ప్రభుత్వ ఏర్పాటుకు తగిన స్థితిలో లేవని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తు ఎన్నికలలో వామపక్ష పార్టీలు ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేయడాన్ని కొనసాగిస్తామని సిపిఐ నాయకుడు పునరుద్ఘాటించారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయం వచ్చినప్పుడు వాటికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# గ్రామంపై అనుమానిత ఉగ్రవాదులు దాడి

- ఇద్దరిని కాల్చిచంపిన దుండగులు
- మణిపూర్ కామ్‌జోంగ్ జిల్లాలో ఘటన



**ఇంఫాల్:** మణిపూర్‌లోని కామ్‌జోంగ్ జిల్లాలో గురువారం అనుమానిత ఉగ్రవాదులు ఒక గ్రామంపై దాడికి పాల్పడ్డారు. ఇద్దరిని కాల్చి చంపి, అనేక ఇళ్లను తగలబెట్టారని పోలీసులు తెలిపారు. కాంగ్‌పోక్పి జిల్లాలో ఆరుగురు నాగా పౌరుల మృతదేహాలు లభ్యమైన మరుసటి ఈ ఘటన జరిగింది. లభ్యమన మృతదేహాలు సాయుధ బృందాలచే బందీలుగా పట్టుబడిన వారివేనని అనుమానిస్తున్నారు. కుల్తుహ్ కుకీ అనే చిన్న గ్రామంపై గురువారం ఉదయం 4.55 గంటల ప్రాంతంలో అనుమానిత ఉగ్రవాదులు దాడి చేశారని, ఈ దాడిలో ఇద్దరు మరణించారని పోలీసులు తెలిపారు. మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి సమీపంలో ఉన్న సుమారు 30 ఇళ్లను కూడా తగలబెట్టారని అధికారి తెలిపారు. భద్రతా దళాలు ఆ మారుమూల గ్రామానికి చేరుకున్నాయి, కానీ దుండగుల గుర్తింపు ఇంకా తెలియరాలేదు. కుకీ బాప్టిస్ట్ కన్వెన్షన్ ఈ హత్యలను ఖండించింది. పౌరులకు రక్షణ కల్పించడానికి నిర్ణయాత్మక, సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులను కోరింది. ఈ హత్యపై కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ లామ్టిన్‌థాంగ్ హావోకిప్ మాట్లాడుతూ, కుల్తుహ్ చర్చి ప్రధాన డీకన్, యువజన విభాగం చైర్మన్‌ను దారుణంగా హత్య చేశారు అని పేర్కొన్నారు. పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వ వైఫల్యం సహనానికి అతీతం అని ఆయన ఆరోపించారు.

సైద్ధాంతికంగా...

# చెక్కుచెదరని ఏకైక పార్టీ కాంగ్రెస్సే

- కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ
- టిఎంసి రాజకీయ సంక్షోభం నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టిఎంసి)లో రాజకీయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్యనాయకుడు రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్య లు చేశారు. గురువారం జరిగిన ఆ పా ర్టీ అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ సిద్ధాంతపరంగా చె క్కుచెదరని ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, అ ందుకే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలను ఎదుర్కోవడానికి ఆ పార్టీయే అత్యంత అనువైనదని పేర్కొన్నారు. ఇక్కడ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలు, రాష్ట్ర యూనిట్ చీఫ్‌లతో జరిగిన కాంగ్రెస్ అగ్రనాయక త్వం సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రస ంగిస్తూ కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతిక స్థిర త్వం కారణంగా రాబోయే రెండేళ్లలో మరింత బలోపేతం అవుతుందని నొక్కిచెప్పినట్లు పార్టీ వర్గాలు తెలియజేశా యి. దేశ ఆర్థిక వ్యవస్థ చాలా 'బలహీనమైన స్థితిలో' ఉన్నది అని గాంధీ వెల్లడి ంచారు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణమా? లేక అంతర్జాతీయ కారకాలేనా? అని ఆయన నొక్కిచెప్పారని వారు వివరించారు. ఈ పరిస్థితిపై ప్రధానమ ంత్రి తప్పనిసరిగా మాట్లాడేలా ఒత్తిడి తే వాల్సిన ఆవశ్యకత ఉందని లోక్‌సభ ప్ర తిపక్షనేత అన్నారని ఆ వర్గాలు తెలిపా యి. మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, ఛ త్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవుల వ ంటి రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాలలోని గిరిజన ప్రాంతాలలో ప్రధానమంత్రికి అనుకూలంగా పారిశ్రామికవేత్తల కు లబ్ధి చేకూర్చేందుకు రాజ్యాంగ నిబ ంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించా రు. భావజాలపరంగా విచ్ఛిన్నం కాని పార్టీ ఏదైనా ఉంటే అది కాంగ్రెస్సేనని, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలతో పోరాడగల పా ర్టీ ఏదైనా ఉందంటే అదీ కాంగ్రెస్సేనని రాహుల్ అన్నట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, సంస్థాగత, శాసనసభాపరమైన బలాన్ని గణనీయంగా బలహీనపర్చిన తిరుగుబాటు కారణంగా తృణమూల్ కాంగ్రెస్ ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత వారం టిఎంసికి చెందిన 80మంది ఎమ్మెల్యేలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది అధికారిక శాసనసభా పక్షం నుంచి విడిపోయి బహిష్కృత శాసనసభ్యురాలు రీటబ్రత బెనర్జీ నాయకత్వంలో పశ్చిమబెంగాల్ శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష కూటమిగా గుర్తింపు పొందారు. అప్పటి నుంచి తమ బలం మరింత పెరిగిందని తిరుగుబాటువర్గం పేర్కొంది. అనంతరం సంక్షోభం పార్లమెంట్‌కు కూడా చేరింది. కాకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని అసమ్మతి ఎంపీలు 20మందికి పైగా లోక్‌సభ సభ్యుల మద్దతు తమకు ఉందని ప్రకటించడంతో మమతాబెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

# కేరళలో మరోసారి 'నిపా' కలకలం

ప్రాథమిక పరీక్షల్లో 43 ఏళ్ల వ్యక్తికి వైరస్ ఉన్నట్లు గుర్తింపు



**కోజికోడ్ :** కేరళలో మరోసారి నిపా వైరస్ కలకలం రేపింది. ప్రాథమిక పరీక్షల్లో 43 ఏళ్ల వ్యక్తికి నిపా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో, అతడిని బుధవారం రాత్రి కేరళలోని కోజికోడ్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డులో చేర్చారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఇలాంటి కేసు రావడం ఇదే మొదటిది. బాధితుడికి కొన్ని రోజుల క్రితమే ఈ ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించాయని ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలోని పరిశోధన, రోగ నిర్ధారణ ప్రయోగశాలలో పరీక్షించిన నమూనాలలో నిపా ఉన్నట్లు నిర్ధారణ అయినప్పటికీ, నమూనాలను ఎన్ఐవి–పుణెకు పాంపారు. అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. నిపా వ్యాప్తిని ఎదుర్కోవడానికి నిర్దేశించిన అన్ని ప్రోటోకాల్‌లను కేరళ ఆరోగ్య శాఖ ఇప్పటికే అమలులోకి తెచ్చిందని, ఇందులో భాగంగా కంటైన్‌మెంట్ జోన్‌ను ప్రకటించడం, రోగి ప్రాథమిక కాంటాక్ట్‌లను ఐసోలేట్ చేయడం వంటివి ఉన్నాయని అధికారులు తెలిపారు. కోజికోడ్‌లోని రామనట్టుకర మున్సిపాలిటీ ప్రజలకు సామాజిక దూరం పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని సూచించారు. రోగి ఒక వ్యాపారి, అతని గోదాము దట్టమైన వృక్షసంపదకు సమీపంలో ఉందని, వ్యాపారి చాలా కాలం తర్వాత గోదామును తెరిచినప్పుడు, వైరస్‌కు నిల్వగా ఉండే పండ్ల గబ్బిలాలను పెద్ద సంఖ్యలో గుర్తించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ తీవ్రమైన జంతుజన్య వ్యాధి కేరళలో మొదటిసారిగా 2018లో కోజికోడ్ జిల్లాలో కనుగొన్నారు. ఆ సంవత్సరం నమోదైన 18 కేసులలో, 17 మంది మరణించారు. 2021లో రాష్ట్రంలో మరోసారి ఈ వ్యాధి ప్రబలి ఒక వ్యక్తి మరణించారు. 2023లో, కేరళలో నిపా కారణంగా రెండు మరణాలు నమోదయ్యాయి, 2024లో మరో రెండు మరణాలు సంభవించాయి. గత సంవత్సరం, కేరళలో నాలుగు నిపా కేసులు నమోదయ్యాయి, వాటిలో ఇద్దరు రోగులు మరణించారు. 2018 నుండి కేరళలో నిపా వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. కేరళలో ఈ వ్యాధి ప్రబలిన సందర్భాలన్నీ మే నుండి సెప్టెంబర్ మధ్య కాలంలోనే నమోదయ్యాయి, ఈ కాలంలోనే రాష్ట్రంలో ప్రధాన వర్షాకాలం ఉంటుంది. ఈ కాలంలో ఇతర వైరల్ జ్వరాలు, ఫ్లూ కూడా సర్వసాధారణం కావడంతో, అవే ప్రారంభ లక్షణాలను కలిగి ఉండే నిపాను ముందుగానే గుర్తించడం ఒక సవాలుగా మారింది.

# ఎంపిలో ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఏకగ్రీవం



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ తరపున నామినేషన్ వేసిన మీనాక్షి నటరాన్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి గత మూడు రోజుల క్రితం తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె నామినేషన్‌ను ఆమోదించాలని కాంగ్రెస్ ప్రతినిధి బృందం బుధవారం ఎన్నికల సంఘాన్ని కలిసింది. ఇక గురువారం మీనాక్షి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మధ్యప్రదేశ్‌లో ఈనెల 18న జరగనున్న మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ పరిణామం జరిగిన కొన్ని గంటలకే ముగ్గురు బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల పరిశీలన తర్వాత ఎన్నికల బరిలో మిగిలిన ముగ్గురు బిజెపి అభ్యర్థులలో ఎవరూ గురువారం మధ్యాహ్నం 3 గంటల గడువులోగా తమ నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోకపోవడంతో వారిని రిటర్నింగ్ అధికారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అధికార పార్టీ తరఫున ఎన్నికైన అభ్యర్థుల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, రాష్ట్ర కార్యదర్శి రజనీష్ అగర్వాల్, మాజీ రాష్ట్ర మత్స్య సంక్షేమ బోర్డు చైర్మన్ మహేష్ కేవత్ ఉన్నారు. రిటర్నింగ్ అధికారి తన నామినేషన్ పత్రాలను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం విచారించడానికి అంగీకరించినప్పటికీ, మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత న్యాయస్థానాలు సాధారణంగా జోక్యం చేసుకోకూడదని సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టం స్పష్టంగా ఉందని గమనిస్తూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, అతుల్ ఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం, ఎన్నికల ఫలితాల ప్రకటనను నిలిపివేయడానికి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి నిరాకరించింది.

ఓటు చోరీ, సర్కార్ చోరీ తర్వాత...

# రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి 'సీటు చోరీ'కి పాల్పడుతోంది

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఓటు చోరీ', 'సర్కార్ చోరీ' తర్వాత బిజెపి రాజ్యసభ ఎన్నికల్లో కూడా సీటు చోరీకి పాల్పడిందని, ఎన్నికల సంఘం(ఇసి)తో అధికారపక్షం చేసుకున్న 'జుగల్‌బందీ' పోటీ ప్రారంభం కాకముందే ముగించిందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ గురువారం ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ దాడి మొదలైంది. 'ఓటు చోరీ', 'సర్కార్ చోరీ' బిజెపి–ఇసి జుగల్‌బందీ సీటు దొంగతనంతో పోటీ ప్రారంభం కాకముందే ముగించింది' అని రాహుల్‌గాంధీ తన 'ఎక్స్'లో పెట్టిన ఒక పోస్ట్‌లో విమర్శల దాడి చేశారు. రాజ్యసభ ఎన్నికలలో ఏమి జరిగిందో చూడండి. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ అన్ని పత్రాలను సమర్పించారు. ఎలాంటి పెండింగ్ కేసులు లేవు. బిజెపి చేసిన నిరాధారమైన అభ్యంతరం కారణంగా ఎన్నికల సంఘం కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రద్దు చేసింది. జార్ఖండ్‌లో బిజెపి మద్దతు ఉన్న స్వతంత్ర రాజ్యసభ అభ్యర్థి పరిమళ్ నత్వానీ ఉదంతాన్ని ఉదహరిస్తూ, ఆయన ఫారంలో తన సొంతపేరును తప్పుగా నింపారని, తప్పనిసరిగా వెల్లడించాల్సిన అనేక వివరాలను విస్మరించారనీ, అయినప్పటికీ అన్నింటినీ సరిదిద్దడానికి ఎన్నికల సంఘం ఆయనకు గడువు పొడిగింపును ఇచ్చింది అని రాహుల్‌గాంధీ వెల్లడించారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ సమావేశం కోరినప్పుడు మొదట ఎన్నికల సంఘం తమను తప్పించుకోవాలని ప్రయత్నించిందని, చివరకు కాంగ్రెస్ పార్టీ నేతలు వారిని కలిసినప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదని, ఇలాంటివి మరెన్నో ఆశించవచ్చని, ఎందుకంటే బిజెపికి ఎన్నికల్లో గెలవడం కంటే ఎన్నికలను తారుమారు చేయడమే వారికి చాలా సులభం అని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. దాఖలు చేయగా ఉపశమనం దక్కకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ రద్దును సవాల్‌చేస్తూ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షినటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం (జూన్ 12న) విచారణజరుపనుంది.

# జవాబుదారీ లేకుండా మోదీ తప్పించుకోలేరు

- ఒమన్ తీరంలో భారత్ నావికుల మరణంపై కాంగ్రెస్ హెచ్చరిక
- అవసరమైన దౌత్యచర్యలకు డిమాండ్: అమెరికా దాడికి ఖండన

న్యూఢిల్లీ:ఒమన్ గల్ఫ్ తీరంలో 'పలావు' జెండాతో వెళుతున్న వాణిజ్య నౌకపై అమెరికా చేసిన నిర్లక్ష్యపూరిత, విచక్షణారహితమైన సైనిక దాడిని కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రాంతంలో సముద్ర నౌకా యానానికి, సిబ్బంది భద్రతకు ముప్పుగా మారిన దాడులను తీవ్రంగా వ్యతిరేకించింది. ఐతే ముగ్గురు భారతీయ నావికులు మరణించిన విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జవాబుదారీ వహించకుండా తన బాధ్యతల నుండి ఎంతమాత్రం తప్పించుకోలేరని కూడా హెచ్చరించింది. మొదటిసారి ఐరిష్ దేనా నౌకపై దాడి జరిగినప్పుడే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని, దాని ఫలితంగానే దాడులు కాస్తా ఈనాడు నావికుల ప్రాణ నష్టానికి దారితీశాయని విమర్శించింది. జవాబుదారీ వహించేవిధంగా కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని దౌత్యపరమైన చర్యలనూ తీసుకోవాలని డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాలకు తక్షణం సహాయం అందించాలని, మరణించిన నావికుల మృతదేహాలను సత్వరం దేశానికి తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, సురక్షితగా ఉన్న నావికులను కూడా వెంటనే భారత్‌కు రప్పించాలని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. రోజు రోజుకూ అస్థిరంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో నాకా రవాణాకు సంబంధించిన ఒక సమగ్ర వ్యూహాన్ని తక్షణమే కేంద్రం పార్లమెంటుకు సమర్పించాలని కోరింది. ప్రపంచ అవాంతరాల సమయంలో జాతీయ ఏకాభిప్రాయాన్ని ఒక వ్యూహాత్మక ఆస్తిగా పరిగణించి, ప్రతిపక్షాలకు ఉన్న అపారమైన అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో తనకున్న వ్యక్తిగతమైన అనుబంధాన్ని కూడా పదే పదే తన దౌత్య విజయంగా ప్రకటించుకునే నరేంద్రమోదీ భారత్‌కు చెందిన ముగ్గురు నావికులను రక్షించడంలో,దేశ ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైన తర్వాత కూడా జవాబుదారీ వహించకుండా ఎంతమాత్రం తప్పించుకోలేరని ఉద్ఘాటించింది. ఈ విషాదానికి జవాబుదారీ నెలకొల్పడానికి,హోర్ముజ్ జలసంధిలో ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్న భారత నావికుల భద్రత, శ్రేయస్సు కాపాడటానికి ప్రభుత్వం అవసరమైన దౌత్య చర్యలు తీసుకోవాలని కోరింది. కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగానికి నాయకత్వం వహిస్తున్న భారత విదేశీ వ్యవహారాల మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ, యుద్ధ మొదలయ్యాక ఐరిష్ దేనా నౌకపై దాడి జరిగిందని,కానీ ఆనాటి నుండి ప్రభుత్వం చాలా నిష్క్రియాపరత్వంగా, జడత్వంతో వ్యవహరించడం వల్ల బాహ్యశక్తులకు ఇదొక అవకాశంగా మారిందని విమర్శించారు. గడచిన నాలుగు రోజుల్లో పశ్చిమాసియాలోని ఒమన్ తీర ప్రాంతంలో అమెరికా సైనికులు వాణిజ్య నౌకలపై చేసిన దాడులలో ముగ్గురు భారతీయ నావికులు మరణించారని గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని చాలా గట్టిగా అమెరికా దృష్టికి తీసుకువెళ్ళామని, ఖండించామని పేర్కొంది. భారత నావికులపై అమెరికా గురిపెట్టి దాడులు చేసిందని కేంద్రం బహిరంగంగా చెప్పడం ఇదే మొదటిసారి. ఒమన్‌లోని సోహార్ ఓడరేవుకు ఈశాన్యంగా సుమారు 10 నాటికల్ మైళ్ళ దూరంలో ఈ వాణిజ్య నౌక ఉన్న సమయంలో దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఏజన్సీ (యుకెఎంటిఎ) తెలియజేసింది. పలావూ జెండాతో వెళుతున్న మారివెక్స్ ఆయిల్ ట్యాంకర్‌లో 24 మంది భారతీయ నావికా సిబ్బంది ఉన్నారు. జూన్ ఎనిమిదోతేదీన అమెరికా సైనికులు ఈ ట్యాంకర్‌ను కదలకుండా స్తంభింపజేశారు. ఇందులో ఉన్న భారతీయ నావికులు అందరినీ చాలా సురక్షితంగా విడిపించారు. కానీ తర్వాత జూన్ 10వ తేదీన 'పలావూ' ద్వీపానికి చెందిన జెండాతో వెళుతున్న భారతీయ సిబ్బంది ఉన్న సెట్టిబెల్లో అనే మరో ట్యాంకర్‌ను స్తంభింజేసింది. కానీ ఇరాన్‌కు చెందిన ముడి చమురును తాము విధించిన దిగ్బంధన నిబంధనలను ఉల్లంఘించి తీసుకువెళుతున్నారన్న కారణంగా ట్యాంకర్‌పై దాడి చేసింది. దీంతో ట్యాంకర్ ఇంజిన్ రూములో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత అక్కడ ఉన్న ముగ్గురు భారతీయ నావికులు కనిపించకుండా పోయారు. గురువారం నాటికి వారిలో ఇద్దరు శవాలుగా మారి గాలింపు చర్యల్లో సహాయ సిబ్బందికి దొరికారు. ఇంకో భారతీయ నావికుడి మృతదేహం ఇంతవరకూ దొరకలేదు. ఆ మృతదేహం కోసం కూడా ముమ్మరంగా గాలింపు కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ ఘటనలపై కాంగ్రెస్‌పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేసింది. ''మేం హృదయాంతరాళాల్లోంచి వారి కుటుంబాలకు మా ఆవేదన వ్యక్తం చేస్తున్నాం, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం, ప్రియతములైనవారిని ఆ కుటుంబాలు కోల్పోయాయి, ఈ కష్టసమయంలో వారి కుటుంబాలకు పూర్తి అండగా నిలబడతాం'' అని పేర్కొంది.

# బెల్‌ఫాస్ట్‌లో వలస వ్యతిరేక అల్లర్లు

**బెల్‌ఫాస్ట్:**కత్తితో కిరాతకమైన దాడికి పాల్పడిన కేసులో ఒక సూడానీ వలస జాతీయుడు హదీ అలోడిద్ (30) ఐర్లాండ్ వాసి స్టీఫెన్ ఓగ్వీలీ (40)పై కత్తితో దాడిచేసిన తర్వాత బెల్‌ఫాస్ట్ నగరంలో మంగళవారం రాత్రి ప్రారంభమైన హింసాత్మక అల్లర్లు గురువారంనాటికి మూడో రోజుకు చేరాయి. హదీని అరెస్టు చేసిన తర్వాత మంగళవారం రాత్రి ముసుగులు ధరించిన అనేకమంది బెల్‌ఫాస్ట్‌లోనగర వీధుల్లో అల్లర్లుకు పాల్పడి విధ్వంసం సృష్టించారు. వలస ప్రజలు, శరణార్థి కుటుంబాలపై దాడులు చేశారు. బస్సులు,వాహనాలను దగ్ధం చేశారు. తూర్పు బెల్‌ఫాస్ట్‌లోని లెండ్రిక్ వీధి పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. కార్లు, ఇళ్ళు దగ్ధమయ్యాయి. శ్వేతజాతీయుల ఇళ్ళను, బయట పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను లక్ష్యంగా చేసుకుని దహనాలకు, దాడులకు పాల్పడినట్లు బ్రిటన్ పత్రిక పేర్కొంది. దీంతో ఐర్లాండ్–బ్రిటన్ మధ్య స్వేచ్ఛగా ప్రయాణాలు చేసే కామన్ ట్రావెలింగ్ ప్రాంత భద్రతపై దృష్టి సారించాలన్న డిమాండ్లు పెరిగాయి. అల్లరిమూకలు ఇళ్ళకు, కార్లకు, ఒక సూపర్ మార్కెట్‌కు ముసుగులు ధరించిన మూకలు నిప్పుపెట్టి దగ్ధం చేశాయి.బ్రిటన్ ప్రధాన మంత్రి సర్ కీర్ స్టార్‌మర్ ఈ ఘటనలపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



## బ్యాంకాక్ బాంబింగ్ కేసులో ఇద్దరికి ఉరిశిక్ష

**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్‌లో అత్యంత ఘోరమైన బాంబుదాడిగా చరిత్రలో నిలిచిపోయిన బ్యాంకాక్ బాంబుదాడి కేసులో న్యాయస్థానం ఇద్దరికి ఉరిశిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. బ్యాంకాక్‌లో 2015 ఆగస్టు 19వ తేదీన ఎరవాన్ పుణ్యక్షేత్రంపై బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 20 మంది మరణించారు. ఈ మృతుల్లో ఎక్కువమంది చైనీయులు,హాంగ్‌కాంగ్ వాసులు ఉన్నారు. అప్పటినుండీ ఈ కేసు విచారణ కొనసాగింది. ఈ కేసు విచారణ దశకు చేరుకోవడానికి పది సంవత్సరాలు సమయం పట్టింది. 10,000 పేజీలు లిఖిత సాక్ష్యాలు,400 మంది సాక్షులను కోర్టు విచారించింది. చైనా పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. ఈ బాంబు దాడికి ఏ సంఘమూ బాధ్యత వహించకపోయినప్పటికీ, దాడికి ముందుగా థాయ్‌లాండ్ నుండి 100 మంది ఉయిఘర్లను బహిష్కరించినందువల్లనే ఈ దాడి జరిగిందని భద్రతా నిపుణులు భావిస్తున్నారు. చైనాలోని జిన్‌జియాంగ్‌లో వేధింపుల కారణంగా ఉయిఘర్లు అక్కడి నుండి పారిపోతున్నారు. కానీ చైనా ఈ ఆరోపణలను ఖండించింది.

# జోర్డాన్ సహా 18 అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

ఈ రాత్రికే ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం : ట్రంప్

గునియా-బిస్సావూ జెండాతో వెళ్తున్న 'జల్‌వీర్' నౌకపై దాడి

బ్రహ్రైన్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై డ్రోన్ దాడులు




**దుబాయ్ :** పశ్చిమాసియాలో జోర్డాన్ సహా 18 అమెరికా స్థావరాలపై ఇరాన్ గురువారం ప్రతీకార దాడులు చేసింది. బుధవారం భీకర దాడులుచేసి తుదివిడత శాంతి చర్చలకు విఘాతం కలిగించిన ట్రంప్ మీడియాకు చెప్పినవిధంగానే రెండోరోజు దాడులు కొనసాగించారు. ఇరాన్ స్థావరాలపై 49 తోమాహక్ క్షిపణులను ప్రయోగించామని, గురువారం ఉదయం నాటికి లక్ష్యాలపై దాడులు పూర్తిచేశామన్నారు. రెండు భారత్ నౌకలపై దాడుల తర్వాత హోర్ముజ్‌లో తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించి ఇరాన్ చమురును రవాణా చేస్తున్న గునియా–బిస్సావూ జెండాతో వెళుతున్న మూడో నౌక ''జల్‌వీర్''పై కూడా దాడి చేసినట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ రాత్రికే భీకర దాడులు చేసి ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. విదేశాలకు ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన అతిచిన్న వ్యాపారస్థావరం ఖర్గ్ ద్వీపం. దీనిని చేజిక్కించుకుని ఇరాన్ చమురు మార్కెట్‌ను, చమురు సంపదను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ అన్నారు. మార్చి 13వ తేదీన ఖర్గ్ ద్వీపంపై సెంట్‌కామ్ దాడులు చేసి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. భవిష్యత్తులో మరిన్ని దాడులు చేస్తామని కూడా ట్రంప్ ఆనాడే చెప్పారు. అదేవిధంగా గల్ఫ్‌లో జోర్డాన్,కువైట్,బ్రహ్రైన్‌లలో ఉన్న 18 అమెరికా గగనతలస్థావరాలపై క్షిపణి,డ్రోన్ దాడులు చేసింది. ముఖ్యంగా జోర్డాన్‌పై సైనిక దాడులను పెంచింది. జోర్డాన్‌లోని అల్–జరాక్ అమెరికా సైనిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ధ్వంసం చేశామని ఐఆర్‌జిసి ధృవీకరించింది. కువైట్‌లో ఉన్న అలీ అల్–సాలెమ్, అహ్మద్ అల్–జబర్ గగనతల స్థావరాలపై దాడులు చేసినట్లు ప్రకటించింది. టెహ్రాన్,అల్‌బోర్జ్,హోర్ముజ్‌గన్ రాష్ట్రాలలో అమెరికా చేసిన దాడులకు ప్రతీకారం తీర్చుకున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌పై ఇలాంటి కుట్రపూరిత చర్యలు మానకపోతే దాడులు కొనసాగుతాయని హెచ్చరించింది. కాగా ఇరాన్ ఆర్మీ మరో ప్రకటన చేస్తూ బ్రహ్రైన్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై మళ్ళీ డ్రోన్ దాడులు చేసినట్లు ప్రకటించింది. దీంతో పశ్చిమాసియాలో పరిణామాలపై చైనా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రెండు దేశాలు దాడులకు దూరంగా ఉండి సంయమనం పాటించాలని చైనా విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్‌జియాన్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ,దౌత్య మార్గాలలో సమగ్ర ఒప్పందం చేసుకోవాలని కోరారు. ఇరాన్ దాడుల భయంతో కువైట్ పూర్తిగా తన గగనతలాన్ని మూసివేసింది. కొద్ది గంటల తర్వాత మళ్ళీ పునరుద్ధరించింది. పౌర విమాన సేవలు కూడా కొద్ది గంటలు స్తంభించాయి. హోర్ముజ్ సమీపంలో భీకరమైన పేలుళ్ళు జరిగాయని ఇరాన్ మీడియా ప్రకటించగా, ఇరాన్ కమ్యూనికేషన్ వ్యవస్థ,ఎయిర్, డిఫెన్స్ వ్యవస్థలపై దాడులు చేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్‌లో ఉన్న ఉన్నతస్థాయి అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడామని, బాంబు దాడులను నిలిపివేయాలని వారు ప్రాధేయపడ్డారని కూడా ట్రంప్ చెప్పారు.ఐతే ట్రంప్ చేసిన ప్రకటనలను ఇరాన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అసలు వారు ఇరాన్‌తో మాట్లాడలేదని, యుద్ధాన్ని తప్పించుకోవడానికే ఈ ప్రకటన చేశారని, ట్రంప్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో అస్సలు ఏ నౌకనూ తిరగనివ్వకుండా పూర్తిగా మూసేశామని ఇరాన్ ప్రకటించగా, ఆ ప్రకటనను అమెరికా సెంట్‌కామ్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ అబద్ధపు ప్రకటన చేసిందని, హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని పేర్కొంది. అమెరికా యుద్ధ నౌక, యుద్ధ విమానాలపై 12 క్షిపణులతో దాడులు చేశామని ఐఆర్‌జిసి ప్రకటించగా, అలాంటి దాడులు జరగలేదని సెంట్‌కామ్ ఖండించింది. అమెరికా చేసిన కొత్త దాడులకు తగిన సమాధానం చెబుతామని, తాము నిలదొక్కుకుని పోరాడతామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు. కాగా ట్రంప్ విడిగా ఒక ప్రకటన చేస్తూ ప్రస్తుతం ఈరోజు జరిగిన దాడుల్లో ఇజ్రాయెల్ పాల్గొనలేదని, ఈ దాడులతో ఇజ్రాయెల్‌కు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. ఇరాన్‌పై పూర్తిస్థాయి దాడులు చేయబోతున్నామని, ఆ హక్కు తమకు ఉందని అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు తుది విడత చర్చల ద్వారా ఒప్పందం చేసుకోవడానికి తీవ్ర జాప్యం చేస్తున్నందుకు ఇరాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మరోసారి హెచ్చరించారు. ఇదిలా ఉండగా, అమెరికా చేసిన సరికొత్త దాడులకు ప్రతీకారంగానే గురువారంనాడు జోర్డాన్, బ్రహ్రైన్, కువైట్‌లలో ఉన్న అమెరికా స్థావరాలపై రెండో రోజు రాత్రి వరుసగా దాడులు చేశామని, అమెరికన్లు సురక్షితంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోవాలని ఐఆర్‌జిసి హెచ్చరించింది. లెబనాన్‌లో యుద్ధం నిలిపివేత,స్తంభింపజేసిన ఆస్తుల విడుదల వంటివి చర్చల్లో ఇరాన్‌కు ముఖ్యాంశాలుగా ఉండగా, ఇక శాశ్వతంగా అణ్వాయుధానికి ఇరాన్ దూరంగా ఉండటం, శుద్ధి చేసిన యురేనియం స్వాధీనం చేయడం, గల్ఫ్ దేశాలు పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని అంగీకరించడం అమెరికాకు ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఈ సందట్లో ముడి చమురు ధర ఒక బ్యారెల్‌కు రెండు డాలర్లు వంతున పెరిగింది. తిరిగి భారీస్థాయిలో దాడులు చేస్తామని, ప్రతిదాడులు చేస్తామని అమెరికా–ఇరాన్ పరస్పర తాజా హెచ్చరికల మధ్య యుద్ధ పరిష్కారానికి సత్వర ఒప్పందం కుదురుతుందన్న ఆశలు అడుగంటుతున్నాయి.

# నన్ను బ్లాక్‌మెయిల్ చేయాలనుకున్నాడు

ఎప్‌స్టీన్ కేసులో కమిటీ ఎదుట బిల్‌గేట్స్ వాంగ్మూలం

**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా అనేకమందిని లైంగిక అవినీతి రొచ్చులోకి దింపి అపఖ్యాతిపాలైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన కేసులో ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ విచారణ కమిటీ ఎదుట హాజరై వాగ్మూలం ఇచ్చారు. తన వివాహేతర సంబంధాల సమాచారాన్ని అడ్డుపెట్టుకుని ఎప్‌స్టీన్ తనను బ్లాక్ మెయిల్ చేసేందుకు ప్రయత్నం చేశాడని, తనకున్న పరిచయస్థుల ద్వారా ఎప్‌స్టీన్ తన సర్కిల్‌లోకి ప్రవేశించాడని అమెరికా ఓవర్‌సైట్ హౌస్ కమిటీ ఎదుర రహస్య విచారణలో చెప్పారు.వైవాహిక జీవితంలో భార్యాభర్తలమధ్య ఉండే విశ్వసనీయతను తాను ఉల్లంఘించానని గేట్స్ అంగీకరించారు. ఎప్‌స్టీన్ సెక్స్‌నేరాల గురించిన వివరాలు తనకు తెలియవని కూడా చెప్పారు.
అపఖ్యాతిపాలైన ఎప్‌స్టీన్ చివరకు జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి సంబంధించిన లక్షల పేజీల పత్రాలను అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ పత్రాలలో అనేకమంది పెద్దమనుషుల పేర్లు బయటపడ్డాయి. వాటిల్లో బిల్‌గేట్స్‌కూడా ఉన్నారు. తన ఫౌండేషన్‌కు విరాళాలు సేకరించేందుకు సహకరిస్తానని ఎప్‌స్టీన్ చెప్పాడని, అవన్నీ బూటకపు మాటలని తెలిసిన తర్వాత అతడితో సంబంధాలను తాను వదులుకున్నానని కమిటీ ఎదుట బిల్‌గేట్స్ చెప్పారు. ఎప్‌స్టీన్ ఇలాంటి వ్యక్తి అని తనకు తెలియదని, ఆయనకున్న సంబంధాలు ఎలాంటివో తెలిసిన తర్వాత తాను చాలా తీవ్రంగా బాధ పడుతున్నానన్నారు. అతడితో పరిచయమే పెద్ద పొరపాటని, ఈ పరిచయం తనను తీవ్ర ప్రమాదంలో పడేసిందని గేట్స్ కమిటీ ఎదుట చెప్పినట్లు న్యూయార్క్‌టైమ్స్ పేర్కొంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, ఫలవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉండాలని కోరుకునే తన ఆశయాలకు, ఎప్‌స్టీన్ ఆలోచనలకు పరస్పరం పూర్తి విరుద్ధమని ఆయన అన్నారు.
ఎప్‌స్టీన్ ఫైళ్ళనుండి

**ట్రంప్‌ను రక్షించేందుకు సమావేశం :** కామాంధుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం నుండి ట్రంప్‌ను రక్షించేందుకు వీలైన ఆలోచనలు చేయడానికి వైట్ హౌస్‌లో ఇటీవల ఒక సంక్షోభ సమావేశం జరిగిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో ''మాగా'' మద్దతుదారులు, సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారి నుండి ప్రభుత్వాన్ని కాపాడేందుకు ఆలోచ





నలు చేయడానికి ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్, ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్, పూర్వ న్యాయశాఖాధిపతి పామ్ బాండీ తదితరులు సంక్షోభ నివారణకు ఒక అసాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రంప్ హాజరుకానప్పటికీ, ఎప్‌స్టీన్స్‌కు సంబంధించిన ఫైల్స్‌అన్నీ విడుదల చేయాలని వాన్స్ వాదించారు. అదేవిధంగా బాలల అక్రమ రవాణా లైంగిక కేసులలో 20 ఏళ్ళు శిక్ష అనుభవిస్తున్న ఎప్‌స్టీన్ సన్నిహితురాలు గిసెలైన్ మాక్స్‌వెల్‌ను ఫాక్స్‌న్యూస్ సంస్థ ద్వారా పూర్తిస్థాయి ఇంటర్వ్యూ చేయించడం ద్వారా ఆమె బయటపెట్టే కొన్ని నిజాలైనా ట్రంప్‌ను నిర్దోషిగా ప్రకటించే అవకాశం ఉంటుందని జె.డి.వాన్స్ ఒక విచిత్రమైన సరికొత్త సలహా ఇచ్చారన్న వార్త కూడా వెలుగులోకి వచ్చింది.

## జోహన్నెస్‌బర్గ్‌లో సామూహిక కాల్పులు

12 మంది మృతి : దుండగులకోసం వేట

**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా రాజధాని నగరం జోహన్నెస్‌బర్గ్‌లో బుధవారం ఒక ప్రాంతంలో ప్రజలపై దుండగులు సామూహిక కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12 మంది మరణించగా, మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలంలోనే ఎనిమిదిమంది పురుషులు, ముగ్గురు మహిళలు కాల్పుల్లో మరణించగా మరొకరు ఆసుపత్రికలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ సామూహిక దాడికి పాల్పడిన దుండగులకోసం పోలీసులు భారీ ఎత్తున గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ చర్య వెనుక ఉన్న బలమైన కారణం ఇంకా బయటకు తెలియలేదు. క్లీవ్‌లాండ్‌లోని ఒక ప్రైవేటు ప్రాంతంలో ఈ కాల్పుల ఘటన సంభవించింది. క్లీవ్‌లాండ్‌లోని ఒక పెట్రోలు బంకువద్ద ఒక తెల్లని బయోటా కారులో పదిమంది అనుమానితులు దిగి వెళ్ళారని అనధికార వర్గాల నుండి ఒక సమాచారం లభించింది. దానిని ఆధారంగా చేసుకుని హంతకుల ఆచూకీ తీసేందుకు యత్నిస్తున్నారు. అనుమానితులు వేరు వేరుగా విడిపోయి విడి విడిగా వెళ్ళి అనేక మార్గాలలో ఒక ప్రైవేటు ప్రదేశంలో ఉన్న నివాసాలపై కాల్పుల దాడులు చేసి, తిరిగి మళ్ళీ అదే వాహనంలో బయలుదేరి వెళ్ళిపోయినట్లు పోలీసులకు సమాచారం లభించింది.

## దేశవ్యాప్తంగా ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు, కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. అలాగే, దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. ఎంఎస్ఎంఈ రంగం పూర్తిగా దెబ్బ తింది. యువత తమ భవిష్యత్తు గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు' అని వేణుగోపాల్ స్పష్టం చేశారు. మరోవైపు జార్ఖండ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాత్రం బిజెపి కార్పొరేట్ అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో ఆయన పేరును సరిగా ప్రస్తావించకపోయినా రిటర్నింగ్ అధికారి ఆమోదించారని కె.సి.వేణుగోపాల్ గుర్తు చేశారు. అంతే కాదు, రెండు కాలమ్‌లు నింపకపోయినా, అది తప్పుల తడకగా ఉన్నా దాన్ని ఆమోదించారని ఆరోపించారు. ఎలాంటి కారణాలు లేకుండానే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఏకపక్షంగా తిరస్కరించారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యం ఎంత దయనీయ స్థితిలో ఉందో ఇది చూస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై సమావేశంలో లోతుగా చర్చించామన్నారు.

**భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ**

మరోవైపు, దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ శ్రేణులకు సూచించింది. ఈ మేరకు ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జులు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులతో అత్యవసర సమావేశం నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ హాజరై నేతలకు దిశానిర్దేశం చేశారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించిన కాంగ్రెస్ నాయకత్వం భవిష్యత్ కార్యాచరణపైనా సమాలోచనలు జరిపింది. ప్రస్తుతం దేశం అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో కుంభకోణాలు, సామాజిక అసమానతలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటోందని ఖర్గే పేర్కొన్నారు.
దేశంలో దశాబ్దాలుగా నిర్మించుకున్న కీలక వ్యవస్థలు బలహీనమై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పోరాటంతోపాటు రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కూడా కాంగ్రెస్ బాధ్యతేనని తెలిపారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ విషయంలో ఇసి, అధికారుల తీరుపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాజకీయంగా, న్యాయ పరంగా పోరాటం చేయాలని నిర్ణయించారు.

## అభివృద్ధి పథంలో భారత్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని గుర్తుచేశారు. ఈ ఒప్పందాలు దేశంలోని ఎంఎస్ఎంఇలకు మంచి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకుంటూ గ్లోబల్ మార్కెట్లకు సిద్ధం కావడానికి తోడ్పడతాయని వివరించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసి, భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు నడిపించేలా రాష్ట్రాలు వారి విద్య, నైపుణ్యాభివృద్ధి, భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీ కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనమంతా కలిసి పనిచేస్తున్నామని, వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడంలో కేంద్రం, రాష్ట్రాల సమష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కలిసి పనిచేయడానికి నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రధాని ప్రసంగానికి సంబంధించిన వివరాలను నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'వికసిత్ భారత్ దార్శనికత దిశగా రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, కలిసి పనిచేయడానికి వీలుగా, సహకారానికి ఒక వేదికగా నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదు. రాష్ట్రాల మధ్య పరస్పర చర్యలకు సహకారం, చర్చలు, పంచుకోవడం మార్గదర్శకంగా ఉండాలి. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మేమంతా కలిసి పనిచేస్తున్నాము' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో యువత ఒక చారిత్రక అవకాశం అన్న మోదీ, వారిని ఎంతమాత్రం కోల్పోకూడదని అన్నారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా భారతీయ యువతకు సరైన వాతావరణాన్ని సృష్టించడం మన ప్రాధాన్యంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ వైపు ప్రయాణంలో సాధికారత సాధించిన యువతే ప్రధాన చోదక శక్తిగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధే వికసిత్ భారత్ దార్శనికతకు మూలస్తంభం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, స్టార్టప్‌లు, సైన్స్, ఇన్నోవేషన్ సహా అన్ని రంగాల్లో నారీ శక్తి తన వంతు కృషి చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

## గృహిణులు దేశ నిర్మాతలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించామని ధర్మాసనం పేర్కొంది. దేశ నిర్మాతగా గృహిణికి, గృహ సంరక్షణ కోల్పోయినందుకు నెలవారీ కనీస ఆదాయం ఏ సందర్భంలోనైనా నెలకు రూ. 30,000 ఉండాలని నిర్ధారించామని పేర్కొంది. గతంలో, మరణించిన గృహిణులను నైపుణ్యం ఉన్న లేదా లేని కార్మికులతో సమానంగా పరిగణిస్తూ, ప్రస్తుత కనీస వేతనాల ఆధారంగా వారికి ఒక ఊహాజనిత ఆదాయాన్ని కేటాయించడం ద్వారా పరిహారాన్ని నిర్ణయించేవారు. నిజానికి ఇంటి కార్యకలాపాలు గణనీయంగా గృహిణిపైనే ఆధారపడి ఉన్నప్పుడు, ఆమెను సంపాదించే సభ్యులపై ఆధారపడిన వ్యక్తిగా వర్ణించడం విడ్డూరంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇంటి యజమానురాలు అందించే సేవలకు గుర్తింపుగా, భవిష్యత్తులో 'గృహిణి/ఇంటి నిర్వాహకురాలు' అనే పదాన్ని 'దేశ నిర్మాత'గా ఉపయోగిస్తారని మా ఆశ... సంపాదించే సభ్యులు వాస్తవానికి పూర్తిగా గృహిణిపైనే ఆధారపడి ఉంటారు, కానీ విచారకరంగా, ఈ వాస్తవానికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాలలో కొంత విజయంతో ప్రయత్నాలు జరిగాయి, కానీ నిస్సందేహంగా ఈ ప్రయాణం ఇంకా చాలా దూరం ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. ఆర్థికవేత్త సర్ సెసిల్ పిగౌను ఉటంకిస్తూ, 'ఫ్యాక్టరీలో గానీ, ఇంట్లో గానీ వేతనాలకు బదులుగా మహిళలు అందించే సేవలు గుర్తింపు పొందుతాయి, కానీ తల్లులు, భార్యలు తమ సొంత కుటుంబాలకు ఉచితంగా అందించే సేవలు గుర్తింపు పొందవు. అందువల్ల, ఒక పురుషుడు తన ఇంటి పనిమనిషిని లేదా వంటమనిషిని పెళ్లి చేసుకుంటే జాతీయ ప్రయోజనం తగ్గిపోతుంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.భారతదేశ జిడిపిలో మహిళల వేతనం లేని సంరక్షణ పని 15–17 శాతం వాటాను కలిగి ఉందని అంచనా వేయబడినప్పటికీ, దానికి వేతనం చెల్లించబడటం లేదని, గుర్తింపు కూడా లభించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సమాజానికి మహిళల సహకారం కేవలం జీవసంబంధమైన పునరుత్పత్తికి మించి విస్తరించి ఉండటమే కాకుండా, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే కలలు ఆధారపడి ఉన్న మానవ మూలధనాన్ని తయారు చేయడంలో కూడా వారే ప్రధానంగా బాధ్యత వహిస్తారు. స్పష్టంగా చెప్పాలంటే, 'గృహిణులు' వాస్తవానికి 'దేశ నిర్మాతలు' వారిని అలాగే గుర్తించాలి,' అని ధర్మాసనం పేర్కొంది. మోటారు ప్రమాద పరిహార క్లెయిమ్‌ల కేసులలో జాప్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, అటువంటి విషయాలను ఒక సంవత్సరంలోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. 2001 నవంబర్ 25న పంజాబ్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మరణించిన మహిళకు సంబంధించిన మోటారు ప్రమాద క్లెయిమ్‌పై దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. మృతురాలి భర్త, ముగ్గురు పిల్లలు నష్టపరిహారం కోరుతూ మోటారు ప్రమాద క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, అది వారికి రూ. 2.42 లక్షలు మంజూరు చేసింది. దీంతో అసంతృప్తి చెందిన క్లెయిమ్‌దారులు, నష్టపరిహారం మొత్తాన్ని పెంచాలని కోరుతూ పంజాబ్ మరియు హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నష్టపరిహారాన్ని 7.5 శాతం వడ్డీతో పాటు రూ. 8.43 లక్షలకు పెంచింది. అయినా సంతృప్తి చెందని క్లెయిమ్‌దారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## భారత నావికులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ ట్యాంకర్‌ను సెంట్రల్ కమాండ్ స్తంభింపజేసిందని పేర్కొంది. కేంద్ర ఓడరేవులు,నౌకా,జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ బుధవారం ఒక ప్రకటన చేస్తూ, మరణించిన నావికుల మృతదేహాలను భారత్‌కు తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని, మరణించిన నావికుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు.
అమెరికా–ఇరాన్ మధ్య బుధవారం తెల్లవారక ముందుగానే కొనసాగిన పరస్పర భీకర దాడుల సందర్భంగా సెట్టిబెల్లో వాణిజ్యనౌకపై అమెరికా దాడులు జరిగాయి. ఈ ట్యాంకర్‌లో మొత్తం 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా వారిలో ముగ్గురు దాడుల కారణంగా జాడ తెలియకుండాపోయిన ముగ్గురికోసం తీవ్రంగా గాలించి ఇద్దరు నావికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నావికుడి మృతదేహం కోసం గాలింపు కొనసాగుతోంది. మస్కట్‌లో ఉన్న భారత దౌత్యకార్యాలయం అధికారులు ఒమన్ అధికారుల సమన్వయం చర్యలతో ముమ్మర గాలింపు కొనసాగిస్తున్నారు.మస్కట్‌లో ఉన్న భారత దౌత్య కార్యాలయం ఈ పరిణామాలను, పరిస్థితులను చాలా జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉందని, ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనావేస్తున్నామని విదేశీమంత్రిత్వశాఖ పేర్కొంది.
ఒమన్‌లోని సోహార్ ఓడరేవుకు ఈశాన్యంగా సుమారు 10 నాటికల్ మైళ్ళ దూరంలో ఈ వాణిజ్య ట్యాంకర్ ప్రయాణిస్తున్న సమయంలో దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఏజన్సీ (యుకెఎంటిఎ) తొలుత తెలియజేసింది. బ్రిటిష్ సముద్రయాన నిర్వహణా సంస్థ ''వాన్‌గార్డ్'' ఈ నౌకను సెట్టిబెల్లో వాణిజ్యనౌకగా గుర్తించి వివరాలు సేకరించి ఒమన్ నావికా దళానికి తెలియజేసింది. సెట్టిబెల్లో నౌకలో ఉన్న భారతీయ సిబ్బంది తాము ప్రమాదంలో ఉన్నట్లు ఫోన్ చేయగానే వెంటనే స్పందించి ఒమన్ సహాయ దళం కార్యాచరణకు దిగింది. ఈ లోపే భారత దౌత్యకార్యాలయం కూడా అప్రమత్తమైంది. నౌక కదలికలను పర్యవేక్షించే మెరైన్ ట్రాఫిక్ సమాచారం ఆధారంగా ఆ నౌక పూర్తిగా సరుకులతో నిండి ఉందని, జూన్ ఒకటో తేదీన ఇమానీ తీరం వద్ద దాని ఉనికిని అధికారికంగా నమోదు చేశారని సమాచారం కనుగొన్నారు.

**అసలు ఏం జరిగిందంటే.....**

ఓసియానా ఖండంలోని మైక్రోనేసియా సబ్‌రీజియన్‌లో ఉన్న ద్వీపదేశం ''పలావు'' జెండాతో వెళుతున్న వాణిజ్య ట్యాంకర్‌లో 24 మంది భారతీయులు ఉన్నారు. తెల్లవారుజామున అమెరికా దాడుల సందర్భంగా ఈ నౌకపై కూడా దాడులు జరిగినప్పుడు నౌకలోని ఇంజన్ రూములో మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే సంబంధిత వర్గాలకు సమాచారం అందింది. ఈ సమయంలోనే ముగ్గురు భారతీయులు గల్లంతు అయ్యారు. అదేవిధంగా గతవారంలో కూడా మార్వెల్ అనే నౌకలో 24 మంది సిబ్బంది ఉన్న మార్వెల్ అనే నౌక కూడా ఒమన్ తీరంలో దాడికి గురైందన్న విషయాన్ని గుర్తించి ఫార్వర్డ్ సీమెన్స్ ఇండియా సహాయాన్ని కోరింది. ఏప్రిల్ 13వ తేదీ నుండి హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా సెంట్‌కామ్ దళాలు నిఘా గస్తీ ప్రారంభించాయి. ఆనాటి నుండి దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో హోర్ముజ్ చుట్టూ ఉన్న కీలక మార్గాలలో నౌకల కదలికలన్నీ ఆగిపోయాయి. ఏడు నౌకలను ఇప్పటివరకూ కదలకుండా చేశామని, 134 నౌకలకు అనుమతి నిరాకరించామని, మరో 42 నౌకలను మానవతాసహాయం తీసుకువెళుతున్నట్టుగా గుర్తించి హోర్ముజ్ దాటి వెళ్ళేందుకు అనుమతించామని జూన్ ఎనిమిదో తేదీన సెంట్‌కామ్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత కాలమానం ప్రకారం బుధవారం పొద్దుపోయాక ఒక ప్రకటన చేస్తూ, అపాచీ హెలికాప్టర్‌పై దాడి చేసినందుకు ఇరాన్ పై ప్రతీకార చర్యలు ఇంకా కొనసాగిస్తామని, ఈరోజే మరిన్ని దాడులు చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి జరిపిన దాడులు కేవలం మొదటిభాగం మాత్రమేనని అన్నారు. గురువారం (భారత కాలమానంప్రకారం) తెల్లారేలోపు మళ్ళీ దాడులు చేస్తామని ప్రకటించారు.
అమెరికాకు అనుకూలంగా ఒక ఒప్పందం చేసుకోవడంలో ఇరాన్ తీవ్ర జాప్యం చేస్తున్నందువల్ల ఆ దేశం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ట్రంప్ నెతన్యాహూ మధ్య సమన్వయంతోనే దాడులు జరుగుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా తమకు సమాచారం లభించిందని ఆ దేశ పత్రిక పేర్కొంది. ట్రంప్, నెతన్యాహూ రోజు విడిచి రోజు మాట్లాడుకుంటున్నారని, వారిమధ్య అపారమైన సమన్వయం ఉందని పిఎంఓలోని ఆ మూలం తెలియజేసింది.

## అమలు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు, టిఆర్‌ఎస్‌యు, ఎఐయుటియుసి తదితర యూనియన్ల ఆధ్వర్యంలో గురువారం లేబర్ కమిషన్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు మాట్లాడుతూ అఖిల భారత, రాష్ట్ర స్థాయిలో 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సమ్మెలు, ఆందోళనలు నిర్వహించిప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండ లేబర్ కోడ్స్ అమలుకు ఏకపక్షంగా రూల్స్ జారీ చేసిందని విమర్శించారు. లేబర్ కోడ్స్ రూల్స్ గెజిట్ పబ్లిష్ చేసిన నాడు కూడా తాము తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా రాష్ట్రంలోని కార్మిక సంఘాల తరఫున నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయొద్దని కోరామన్నారు. అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ రూల్స్ రూపొందించేందుకు పూనుకోవడాన్ని కార్మిక సంఘాల తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తుమని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మా కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి లేబర్ కోడ్స్ అమలు చేయొద్దని, దానికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రూల్స్ ఉపసంహరించుకోవాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన లెబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తి లేదనిఇందిరా పార్క్ వద్ద జరిగిన బహిరంగలో ప్రకటించిన తెలంగాణ పిసిసి అధ్యక్షుడి మహేష్ కుమార్ గౌడ్ ఇప్పుడు ఏలా అమలుకు అనుమతిస్తారని ప్రశ్నించారు.బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి కార్మికులపై ఒత్తిడి తెచ్చే విధంగా లేబర్ కోడ్స్‌ను ముందుకు తీసుకెళ్తున్నాయని విమర్శించారు. టిఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకురాలు మారెపల్లి వసంత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులకు విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఉన్న కార్మిక సంఘాలన్నీ భవిష్యత్తులో ఐక్యంగా ఉద్యమం చేస్తాయని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, చెట్టుక్రింది శ్రీనివాస్, భూపాల్, జె.వెంకటేష్, వంగూరి రాములు, రమా, ఐఎన్‌టియుసి రాష్ట్ర చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, టియుసిఐ సూర్యం, పద్మ, ఐఎఫ్‌టియు శ్రీనివాస్, అనురాధ, బిఆర్‌టియు రాంబాబు, ఎఐయుటియుసి భరత్ తదితరులు పాల్గొని లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన తెలియజేశారు.

## సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఎఐ కి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ప్రధానికి సిఎం వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాప్‌లు, హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.'హైదరాబాద్ – అమరావతి – బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ వే'కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్‌పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్ వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్రతీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలనే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని సిఎం ప్రధానితో ప్రస్తావించారు.

# 'ఫిఫా' వరల్డ్ కప్ నేటి నుంచే..

## 48 జట్లు.. 104 మ్యాచ్‌లతో చరిత్రలోనే అతిపెద్ద కప్!

## అమెరికా, మెక్సికో, కెనడాలో 39 రోజుల పాటు సాకర్ జాతర



ఖండాలు వేరైనా.. భాషలు భిన్నమైనా క్రీడా జగత్తును ఏకం చేసే మంత్రం! దేశాల మధ్య దూరాలను దగ్గర చేస్తూ, కోట్లాది హృదయాలను ఒకే భావోద్వేగంతో ముడిపెట్టే మహోత్సవం!! ప్రపంచ క్రీడా రంగంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక మహా సంగ్రామం ఫిఫా వరల్ కప్ మళ్లీ వచ్చేసింద్ధి.. నాలుగేండ్లకోసారి సాకర్ ఆటలోని అసలైన కిక్కు అందించే ఈమెగా టోర్నీ మరికొన్ని గంటల్లో మొదలవనుంది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్త ఆతిథ్యంలో రికార్డు స్థాయిలో 48 జట్లు, 104 మ్యాచ్లు ఫుట్బాల్ అభిమానులను ఉర్రూతలూగించనున్నాయి.

ఈ సంగ్రామం కేవలం ట్రోఫీ కోసం జరిగే పోరాటం కాదు.. దేశ గౌరవం కోసం సాగే సమరం. ఇది దశాబ్దాల కలలను నిజం చేసుకునే వేదిక. స్టార్లను దిగ్గజాలుగా మార్చి.. కొత్త హీరోలను ప్రపంచానికి పరిచయం చేసే రంగస్థలం. ఆశలు, నిరాశలు, అద్భుతాలు, సంచలనాలతో నిండిన ఫుట్బాల్ మహాకుంభమేళా. ఇక బంతి కదలబోతోంది. కోట్లాది హృదయాలు దాని వెంట పరుగెత్తబోతున్నాయి. ఈ మెగా సమరం ముగిసే దాకా క్రీడా ప్రపంచమంతా ఆ బంతి చుట్టూనే తిరగనుంది. అభిమానలోకం ఊపిరి బిగబట్టి చూసే సాకర్ మహాసంగ్రామానికి కౌంట్‌డౌన్ ముగిసింది. నాలుగేండ్లకోసారి వచ్చి యావత్ క్రీడా ప్రపంచాన్ని మురిపించే ఫిఫా ప్రపంచకప్ గురువారం మొదలవుతోంది. ఈ మెగా టోర్నీకి తొలిసారి మూడు దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. అమెరికా, మెక్సికో, కెనడాలోని 16 నగరాల్లో, 39 రోజుల పాటు సాగే ఈ మెగా వార్ అభిమానులను కనువిందు చేయనుంది. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఆతిథ్య మెక్సికో, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే తొలి పోరుతో ఈ సాకర్ జాతరకు తెరలేవనుంది. ప్రఖ్యాత మెక్సికో సిటీ స్టేడియం ఈ పోరుకు వేదిక కానుంది. ఈ మ్యాచ్‌కు ముందు 90నిమిషాల పాటు అదిరిపోయే ప్రారంభ వేడుకలు నిర్వహిస్తారు. పాప్ స్టార్ షకీర తదితరులు తమ ప్రదర్శనలతో అలరిస్తారు. జూలై 19న న్యూజెర్సీలోని మెట్లైఫ్ స్టేడియంలో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది.

**సరికొత్త ఫార్మాట్.. రికార్డు మ్యాచ్‌లు...**ఈ టోర్నీ గతంలో కంటే చాలా భిన్నంగా, భారీగా సాగనుంది. తొలిసారిగా జట్ల సంఖ్యను 32 నుంచి 48 జట్లకు పెంచారు. ఈ 48 జట్లను మొత్తం 12 గ్రూపులుగా (ఒక్కో గ్రూపులో నాలుగు జట్లు) విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్2లో నిలిచిన జట్లతో పాటు, మూడో స్థానంలో నిలిచిన అత్యుత్తమ 8 జట్లు కొత్తగా ప్రవేశపెట్టిన రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఈ కొత్త ఫార్మాట్ వల్ల, టైటిల్ గెలవాలనుకునే జట్టు గతంలో కంటే ఒక మ్యాచ్ అదనంగా.. అంటే మొత్తం 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. దీనివల్ల ఆటగాళ్ల ఫిట్నెస్, బెంచ్ బలం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.

**దిగ్గజాల కల.. కుర్రాళ్ల కసి...** ఈ విశ్వసమరంలో ఫుట్‌బాల్ అభిమానులను ఉర్రూతలూగించేందుకు మెగా స్టార్లు బరిలో నిలిచారు. వారిలో ముందున్న వ్యక్తి అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సీ. 2022లో ఆ జట్టును విజేతగా నిలపడంతో పాటు ప్రపంచకప్ కలను సాకరం చేసుకున్న మెస్సీ మరో కప్‌ను ముద్దాడి తన అద్భుతమైన కెరీర్‌కు వీడ్కోలు పలకాలని పట్టుదలతో ఉన్నాడు. మెస్సీ మాదిరిగా పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు కూడా ఇదే చివరి ప్రపంచకప్ కావచ్చు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఇంకా అందుకోని ఈ కప్ ట్రోఫీని ఈసారైనా సాధిస్తాడో లేదో చూడాలి. గత ఎడిషన్‌లో ఫైనల్ వరకు ఫ్రాన్స్‌ను ఒంటిచేత్తో నడిపించిన కిలియన్ ఎంబపే ఈసారి కూడా తన మెరుపు గోల్స్‌తో ప్రత్యర్థులకు చుక్కలు చూపేందుకు సిద్ధమయ్యాడు. ఫ్రాన్స్, ఇంగ్లండ్ జట్లు అమెరికా గడ్డపై యూరప్ జెండా ఎగరేయాలని చూస్తున్నాయి. ఇక బ్రెజిల్ స్టార్ నెమార్ సంప్రదాయ సాంబా ఆటతో మ్యాజిక్ చేసి తమ దేశానికి గత 24 ఏండ్లుగా దక్కని కప్పు కలను నిజం చేయాలని చూస్తున్నాడు. లామిన్ యామల్(స్పెయిన్), గిల్బర్టో మొరా (మెక్సికో) వంటి యువ ఆటగాళ్లు తమ ప్రతిభతో సంచలనాలు సృష్టించడానికి సిద్ధంగా ఉండగా, గత టోర్నీ డార్క్ హార్స్ మొరాకో స్ఫూర్తితో కొన్ని చిన్న జట్లు మేటి జట్లకుషాక్ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి.

## ఇండియా-ఏకు షాకిచ్చిన ఆఫ్ఘానిస్థాన్


ఇండియా–ఏ జట్టుకు ఆఫ్ఘానిస్థాన్–ఏ జట్టు షాక్ ఇచ్చింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో డక్వర్త్ లూయిస్ పద్ధతిలో నాలుగు రన్స్ తేడాతో ఆఫ్ఘానిస్థాన్ విజయం సాధించింది. పలుమార్లు వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 49 ఓవర్లలో 349 రన్స్ చేసింది. కానీ ఆఫ్ఘాన్‌కు 38 ఓవర్లలో 294 రన్స్‌ను టార్గెట్‌గా ఇచ్చారు. అయితే ఆఫ్ఘాన్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వర్షం అంతరాయం వల్ల మ్యాచ్ నిలిచిపోయే సమయానికి ఆఫ్ఘానిస్థాన్ 25.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 రన్స్ చేసింది. అయితే డక్వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆఫ్ఘన్ జట్టు నాలుగు పరుగులు ఆధిక్యంలో ఉన్నది. దీంతో అనూహ్యంగా ఇండియా–ఏ జట్టుకు షాక్ తగిలింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇమ్రాన్ 75, బహిర్ షా 51 రన్స్ చేసి క్రీజ్లో ఉన్నారు. భారత జట్టులో ప్రభ్ సిమ్రన్ సింగ్ 84, తిలక్ వర్మ 66, రుతురాజ్ గైక్వాడ్ 66, వైభవ్ సూర్యవంశీ 44 రన్స్ చేశారు. అయితే ఆఫ్ఘన్ ఇన్నింగ్స్లో ఇమ్రాన్, బహిర్ మధ్య మూడో వికెట్లకు అజయేంగా 108 రన్స్ భాగస్వామ్యం ఏర్పడింది. ఇది ఆ జట్టుకు కలిసి వచ్చింది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### తీరమైదానం ఎక్కడ నుండి ప్రారంభమైనది?

- రామ్‌గంగా ప్రాజెక్టు ఎచ్చట గలదు
  ఉత్తర్ ప్రదేశ్
- అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన న్యూహారైజాన్స్ వ్యోమనౌక ఇటీవల ప్లూటో పరిమాణాన్ని (వ్యాసం) ఎంతగా నిర్ధారించింది?
  270 కి.మీ.
- ఆరో పంచవర్ష ప్రణాళిక ముసాయిదాలో భారత ప్రభుత్వం చేర్చిన విశిష్ట భావన?
  నిరంతర ప్రణాళిక
- కేంద్ర పర్యటక శాఖ ఇటీవల వెల్లడించిన గణాంకాల ప్రకారం 2014 లో దేశీయ పర్యటకులు అత్యధికంగా సందర్శించిన రాష్ట్రం ఏది?
  తమిళనాడు
- కిందివారిలో స్వతంత్ర కర్ణాటక రాజ్య స్థాపకుడు ఎవరు?
  సాదతుల్లా ఖాన్
- కాల్వల ద్వారా ఎక్కువ సాగు అగు రాష్ట్రం
  ఉత్తర్ ప్రదేశ్
- కాబుజాతీ వారు ఇచట నివసిస్తారు
  సుమత్రా
- ప్రపంచ ప్రధాన ప్రకృతి సిద్ధ మండలాల సంఖ్య
  13
- దుర్గాపూర్ ఉక్కు కర్మాగారం నెలకొల్పుటలో సహాయం అందించిన దేశం
  బ్రిటన్
- భాక్రానంగల్ ప్రాజెక్టు ఈ రాష్ట్రంలో ఉంది
  హిమాచల్ ప్రదేశ్
- పునరుజ్జీవనం ముందుగా ఏ దేశంలో ప్రారంభమైనది?
  ఇటలీ
- తీరమైదానం ఎక్కడ నుండి ప్రారంభమైనది?
  తూర్పు కనుమలు
- 'సుఖీభవ' పథకం దేనికి సంబంధించినది?
  ఆడ శిశువుల సంక్షేమం
- డాక్టర్లు వ్యక్తుల భారాన్ని కనుగొనేందుకు ఉపయోగించే త్రాసు.
  సంపీడనం స్ప్రింగ్ త్రాసు
- తీవ్రమైన కరువు భారతదేశంలో ఏ సంవత్సరంలో వచ్చింది?
  1957
- దక్షిణ మధ్య రైల్వే మండల కేంద్రం ఎక్కడ ఉంది?
  సికింద్రాబాద్
- బీహార్, నేపాల్ కు ప్రయోజనం కలిగిస్తున్న అంతర్జాతీయ ప్రాజెక్టు
  కోసి ప్రాజెక్టు
- 'వయోజన విద్యావ్యాప్తి' లక్ష్యంగా గల పథకం
  చదువుకుందాం
- కాంతిరేణువులను ఏమంటారు?
  ఫోటానులు
- ఇందులో ఏది మధ్యతరహా పరిశ్రమ?
  ప్లాస్టిక్ వస్తువుల తయారీ
- కర్ణాటక రాష్ట్ర రాజధాని :
  బెంగళూరు
- ఇందులో ఏది కేంద్రం విధించే పన్ను
  సంపద పన్ను
- గతిపాలక చక్రం ఇందులో ఉంటుంది?
  గడియారం
- మన చెవిలోపల ఉండు పలుచని పొర
  కర్ణభేరి
- కలకత్తా రేవు ఏ నది యొక్క ఎడమ ఒడ్డున ఉంది?
  హుగ్లీనది.
- మొక్కల ప్రాముఖ్యత కలిగిన వైద్య విధానము
  ఆయుర్వేదం
- 'దీపం' పథకం దేనికి సంబంధించినది?
  పేదలకు చౌకగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం
- ఉమ్మెత్త పువ్వులో కేసరాల సంఖ్య
  5
- ప్రపంచ కాఫీ ఉత్పత్తిలో ప్రథమ స్థానం వహించుచున్నది?
  బ్రెజిల్
- ఎయిర్ ఇండియాను ప్రారంభించినది.
  జె.ఆర్.డి.టాటా
- అనటోలియా పీఠభూమి ఏ దేశంలో ఉంది
  టర్కీ
- వంటగ్యాస్ ముఖ్య అనుఘటకము
  బ్యూటేను
- మొదటి దూరదర్శినిని తయారుచేసిన శాస్త్రవేత్త
  గెలీలియో
- గలన పద్ధతిలో ఈ దారాన్ని తయారుచేస్తారు
  డెక్రాన్
- వింబుల్డన్ 2015 పురుషుల సింగిల్స్ విజేత?
  నొవాక్ జకోవిచ్, సెర్బియా
- తెలంగాణ తొలి జానపద గాయకుడు, రచయిత నీలం గణేషారావు 2015 జులైలో ఎక్కడ మరణించారు?
  హైదరాబాద్
- పన్ను ఎగవేతను నిరోధించేందుకు, విదేశీ ఖాతాపన్ను వర్తింపు చట్టం (ఫాట్కా) అమలు చేసేందుకు 2015 జులైలో భారత్ ఏ దేశంతో ఒప్పందం కుదుర్చుకుంది?
  అమెరికా
- కజకిస్థాన్ రాజధాని నగరం ఏది?
  అస్థానా
- 'అష్గాలతో ఒప్పందం' ఏయే దేశాలకు సంబంధించింది?
  ఉజ్బెకిస్థాన్, ఇరాన్, తుర్క్ మెనిస్థాన్, ఒమన్
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించబడిన సంవత్సరం
  2005
- శాంతి భద్రతలకు చెందిన శాఖ:
  పోలీసు శాఖ
- శరీరంలో అధికంగా ఉండే కొవ్వు ఏ కణాలలో నిలవ చేయబడుతుంది
  అడిపోస్ కణజాలము
- 2015 జులైలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'సామాజిక ఆర్థిక కుల గణన 2011' ప్రకారం దేశంలో మొత్తం కుటుంబాల సంఖ్య?
  24.39 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వ శాఖ కింది వాటిలో ఏది?
  రెవిన్యూశాఖ



# హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

## గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్




**ప్రజాపక్షం/జనగామ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను విస్మరించాయని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంజయ్యనాయక్ ఆరోపించారు. గిరిజన సమాఖ్య జనగామ జిల్లా 3వ మహాసభలు గురువారం జనగామ పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో మాలోతు సీతారాం నాయక్, భూక్య సంతోష్‌ల అధ్యక్షతన జరిగాయి. మహాసభలకు అంజయ్య నాయక్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అటవీ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ఆదివాసి, గిరిజన ప్రకృతి సంపదపై దాడి చేస్తుందన్నారు. వాటిపై ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు పర్చాలని, పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలు రూ.216 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని అమలు చేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. గిరిజన హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని అంజయ్యనాయక్ పిలుపునిచ్చారు. సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ గిరిజనులు తమ హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసి, గిరిజనుల్ని మోసం చేస్తుందని, అటవీ సంపదను కొల్లగొటివారని తరిమేస్తుందన్నారు. అడవిని నమ్ముకున్న బిడ్డలు నేడు పట్టణాలకు వలస వెళ్లి కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. బిజెపి విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న మాట్లాడుతూ గిరిజన సమాఖ్య పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జువారి రమేష్ నివేదిక సమర్పించగా ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభలో తెజావత్ విజయ, భూక్యా మీనా, ధర్నానాయక్, భూక్యా దులి, నీల సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శిగా జువారి రమేష్ ఎన్నికయ్యారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

## ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి కార్మికుల సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే జూన్ 22 తర్వాత సమ్మె తప్పదని అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం కార్మికుల సమస్యలపై ఐదు సార్లు చర్చలు జరిగినప్పటికీ యాజమాన్యం ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. కార్మికుల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి నేపథ్యంలో జూన్ 7, 8 తేదీలలో కొత్తగూడెంలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో సమ్మెకు వెళ్లాలని ఏకగ్రీవంగా నిర్ణయించామని, ఈ మేరకు 31 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును యాజమాన్యానికి అందజేశామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డులను తక్షణమే నిర్వహించాలని కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసుల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన డిపెండెంట్లకు అలియాస్ పేర్లతో ఉద్యోగాలు కల్పించాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, పెర్క్స్‌పై ఆదాయపన్ను భారాన్ని యాజమాన్యమే భరించాలని కోరారు. కొత్త గనులను ప్రారంభించాలని, గనులకు కొత్త యంత్రాలు, విడిభాగాలు సమకూర్చాలని, లాభాల్లో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గడువు ముగిసేలోపు యాజమాన్యం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకుంటే ఇతర సంఘాలను కలుపుకొని సమ్మె కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సంఘం ఉపప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఎస్కే బాజీ సైదా, అఫ్రోజ్ ఖాన్, మూడ సుధాకర్, దాడి రాజయ్య, గునిగంటి నర్సింగరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

## ఎఐవైఎఫ్ నిరసనలు


కరీంనగర్...

**ప్రజాపక్షం/ వరంగల్ :** కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాల రద్దు చేసి, ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టుల భర్తీచేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, టీజీపీఎస్సీ ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుదీర్, నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

**మంచిర్యాల :** రాష్ట్రంలో విద్యా, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంచిర్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం ముందు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, కొత్తపల్లి మహేష్, ముత్తునూరు మహేష్, అచ్చ హరీష్, మిట్టపల్లి చందు, రోహిత్, మురారి, దేవి పోచన్న, పూజారి రామన్న పాల్గొన్నారు.

**కరీంనగర్:** రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత సరికాదని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ తీవ్రంగా విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గీతా భవన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి, అరవింద్, ఉదయ భాస్కర్, హేమంత్, శ్రీనివాస్ నాయక్, రాజకుమార్, రమేష్ చేరను వినోదు రాజకుమార్, భాస్కర్‌రెడ్డి, ఉపేందర్ అవినాష్ , తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్...

**నాగర్ కర్నూల్ :** రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీజ్జ శ్రీనివాసులు, దేశామోని ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లాలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ధర్నాలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు కొత్త రామస్వామి, బండి బాలపిరు రామకృష్ణ, రాజు , వాకేశ్వరం, శ్రీనివాసులు, నరేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బినగర్ :** రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం మాత్రం హామీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తుందని, ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేత సరికాదని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివకుమార్‌గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎల్‌బి,నగర్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం ముందు గురువారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కె.శివ, జెట్టి శ్రీనివాస్, సందీప్, త్రినయ్, కార్తీక్, అర్జున్, మహేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్...


రంగారెడ్డి(ఎల్.బి.నగర్)...


మంచిర్యాల...

## బిజెపివి దివాళాకోరు రాజకీయాలు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి దేశంలో దివాళా కోరు రాజకీయాలకు పాల్పడుతోందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) ఆరోపించారు. బిజెపి ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను అడ్డుకుందన్నారు. సాధారణ మహిళా నేత అయిన మీనాక్షి నటరాజన్‌ను రాజకీయంగా టార్గెట్ చేయడం దౌర్భాగ్యం అని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారని, రాజ్యసభ సీట్ల కోసం దిగజారుడు రాజకీయాలు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒక చిన్న కేసును సాకుగా చూపించి నామినేషన్ తిరస్కరించడం సరైందికాదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో కుట్రలు, కుతంత్రాలు తప్పితే ప్రజల పాలన ఎక్కడ? ఉద్యోగాల కల్పన, నల్లధనం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థను బిజెపి ప్రభావితం చేస్తోందని, రాష్ట్రాలను రాజకీయంగా కబ్జా చే సే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఊహాగానాలు, అనుమానాలపై రాజకీయం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులుంటే అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని జగ్గారెడ్డి ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆధునిక సదుపాయాల విస్తరణ..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగులు, శిక్షణార్థులు మరియు వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ)లో పలు అభివృద్ధి కార్యక్రమాలను డైరెక్టర్ అభిలాష్ బిష్త్, ఐపీఎస్ గురువారం ప్రారంభించారు. అకాడమీ ప్రధాన ద్వారం వద్ద నూతన ఆర్టీసీ బస్ స్టాప్, ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్మించిన ఆధునిక వేదికను ఆమె ప్రారంభించారు. ఉద్యోగులు, శిక్షణార్థులు ప్రజా రవాణాను సులభంగా వినియోగించుకునేలా ముషీరాబాద్ డిపో సహకారంతో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అలాగే అకాడమీలో నిర్వహించే పరేడ్లు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కోసం నూతన స్టేజ్ ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంప్2026 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి, పాల్గొన్న 142 మంది చిన్నారులకు సర్టిఫికెట్లు, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఉద్యోగుల పిల్లల కోసం నిర్వహిస్తున్న చిన్నారి క్రెచ్, తరంగజ్యోతి విద్యా కార్యక్రమాలు విశేషంగా కొనసాగుతున్నాయని వివరించారు. అకాడమీలో ఉద్యోగుల కోసం ఆధునిక క్యాంటీన్, స్టోర్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోనే ఆదర్శవంతమైన శిక్షణా సంస్థగా నిలుస్తోందని అభిలాష్ బిష్త్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డిపో మేనేజర్ రఘు, డిప్యూటీ డైరెక్టర్లు డి. మురళీధర్, వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'ఖమ్మం బాలిక'కు మెరుగైన వైద్యం అందించండి: మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం నగరంలో లైంగికదాడి గురై తీవ్రగాయాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ రాహుల్‌తో తుమ్మల మాట్లాడి బాలికకు అందుతున్న వైద్య చికిత్స, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, ఎటువంటి పరిస్థితి ఎదురైనా,తనకు ముందుగా తెలియజేయాలని నిమ్స్ డైరెక్టర్‌కు మంత్రి తుమ్మల సూచించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులతో కూడా తుమ్మల మాట్లాడి ధైర్యం చెప్పారు. తాను పూర్తి అండగా ఉంటానని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తానని వారికి భరోసనిచ్చారు. బాలికతో పాటు బాలిక తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు.

### నిలకడగా బాలిక ఆరోగ్యం : నిమ్స్ డైరెక్టర్

ఖమ్మం బాలికను 'ఆరోగ్యశ్రీ' అడ్మిట్ చేసి, ఉచితంగా చికిత్సను అందిస్తున్నామని నిమ్స్ డైరక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఆ బాలిక సీరియస్ కండిషన్‌లో నిమ్స్ ఆస్పత్రికి వచ్చిందని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అవసరమైన రక్త పరీక్షలను నిర్వహించి, అన్నీ ఆరోగ్యశ్రీ పరిధిలోనే ఉచితంగా నిర్వహించామని, నిపుణులైన డాక్టర్ల బృందం ఆమెకు చికిత్స అందిస్తోందని వివరించారు. ఆ పాప తల్లిదండ్రులకు రూమ్ సౌకర్యాన్ని కల్పించామని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలనూ కల్పిస్తున్నామని, ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా చిక్సితను ఉచితంగా అందిస్తున్నామన్నారు.


### బాలికకు మెరుగైన వైద్యం అందించాలి : సిపిఐ(ఎం)

ఖమ్మం జిల్లా కల్లంపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటనను సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. బాధిత బాలికకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని,బాలికపై అత్యాచారం, ఆ తర్వాత హత్య యత్నానికి పాల్పడిన నిందితుడు మహమ్మద్ పాషాను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.ప్రస్తుతం బాలిక హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం తక్షణమే బాధితురాలికి అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుడిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏ ర్పాటు చేసి త్వరితగతిన కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇలాం టి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# విటుడిపై ట్రాఫికింగ్ కేసు చెల్లదు

వ్యభిచారం నేరం కాదు : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యభిచార గృహాలపై పోలీసులు నిర్వహించే దాడుల్లో పట్టుబడే ఖాతాదారులపై మానవ అక్రమ రవాణా కేసులు నమోదు చేసే విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక స్పష్టతనిచ్చింది. సెక్స్ వర్కర్ సేవలను పొందిన వ్యక్తిని కేవలం ఆ కారణంతోనే మానవ అక్రమ రవాణాదారుడిగా పరిగణించలేమని ధర్మాసనం తేల్చి చెప్పింది. స్వచ్ఛందం గా జరిగే వ్యభిచారం చట్టవిరుద్ధం కాదని పేర్కొంటూనే, అక్ర మ రవాణాకు గురైన వ్యక్తిని లైంగిక దోపిడీకి వినియోగించిన ట్లు తేలితే మాత్రం సంబంధిత కఠిన నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. జస్టిస్ కె.లక్ష్మ ణ్, జస్టిస్ బి.ఆర్. మధుసూదన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. వ్యభిచార గృహాలపై దాడుల సమయంలో పట్టుబడ తమపై నమోదైన కేసులను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన 125కు పైగా పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం ఈ తీ ర్పు ఇచ్చింది. వ్యభిచార గృహాల్లో పట్టుబడిన ఖాతాదారులపై ఐపిసి సెక్షన్ 370, 370ఏ(2) (ప్రస్తుతం బిఎన్ఎస్ సెక్షన్లు 143, 144) కింద కేసులు నమోదు చేయవచ్చా లేదా అన్న అంశంపై సింగిల్ జడ్జీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఈ వ్యవహారం డివిజన్ బెంచ్ ముందుకు వచ్చింది. విచారణ సందర్భంగా ధర్మాసనం ట్రాఫికింగ్ నేరానికి సంబంధించిన చట్టపరమైన ఉద్దేశ్యాన్ని విశ్లేషించింది. మానవ అక్రమ రవాణా నిబంధనలు వ్యక్తుల నియామకం, రవాణా, తరలింపు, ఆశ్రయం కల్పించడం, బలవంతం చేయడం లేదా దోపిడీ కోసం వినియోగించడం వంటి చర్యలకు పాల్పడే వారిని శిక్షించేందుకు రూపొందించబడ్డాయని పేర్కొంది. సెక్స్ వర్కర్ సేవలను తన వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించుకున్న వ్యక్తిని మాత్రమే ఆధారంగా తీసుకుని ట్రాఫికర్‌గా పేర్కొనడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. ఈ అంశం జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సిఫారసుల్లోనూ స్పష్టంగా ప్రస్తావించబడిందని ధర్మాసనం గుర్తుచేసింది. ఇష్టపూర్వకంగా వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్న మహిళల విషయంలో లాభం లేదా ఖాతాదారులను దర్యాప్తు సంస్థలు వేధించరాదని హైకోర్టు పేర్కొంది. ఒక మహిళ స్వచ్ఛందంగా ఈ వృత్తిలోకి వచ్చిందా, లేక బలవంతం, మోసం, ప్రలోభం లేదా అక్రమ రవాణా కారణంగా ఈ పరిస్థితిలోకి నెట్టబడిందా అన్నది ప్రతి కేసులోని వాస్తవ పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. కేవలం వేశ్యాగృహం వద్ద లేదా దాని పరిసర ప్రాంతాల్లో కనిపించారన్న కారణంతో కేసులు నమోదు చేయడం సమంజసం కాదని స్పష్టం చేసింది. అయితే, ట్రాఫికింగ్‌కు గురైన మహిళ లేదా వ్యక్తి సేవలను లైంగిక దోపిడీ కోసం వినియోగించినట్లు ఆధారాలు ఉంటే, అలాగే ఆ విషయం ఖాతాదారుడికి తెలిసి ఉండి లేదా తెలిసే పరిస్థితులు ఉన్నట్లు తేలితే సెక్షన్ 370ఏ(2) కింద కేసు నమో దు చేయవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. అక్రమ రవాణా బాధితురాలిని సంప్రదించేందుకు మధ్యవర్తులు, బ్రోకర్లు లేదా నిర్వాహకుల సహకారం తీసుకున్నట్లు ఆధారాలు లభించినా అవి విచారణలో ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొం ది. ముందస్తు ఒప్పందాలు, మధ్యవర్తిత్వం, నిర్వాహకులతో సంబంధాలు వంటి అంశాలు ట్రాఫికింగ్ కోణాన్ని నిర్ధారించడంలో కీలకమవుతాయని వివరించింది. కేవలం అనుమానం లేదా ఊహాగానాల ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం చట్టబద్ధం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రతి కేసులోని ప్రత్యేక పరిస్థితులు, సాక్ష్యాధారాలు, దర్యాప్తులో బయటపడిన వాస్తవాలను పరిశీలించిన తర్వాతే నేరం నిర్ధారించాలని సూచించింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్ నిర్వహించే మహిళలను, వారి సేవలను పొందిన ఖాతాదారులను వేధించడం చ ట్టం ఉద్దేశం కాదని, ట్రాఫికింగ్, బలవంతపు లైంగిక దోపిడీని అరికట్టడమే సంబంధిత నిబంధనల ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పులు, జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సిఫారసులను ధర్మాసనం తన తీర్పులో ప్రస్తావించింది.



# ప్రతిష్ఠాత్మక పనుల 'పురోగతి'పై ప్రత్యేక నజర్..

- జిల్లాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం... ● వారానికి ఒకసారి పనుల పర్యవేక్షణ..
- పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు శాఖ పరంగా అమలు చేస్తున్న ప్రతి ష్టాత్మకమైన కార్యక్రమాలు, ఆ పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. కమిషనర్ కార్యాలయంలోని సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ,రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేసే వారికి బాధ్యతలను అప్పగించారు. ప్రత్యేక అధికారులు వారానికి ఒక సారి వారికి కేటాయించిన జిల్లాలను పర్యటించాల్సి ఉంటుంది. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యా దేవరాజన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖలో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, జీవనోపాధి కార్యక్రమాలు, సామాజిక తనిఖీలు తదితర కీలక కార్యక్రమాల అమలును ప్రత్యేక అధికారులు నేరుగా పర్యవేక్షించనున్నారు. ప్రతి ప్రత్యేక అధికారి వారానికి కనీసం ఒకరోజు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలి. జిల్లా పర్యటన సందర్భంగా కనీసం రెండు గ్రామ పంచాయతీలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో కింది స్థాయి సిబ్బందికి తగు సూచనలు చేస్తారు. గ్రామ పంచాయతీలలో కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, మల్టీపర్పస్ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది జీతాల చెల్లింపులు, గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, వీధి కుక్కల నియంత్రణ చర్యలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలను ప్రత్యేకంగా సమీక్షించనున్నారు.

### 'పనుల'పర్యవేక్షణ...

స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఘన వ్యర్థాల నిర్వహణ, మంజూరైన పనుల పూర్తి, ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులు, నమూనా గ్రామాల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు, జీవనోపాధి కార్యక్రమాలు, దిశా సమావేశాలు, సామాజిక తనిఖీల పురోగతి వంటి అంశాలను కూడా పర్యవేక్షించనున్నారు. మంత్రి సీతక్క గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చూడడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత, పనుల్లో నాణ్యత, అధికారుల జవాబుదారీతనం పెంచడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని అధికార యంత్రాంగం తెలిపింది. కాగా ప్రతి వారం పర్యటనల నివేదికలను సమీక్షించి, అందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు శాఖ అధికారులు వెల్లడించారు.

# అణగారిన వర్గాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ప్ర పంచ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య ద్వారా సామాజిక సాధికారత సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్) మూడో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. 2017 తర్వాత మూడోసారి నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ గురుకుల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో ప్రధానంగా డిగ్రీ కళాశాలలకు యూజిసి వేతన స్కేలు అమలు చేయడం, కళాశాలల నిర్వహణ కోసం ప్రత్యేక పరిపాలనా విభాగం ఏర్పాటు, డిగ్రీ కళాశాలలకు న్యాక్ గుర్తింపు సాధించేందుకు ప్రత్యేక కమిటీ , 9వ తరగతి నుంచే నీట్, జెఈఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు మరో 9 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, విదేశీ విద్యకు వెళ్లే ఎస్‌సి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం, ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వంటి కొత్త కోర్సుల ప్రవేశం, 133 గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాల నిర్మాణం, విద్యార్థులకు ఫోన్ మిత్ర సౌకర్యం ద్వారా తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం, పోషకాహారం మెరుగుపరచేందుకు ఉమ్మడి మెనూ విధానం అమలు, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల వేతనాల పెంపు నిర్ణయాలను తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తా

జలమండలి గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజరెడ్డికి ఏఐటియుసి సన్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జలమండలి కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, హెల్త్ స్కీమ్‌లో కార్మికుల నుంచి ఎలాంటి వాటా వసూలు చేయకుండా, సంస్థే పూర్తి భారం భరించే విధంగా ఉన్నతాధికారులతో చర్చించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటానని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజరెడ్డి చెప్పారు. భవిష్యత్తులో జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి నాయకత్వం ఇచ్చే సూచనలు, సలహాలను పాటిస్తూ ముందుకు సాగుతానని చెప్పారు. ఏఐటియుసి సంపూర్ణ మద్దతుతో జలమండలి ఎన్నికల్లో విజయం సాధించిన ఐఎన్‌టియుసి అభ్యర్థి మొగుళ్ల రాజరెడ్డిని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) గురువారం ఘనంగా సన్మానించింది. హిమాయత్‌నగర్‌లోని ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.నరసింహా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ జలమండలి, సివరేజ్ బోర్డుల్లో పనిచేస్తున్న కార్మికులు 4 దశాబ్దాలుగా ఏఐటియుసిపై విశ్వాసం ఉంచుతున్నారని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కార్మికులు సరైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. కార్మికులకు ఎన్నికల్లో విజయం సాధించిన యూనియన్ పూర్తి న్యాయం చేయడంతో పాటు వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.అధ్యక్షులుగా ఎన్నికైన మొగుళ్ల రాజరెడ్డి మాట్లాడుతూ తన విజయానికి ఏఐటియుసి నాయకత్వం అందించిన బేషరతు మద్దతే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి జి.బి.సర్వేశ్వరరావు, కోశాధికారి ఆనంద్ కుమార్, ఐఎన్‌టియుసి జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రావుతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖలో ముగిసిన బదిలీల పక్రియ

157 కేడర్లలో 4869 మంది బదిలీలు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ఆరోగ్యశాఖలో భారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ బదిలీల్లో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 2,258 మంది ఉద్యోగులు బదిలవ్వగా, వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్స్‌లో అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ హాస్పిటల్స్‌లో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) తనిఖీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ఎన్ఎంసి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి మెడికల్ కాలేజీలో అవసరమైన సంఖ్యలో అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా బదిలీలను నిర్వహించింది. ఒకే హాస్పిటల్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేస్తే రోగులకు అందే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని గుర్తించిన ప్రభుత్వం, వైద్య సేవలకు ఆటంకం లేకుండా బదిలీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ఒకే స్టేషన్‌లో నాలుగు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులను మాత్రమే బదిలీ చేసింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పిస్తే, ఆ జిల్లాల్లోని ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నదని భావించిన ప్రభుత్వం, ఈ విషయంలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

### జిల్లా స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు..

జిల్లాల స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఆసుపత్రులను, ఏరియా ఆసుపత్రులను,కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, జిల్లా కేంద్రాల్లోని టీచింగ్ హాస్పిటళ్లను ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవల్లో దాదాపు 90 శాతం సేవలను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను పెంచుతోంది. దీనికి అనుగుణంగానే ఇటీవల నియామితులైన డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందికి కూడా గ్రామీణ,జిల్లా స్థాయి వైద్య సంస్థల్లోనే పోస్టింగ్‌లను కల్పించింది.

## ఎపి లిక్కర్ కేసులో రాజ్‌కసిరెడ్డి, వాసుదేవరెడ్డిల అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన లిక్కర్ కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్‌కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు హైదరాబాద్‌లో గురువారం అరెస్టు చేశారు. అనంతరం వారిని ఇడి కార్యాలయంలో మూడు గంటల పాటు అధికారులు విచారించారు. వారి నివాసాలపై కూడా ఇడి అధికారులు దాడులు నిర్వహించి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితులను నాంపల్లి కోర్టులో విచారణ నిమిత్తం కోర్టులో హాజరుపరిచిన అనంతరం న్యాయమూర్తి ఇద్దరినీ న్యాయపరమైన 14 రోజుల కస్టడీకి పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు.దీంతో నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన ఆధారాలు, నిందితుల పాత్రపై దర్యాప్తు సంస్థలు కోర్టుకు వివరాలు సమర్పించాయి. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు సమాచారం. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకోవడంతో రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. నిందితులపై నమోదైన ఆరోపణలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సంబంధిత అంశాలపై దర్యాప్తు అధికారులు మరింత లోతుగా విచారణ చేపడుతున్నారు. రాబోయే రోజుల్లో మరికొందరిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో పూర్తి నిజానిజాలు వెలికితీసేందుకు అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## పిఓకెలో వేలాదిమంది నిరాయుధ ప్రదర్శకులపై మళ్ళీ పాకిస్థాన్ కాల్పులు :16 మంది మృతి

**రావల్‌కోట్:** పి.ఓ.కె (పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్)లోని ఈద్గా మైదానంలో నిరసన ప్రకటిస్తున్న వేలాదిమంది ప్రదర్శకులపై పాకిస్థాన్ సైన్యం ఎ.కె–47 రైఫిళ్ళతో మరోసారి కాల్పులు జరపడంతో 16 మంది మరణించారు. మరో 37 మంది గాయపడ్డారు. సరసమైన ధరలకు పిండి బియ్యం, విద్యుత్‌తో పాటు ప్రాథమిక హక్కులకు కూడా ఇవ్వాలని కోరుతూ సుమారు 70,000 మంది శాంతియుతంగా నిరసన ప్రారంభించిన ప్రదర్శకులపై సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఈ నిరసన హింసాత్మకంగా మారింది. పాకిస్థాన్ కొనసాగిస్తున్న ఆక్రమణ, ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరిస్తూ, వేలాది మంది గురువారం ఈద్గా మైదానంలో గుమిగూడి ఎలాంటి ఆయుధాలు లేకుండా శాంతియుత పద్ధతులలో నిరసన చేస్తుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇదేనగనంలో గడచిన మంగళవారం కూడా వేలాదిమంది ప్రదర్శన చేస్తుండగా హింస చెలరేగింది. ప్రదర్శకులు,భద్రతా దళాల మధ్య జరిగిన ఘర్షణల్లో 30 మంది మరణించారు. 200 మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన 48 గంటల్లోనే పాకిస్థాన్ మరోసారి శాంతియుత ప్రదర్శకులపై కాల్పులకు తెగబడింది. పోలీసు యూనిఫారాలు ధరించినవారే ఉగ్రవాదానికి పాల్పడుతున్నారని ప్రదర్శకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ నిరసన హింసాత్మకంగా మారడంతో అక్కడి రోడ్లన్నీ రక్తంతో తడిసిపోయాయి.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ వెనుక సిఎం సన్నిహితుడు

హరీశ్ రావు ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక సిఎం రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడి వెన్నుపోటు కుట్ర దాగి ఉన్నదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో సిఎం రేవంత్ రెడ్డి ఏకంగా రూ.100 కోట్లతో 'బోధి పెవిలియన్' పేరుతో విలాసవంతమైన గెస్ట్ హౌస్ ను నిర్మించుకుంటున్నారన్నారు. ఈ గెస్ట్ హౌస్ కోసం మొదట వివిఐపి గెస్ట్ హౌస్ పేరుతో కేవలం రూ.7 కోట్లతో జిఒను జారీ చేసి, ఇప్పుడు దానిని రూ.100 కోట్లకు పెంచారని ఆరోపించా రు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జర్నలిస్టులతో హరీశ్ రావు గురువారం ఇష్టాగోష్టిగా మాట్లాడా రు. సిఎం తన గెస్ట్ హౌ స్ చుట్టూ రూ.17 కోట్లతో ఇనుప కంచె లు, ఫుట్‌బాల్ ఆడుకునేందుకు రూ.10కోట్లతో స్టేడియం నిర్మించుకుంటున్నార న్నా రు. సిఎం విలాసాలకు క్యాంపు కార్యాలయాలు నిర్మిస్తే, డిప్యూ టీ సిఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో తన సొంతానికి మూడో క్యాంపు కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిఎ, రిజిస్ట్రేషన్, పెట్రోల్ ఛార్జీల పెంపుతో పేదల నడ్డి విరుస్తూ, ఇంపాక్ట్ ఫీజులు, టోల్ గేట్ల పేరుతో ప్రజల జేబులకు మరో భారీ గండిపడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయడంతో పెట్టుబడులు, ఉద్యోగాలు ఎపికి తరలిపోయాయని, అందు కే బిఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేయడం ఖాయమని ఆయన పునరుద్ఘాటించారు. జర్నలిస్టులకు ఎలాంటి వివాదాలు లేని భూములు ఇ వ్వకుండా, కేసులలో ఉన్న ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఇస్తామనడం వారిని వంచించడమేనన్నారు. మీనాక్షి పైన ఉన్న కేసుల సమాచారాన్ని తెలంగాణ కాంగ్రెస్ నుంచే వచ్చిందని మధ్యప్రదేశ్ మంత్రి కూడా స్పష్టం చేశారని, గతంలో ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకున్న వ్యక్తినే ప్రస్తుతం ఇక్కడ ఉండి కుట్ర చేశారని ఆరోపించారు. కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే పాఠశాలల ప్రారంభం తేదీని వాయిదా వేశారని హరీశ్‌రావు ఆరోపించారు. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2వేల కో ట్ల భారీ కుంభకోణం జరుగుతోందన్నారు. అప్పులు తీసుకురావడానికి ప్రభుత్వం దళారులను పెట్టుకున్నదని, ఆ దళారులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన వందల కోట్ల కమీషన్లతో 'ముంబయి బ్రోకర్' ఒక విమానాన్ని కొనుగోలు చేశారన్నారు. పెట్రోల్, డీజి ల్ ధరల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా రూ. 2 వేల కోట్ల ఆదాయం రాబోతుందన్నారు.

## భార్యపై అనుమానమే హత్యకు దారి

బహదూర్‌పురా మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భార్య ప్రవర్తనపై పెంచుకున్న అనుమానం చివరకు దారుణ హత్యకు దారి తీసిన ఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ నెల 7న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి, నిందితుడైన భర్త సులైమాన్ సయీద్ అలియాస్ సులేమాన్ (32)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, కిషన్‌బాగ్‌కు చెందిన సులైమాన్ తన భార్య నిషాద్ ఫాతిమా (30) ప్రవర్తనపై కొంత కాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఆమె తరచూ పుట్టింటికి వెళ్లడంపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. లోక్ అదాలత్ ద్వారా రాజీ ప్రయత్నాలు జరిగినప్పటికీ, నిందితుడి ప్రవర్తనలో మార్పు రాలేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో భార్యపై కక్ష పెంచుకున్న సులైమాన్, ఈ నెల 7న మరోసారి జరిగి న వాగ్వాదం అనంతరం ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గాఢనిద్రలో ఉన్న భార్యపై కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం నేర ఆనవాళ్లను చెరిపివేయడానికి ఇద్దరి మొబైల్ ఫోన్లను పారేసి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ నం.177/2026 కింద కేసు నమోదు చేసిన బహదూర్‌పురా పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన బహదూర్‌పురా డిఐ వి. మదన్ లాల్, ఎస్ఐ జి. అంబేద్కర్, పోలీసు సిబ్బందితో పాటు వారికి మార్గదర్శకత్వం వహించిన ఫలక్‌నుమా ఎసిపి ఎం.ఎ. జావీద్‌ను రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.



## విద్య పరిశ్రమల భాగస్వామ్యానికి కొత్త దిశ : చైర్మన్ పల్ల రాజేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అనురాగ్ విశ్వవిద్యాలయం నిర్వహణ అధ్యయనాల విభాగం, ప్రముఖ సలహా సంస్థ కెపిఎంజీ భాగస్వామ్యంతో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బ్యాంకింగ్, ఆర్థిక సేవలు బీమా రంగాలకు సంబంధించిన ప్రత్యేక ఎంబిఏ కోర్సును ప్రారంభించింది. ఈ మేరకు ఘట్‌కేసర్‌లోని వెంకటాపూర్ క్యాంపస్‌లో గురువారం అనురాగ్ విశ్వవిద్యాలయం, కెపిఎంజీ సంస్థల మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. నిర్వహణ అధ్యయనాల విభాగాధిపతి వి.విష్ణు వందన మాట్లాడుతూ పరిశ్రమలతో విశ్వవిద్యాలయానికి ఉన్న బలమైన అనుబంధానికి ఈ ఒప్పందం నిదర్శనమని పేర్కొన్నారు, విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. డీన్ ఉట్ల బాలాజీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ప్రభావంతో బ్యాంకింగ్ ఆర్థిక సేవలు బీమా రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని ఈ రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ 24 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని గుర్తు చేశారు. 2002లో 180 మంది విద్యార్థులతో ప్రారంభమై న సంస్థ ప్రస్తుతం ప్రతి ఏడాది 16వేల మందికి విద్యను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. మౌలిక సదుపాయాలు నాణ్యమైన అధ్యాపక బృందం ఉత్తమ అభ్యాస వాతావరణం సంస్థ అభివృద్ధికి ప్రధాన కారణాలని వివరించారు. సమర్థవంతమైన భావ వ్యక్తీకరణలనే మూడు అంశాలు అత్యంత కీలకమని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, కెపిఎంజీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలు ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సరోజినిదేవి కంటి ఆస్పత్రి వైద్యులు ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ మనిషి శరీరంలో కళ్లు అత్యంత ప్రధానమైనవని కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రజలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, మేనెజర్ ఉష, ఆర్‌ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, మోహన్ సింగ్, బిల్ కలెక్టర్లు, ప్రజలు, వైద్యులు, పాల్గొన్నారు.



## అన్నపూర్ణ స్కీమ్‌కు పదేళ్లు

### దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.రామచంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ స్కీమ్‌కు 10సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సేవా కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహాకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రామచంద్రయ్యతో కలిసి త్వరలో మరింత పెద్ద స్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, మహిళా అధ్యక్షురాలు కవిత, సుజాతగౌడ్, సోషల్ మీడియా అధ్యక్షులు మొహమ్మద్ బాబా, బాలానగర్ విద్యార్థి విభాగం అధ్యక్షులు సూర్యప్రకాశ్ కొరపాటి,తదితరులు పాల్గొన్నారు.

## తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు

### కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/దుండిగల్:** వరుస దొంగతనాలతో శివారు ప్రాంతాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బౌరంపేట గ్రామంలో గురువారం తెల్లవారు జామున రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పోచమ్మ ఆలయం దగ్గర నివాసం ఉంటున్న లద్దిపీర్ల భూమయ్య గౌడ్ తన పిల్ల స్కూల్ ఫీజుల కోసం



ఒక లక్ష 30 వేల రూపాయల నగదు ఇంట్లో నిల్వ ఉంచారు. అదే గ్రాములో ఓ చిరు ఉద్యోగి నిరుడు రవి ఇంటి కిరాయి నిమిత్తం, డ్వాక్రా సొమ్ము చెల్లించేందు కు ఇంట్లో 35 వేల రూపాయలు నగదు ఉంచుకున్నాడు. గురువారం తెల్లవారు జామున రెండు ఇళ్లలోకి చొరబడిన దుండగుడు రవి ఇంట్లో 3 తులా ల ఐదు గ్రాముల బంగారు నగలు, 35 వేల నగదుతోపాటు, భూమయ్య ఇంట్లో లక్షా 30 వేల నగదు అపహరించినట్లు సమాచారం. ఈ దృశ్యాలు సిసి కెమెరాల్లో నమోదయ్యాయి. పక్కనే ఉన్న మరో ఇంటిలోకి చొరబడేందుకు ప్రయత్నించగా అలికిడి కారణంగా కుక్కలు మొరగడంతో దుండగుడు పరారైనట్లు సమాచారం. శివారు ప్రాంతాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నయి. గ్రామాల్లో గట్టి నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లక్ష ఉద్యోగాల భర్తీ హామీ ఏమైంది?

* ధర్నాలో నిలదీసిన ఎఐవైఎఫ్ నేతలు
* పలువురి అరెస్టులు, సొంత పూచీకత్తుపై విడుదల



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను వంచిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన లక్ష ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించటం ద్వారా ఎఐవైఎఫ్ గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరసనకారులను అరెస్టు చేసేందుకు వచ్చిన శామీర్‌పేట పోలీసులతో వాగ్వివాదం జరిగిన



అనంతరం పలువురు ఎఐవైఎఫ్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారందరిని సొంత పూచీకత్తుపై విడుదల చేసారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోసిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన లక్ష ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్నించారు. తెలంగాణాలోని పలు ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికి వాటిని భర్తీ చేయటంలో కాలయాపన చేయటం ద్వారా నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. టిజిపిఎస్‌సి ద్వారా నామమాత్రంగా నియామక నోటిఫికేషన్లు ఇవ్వటాన్ని దుయ్యబట్టారు. అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. కీలకమైన విద్యా, వైద్య రంగంలోనూ ప్రభుత్వ తీరు నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, గిరిబాబు, శివకుమార్, వికాస్‌రెడ్డి, ప్రీతం, సుదర్శన్, భరత్, నర్సింహ, మధు, తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. సిపిఐ శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ అరెస్టయిన ఎఐవై ఎఫ్ కార్యకర్తలను శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

## ఓటు హక్కు కాపాడటంలో కాంగ్రెస్ సహకారం

### రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ ప్రాంతాల్లో అవగాహన కల్పించటం ద్వారా అర్హత ఉన్న పౌరులందరూ ఓటరు జాబితాలో ఉండేలా బాధ్యత వహించాలని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, టిపిసిసి శిక్షకుడు బసవరాజు శ్రీనివాస్ పిలుపిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన గురువారం అంతాయిపల్లిలోని ఎస్‌ఆన్‌ఆర్ వేద్ కన్వన్షన్ హాలులో బూత్ లెవెల్ ఏజంట్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైందని, దేశ ప్రజా స్వామ్యాన్ని కాపాడటంలో ఓటరు కీలకపాత్ర వహిస్తాడన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరిట అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుండి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఇలాంటి చర్యలను అరికట్టటంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేసారు. ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు టిపిసిసి ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఓటర్లకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజంట్లకు ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు నమోదు ప్రక్రియ, 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా చేర్పించటం, పేరు, చిరునామా లాంటి సవరణలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు, మరణించిన వారి వివరాల సవరణలు లాంటి అంశాలపై తగిన పూర్తి అవగాహన అవసరమన్నారు. ఈ శిక్షణ ద్వారా బూత్ స్థాయిలో పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయటంతో పాటు ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. వీటి కోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తు విధానాలు, దరఖాస్తు ఫారాలు, ఎన్నికల అధికార్లతో సమన్వయంగా ఉండటం లాంటి విషయాల్లో ఈ సమావేశంలో అవగాహన కల్పించారు. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని 602 బూత్‌లకు చెందిన బూత్ లెవెల్ ఏజంట్లు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

## రైతులకు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

### రైతులకు ట్రైకోడెర్మా పంపిణీ : ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌డి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి జ్యోతి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చిట్టిగిద్ద గ్రామంలో గురువారం భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వికారాబాద్ సమన్వయంతో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, సమగ్ర పురుగు నివారణ పంట అవశేషాల నిర్వహణ, కలుపు నియంత్రణ, వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా।। ఆర్.డి.ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త డా।।హెచ్.డి. పుష్ప హాజరై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలని, డిఏపికి ప్రత్యామ్నాయంగా ఎస్ఎస్‌పీ వినియోగం వల్ల పంటలకు అవసరమైన భాస్వరం,గంధకం లభించి ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని వివరించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వికారాబాద్ కోఆర్డినేటర్ టి.



రాజేశ్వర్ రెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేసి, రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, పంటల మార్పిడి, సమగ్ర పురుగు నివారణ పద్ధతులను రైతులు విస్తృతంగా అనుసరించాలని సూచించారు. రైతులకు ట్రైకోడెర్మా పంపిణీ చేసి, విత్తన శుద్ధి, నేల ద్వారా వ్యాపించే శిలీంధ్ర వ్యాధుల నివారణ, వేర్ల అభివృద్ధి, పంట ఆరోగ్య మెరుగుదలలో దాని ప్రాముఖ్యతను వివరించారు. రైతులు ఈ కార్యక్రమం ద్వారా అందించిన సాంకేతిక సూచనలు తమ వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబ్‌పేట్ వ్యవసాయ అధికారి జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) పవన్, చిట్టిగిద్ద గ్రామ సర్పంచ్ శ్రీధర్, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివిధ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/దౌల్తాబాద్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ నందు చేకపడుతున్న వివిధ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం దుద్యాలమండలం హకీంపేట్‌లో చేపడుతున్న ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రతి ఒక్క సైట్‌ను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ఫిజియోథెరపీ, వెటర్నరీ కళాశాల, యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులన్ని నాణ్యతతో ఉండాలని, ప్రతి వారం నిర్ధారించిన లక్ష్యం మేరకు పనుల పురోగతి ఉండాలన్నారు. ప్రతి సైట్‌కు సంబంధించిన ప్లాన్ ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఎడ్యుకేషన్‌హబ్ జిల్లా విద్యారంగ అభివృద్ధికి కీలకం గా మారనుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. కొడంగల్ మున్సిపల్ చేపడుతున్న రోడ్లు డ్రైనేజీలు, పారిశుద్ధ్య పనులు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను చేపట్టాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

వికారాబాద్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిగి, కొడంగల్, తాండూర్, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ దీపక్‌తివారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజాసేవల అమలుపై జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

మున్సిపల్ పరిధిలో చేపడుతున్న రోడ్లు , డ్రైనేజీల, వీధి దీపాలు, పార్కులు, తాగునీటిసరఫరా తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వాటర్ టాక్స్ షాపింగ్ కాంప్లెక్స్ టాక్స్ జిల్లాలో చాలా పెండింగ్ ఉందని అట్టి టాక్స్‌ను ప్రజలు చెల్లించాలని కలెక్టర్ తెలిపారు.

## జంట మహిళల హత్య కేసులో నిందితురాలు కరీమాబేగం మృతి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరుకు చెందిన జంట మహిళల దారుణ హత్య కేసులో ప్రధాన నిందుతురాలిగా ఉన్న కరీమాబేగంను తాండూరు రూరల్ పోలీసులు విచారణలో భాగంగా కరణ్‌కోట్ పోలీసు స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. విచారణ చేస్తున్న సమయంలో కరీమాబేగం బాత్‌రూమ్ అని చెప్పి వెళ్ళిన ఆమె బాత్‌రూమ్‌లోనే యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. అదే రోజు పోలీసులు వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదారాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో 24రోజుల పాటు చికిత్స పొందుతూ కరీమా బేగం బుధవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మొయినాబాద్ జంట మహిళల హత్య కేసులో కరీమాబేగంతో పాటు ఆమె భర్త రెహమాన్, నయూం అనే వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. వీరి పన్నాగంలో పడి మహబూబీ బేగం, అబేదా బేగం అనే మహిళలను వీరు హత్య చేసిన విషయం తెలిసిందే. అంతటితో అగని వీరు మరో ఆరు మంది మహిళలను హత్య చేసేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నారు. వారి పన్నాగం నుండి వారు బయటపడి ప్రాణాలను కాపాడుకున్నట్లు పోలీసులకు వివరించారు. మరో వైపు రాణాలో కరీమాబేగం ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనలో వికారాబాద్ జిల్లా ఎస్పీ ఇద్దరు కానిస్టేబుల్‌లపై సస్పెన్షన్ వేటు కూడా వేశా రు. ఈ ఘటనలో మహిళా కానిస్టేబుల్ సునీత, యాలాల పోలీసు స్టేషన్‌కు చెందిన బసవరాజులు సస్పెన్షన్‌కు గురయ్యారు.



## జాప్యం చేయకుండా వెంటనే ధాన్యం కొనుగోలు

### తెలంగాణ రాష్టరైతు సంఘం కార్యదర్శి సురేష్‌కుమార్

**ప్రజాపక్షం/దౌల్తాబాద్ :** వరి ధాన్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని, అమ్మబోతే రైతులకు అష్టకష్టాలు తప్పడం లేదని ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యంతో రైతులు నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తూ నరకయాతన పడుతున్నారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఉమ శంకర్ ప్రసాద్‌కుమార్ కలిసి మోమోరండం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకంకోసం కుప్పలు పోసిన రాసుల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ధాన్యం కొనుగోలు మందకోడిగా సాగడంతో రెండు నెలలుగా ధాన్యం దగ్గరే పడిగాపులు కాయవలసి వస్తుందని వర్షాకలం వ్యవసాయ పనులు కుంటు పడుతున్నాయన్నారు. నిత్యం వర్షాలు పడడంతో ఆరబెట్టిడం, కుప్పలు చేయడంకోసం అదనపు వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారు. నిబంధన ప్రకారం ధాన్యంకొనుగోలు చేసే సమయంలో బస్తాకు 41 కిలోల 500 గ్రాములు తూకం సమయంలో అనేక కారణాలను చూపుతూ మూడు నుంచి నాలుగు కిలోల వరి ధాన్యాన్ని అదనంగా తీస్తు రైతులను నిలువునా ముంచుతున్నారన్నరు. రైతులు పండించిన పంటకు లాభం లేకుండా పోతుందని అవేదన వ్యక్తం చేశారు. ఐకేపిసెంటర్ల నుండి రైస్ మిల్లులకు వరి ధాన్యాని తరలించేందుకు రైతులే రవాణ చార్జీలు భరించడంతో పండించిన పంట రవాణా చార్జీలకే వెచ్చించవలసిన వస్తుందన్నారు. రైతులు వరి కోసి రెండు నెలలపైన కావస్తున్న ఇప్పటివరకు ధాన్యం అమ్మలేక నరకయతన అనుభవిస్తున్నరన్నారు. అమ్మపోతే అడవి కొనబోతే కొరవి అన్న చందంగా అన్న దాతల పరిస్థితి ఉందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు పడరాని పాట్లుపడుతున్నారన్నరు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందలు పడుతున్నారు. వర్షాలుపడడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని అరబెట్టలేకఅనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, ఆచారీ, బుగ్గప్ప, నర్సింలు, అనంతయ్య, సాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా అశోక్ కుమార్... అభినందనలు తెలిపిన గాంధీ

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి తహసీల్దార్‌గా నూతనంగా నియమితులైన అశోక్ కుమార్ గురువారం వివేకానందనగర్‌లోని కార్యాలయంలో పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా గాంధీ అశోక్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ చేరేలా కృషి చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే ఎల్లమ్మబండలో మహిళల స్వయం సహాయక సంఘాల కోసం మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం, మహిళా భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని గతంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ అశోక్ కుమార్‌కు అందజేశారు. స్థలం కేటాయింపు ప్రక్రియను వేగంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే లా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆ దిశగా ఎల్లమ్మబండలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అగస్త్య, తదితరులు పాల్గొన్నారు.



## చిరు వ్యాపారుల సమస్య పరిష్కారానికి హామీ

**ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పరిధిలోని ఆర్‌జికె ప్రాంతంలో సుమారు 15సంవత్సరాలుగా డబ్బాలు, చిరు వ్యాపార షాపులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారులు తమ సమస్యలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి గురువారం తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో సుమారు 1779 కుటుంబాలు, దాదాపు 7000 మంది ప్రజలు నివసిస్తూ పూర్తిగా ఈ చిరు వ్యాపారులపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో తమ షాపులను తొలగించవద్దని కోరుతూ వ్యాపారులు వినతిపత్రాన్ని అందజేశారు. జిహెచ్‌ఎంసి అధికారులు జెసిబిలతో షాపులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీంతో తమ కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కొలన్ హన్మంత్‌రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చిరు వ్యాపారుల సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక వ్యాపరులు పాల్గొన్నారు.

**హోటల్ జెన్జ్ ప్రారంభోత్సవం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మగ్ధూమ్‌నగర్‌లో సాయి, జమీర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ జెన్జ్ ప్రారంభోత్సవం గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి చేతులు మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన హన్మంత్ రెడ్డి, వ్యాపార రంగంలో ముందుకు సాగుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. స్థానిక యువత ఉపాధి అవకాశాలను సృష్టించే ఇటువంటి వ్యాపార సంస్థలు మరిన్ని ఏర్పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏవిజే జేమ్స్, మైసిగారి శ్రీనివాస్, సిద్దనోళ్ల సంజీవ్‌రెడ్డి, గణేష్, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డైమండ్ షేక్ ఆకస్మిక మృతి తీరని లోటు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన బిఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త డైమండ్ షేక్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. జయలక్ష్మి నరిసింహస్వామి కాలనీకి చెందిన షేక్ నివాసానికి గురువారం వెళ్లిన ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరంతరం షేక్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతూ ప్రజల్లో కలిసి పోయేవాడని, ప్రజలకు అన్ని పథకాలు అందేలా ఆరాట పడేవాడని ఎమ్మెల్యే ఆయన సేవలను కొనియాడారు. బిఆర్‌ఎస్ శ్రేణులు మేకల రాముయాదవ్, అనిల్, సిద్దిరాములు, నాగేష్ గౌడ్, వెంకటేష్, కృష్ణగౌడ్, నరహరి, సూర్యప్రకాష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శుక్రవారం
12-06-2026
www.prajapaksham.in

సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా, భైరవి అర్ధ్యా హీరోయిన్‌గా, శివ వరప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మించిన 'కొత్త మలుపు' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా హీరోయిన్ భైరవి అర్ధ్యా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు

రీల్

# 'సాV3' షూటింగ్ పూర్తి



సాప్రమాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సాV3'. ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింమ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ 'ఈశ్వర్' సినిమాలో కృష్ణమాయ ఫ్రెండ క్యారెక్టర్‌లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వర్ సినిమా రీరిలీజ్ సందర్భంగా ట్రిబ్యూట్‌గా ఈ రోజు 'సాV3' మూవీ టీమ్ స్పెషల్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సాప్రమాట్ మాట్లాడుతూ ప్రభాస్ మా అందరికీ ఫేవరేట్ హీరో. ఆయన ఈశ్వర్ సినిమా రీ రిలీజ్‌కు మేమంతా టీమ్‌గా వెళ్లి థియేటర్స్‌లో సినిమా చూస్తాం. మేము పడిన కష్టం తప్పకుండా ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతున్నాం. అన్నారు. హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ సాV3 సినిమా డబ్బింగ్, ఎడిటింగ్ దశలోనే అందరిలోనూ పాజిటివ్ వైబ్స్ ఏర్పడుతున్నాయి. ఈ సినిమా ఔట్‌పుట్ మేము అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. తప్పకుండాసినిమా మీ అందరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. అతిథిగా వచ్చిన నిర్మాత అశోక్ కుమార్ మాట్లాడుతూ మా ఈశ్వర్ చిత్రంతో పరిచయమైన ప్రభాస్ పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోగా తెచ్చుకున్నారు. ఆ సినిమా మళ్లీ రీ రిలీజ్ అవుతోంది. చాలా సంతోషంగా ఉందని అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ ఈశ్వర్ సినిమాకు నేను ఆర్ట్ డైరెక్టర్‌తో పాటు నలుగురు ఫ్రెండ్స్‌లో ఒకరిగా నటించాను. ఈ సినిమా మాకు మంచి పేరు తీసుకొచ్చింది. ఈశ్వర్ చిత్రంలో నటిస్తున్నప్పుడు మూవీ ఇంత బ్లాక్ బస్టర్ అవుతుందని ఊహించలేదు. ప్రభాస్, అభి, నేను, హనుమంతు..ఇలా అంతా సరదాగా కలిసి చేశాం. ప్రభాస్ కూడా మాతో పాటు సరదాగా ఉండేవారు. ప్రభాస్ పెద్ద స్టార్ అయ్యారు. అంత పెద్ద స్టార్ మొదటి చిత్రంలో మేమంతా కలిసి నటించాం అని చెప్పుకోవడం గర్వంగా ఉంది. అశోక్ కుమార్ నాకు గురువు లాంటివారు. ఆయనను చూసే ప్రొడక్షన్ ఎలా చేయాలో నేర్చుకున్నాను. ప్రొడ్యూసర్ వి. విజయ మాట్లాడుతూ 'సాV3' వంటి మంచి చిత్రాన్ని నిర్మించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ కావాలి. ఈ మూవీతో పెద్ద విజయాన్ని అందుకోబోతున్నాం. మా ఆర్టిస్టులంతా తమ పర్ఫామెన్స్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం. అన్నారు.

# యాక్షన్ మూవీ'ఆల్ఫా' టీజర్ 'అదుర్స్'


## జూలై 3న రిలీజ్



ఆలియా భట్ ప్రధాన పాత్రలో యశ్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆలియా భట్ ఓ హంతకురాలి పాత్రలో నటించింది. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న ఆల్ఫా చిత్రాన్ని ..చిన్న వయస్సు నుంచే పెంచి, హత్యలు చేయడానికి తయారు చేసిన ఓ హంతకురాలికి సంబంధించిన మూల కథతో రూపొందించారు. బాబీ డియోల్ తండ్రి పాత్రలో కనిపించారు. తన కుమార్తెను బాబీ చిన్నప్పటి నుంచే హత్యలు చేసే ఓ హంతురాలిగా పెంచి పెద్ద చేస్తాడని అర్థమవుతుంది. అలాగే ఆమె చేసిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా మనం ఇందులో గమనించవచ్చు. త్వరలోనే ఈ సినిమాలో మరో ప్రధాన పాత్రలో నటించిన శర్వారి పాత్రను మేకర్స్ పరిచయం చేయబోతున్నారు. థ్రిల్లింగ్, ఎమోషనల్, ఫన్నీ ఎలిమెంట్స్‌తో ఎవరూ ఊహించని మలుపులతో రైడింగ్‌లా ఆల్ఫా సినిమాను రూపొందించారు.

# వినోదాత్మక చిత్రం 'థాంక్యూ సుబ్బారావు'

'ఓ.. పిట్టకథ', 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' రేపు ఉదయం పది గంటలకు' వంటి చిత్రాలతో దర్శకుడిగా చెందు ముద్దు మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన దర్శకత్వంలో రానున్న సరికొత్త సినిమా 'థాంక్యూ సుబ్బారావు. ఈ మూవీని కె రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో కుర్ర పొడక్షన్స్ బ్యానర్ మీద ధినేష్ కుర్ర నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో చంద్రహాస్ కోట్ల, లావణ్య ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటుగా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'థాంక్యూ సుబ్బారావు' టీజర్‌ను గమనిస్తే ఎన్నో అంశాలను మేళవంచి తెరకెక్కించినట్టుగా కనిపిస్తోంది. కామెడీ, యాక్షన్, లవ్, సస్పెన్స్, థ్రిల్ ఇలా అన్ని అంశాల్ని జోడించి 'థాంక్యూ సుబ్బారావు'ని తెరకెక్కించారు. టీజర్ చాలా ప్లెజెంట్‌గా కనిపిస్తోంది. మురళీధర్ గౌడ్ డైలాగ్స్ కామెడీగా ఉన్నాయి. హీరో హీరోయిన్‌ల ట్రాక్. ట్రైన్‌లోని అమ్మాయి.. సస్పెన్స్ ఎలిమెంట్స్ ఇలా అన్నీ కూడా ఆసక్తిని పెంచేశాయి. ఈ చిత్రానికి ప్రిన్స్ హెన్రీ సంగీత దర్శకుడిగా, పంకజ్ తొట్టాడ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. డి.వెంకట్ ప్రభ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.



# 'ఇరుముడి' అందమైన జ్ఞాపకం

## నటి ప్రియా భవానీ శంకర్



రవితేజ, ప్రముఖ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ కు వచ్చిన స్పందనతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. తాజాగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ సెట్స్ నుంచి బ్యూటిఫుల్ వర్కింగ్ స్టిల్స్ షేర్ చేశారు. ఈ స్టిల్స్‌లో రవితేజ, ప్రియా భవానీ శంకర్, శివ నిర్వాణ ఉన్నారు ఈ సందర్భంగా ప్రియా భవానీ శంకర్ సోషల్ మీడియాలో ఓ స్పెషల్ పోస్ట్ పెట్టారు. 'ఇరుముడి' షూటింగ్ ప్రయాణం ఓ అందమైన జ్ఞాపకం. సన్నివేశాలను చిత్రీకరిస్తూ ఎన్నో మధుర క్షణాలను సొంతం చేసుకున్నాం. సెట్స్‌లో పుట్టిన సరదా జోక్స్, నవ్వులు, టీమ్‌తో గడిపిన ప్రతి క్షణం ఈ ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి. అలా ఎంతో ఆనందంగా ఫిలిం చేశాం. 'ఇరుముడి'తో చేసిన ఈ ప్రయాణం జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం' అని తన ఆనందంగా వ్యక్తం చేశారు. రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. మానవ సంబంధాలు, కుటుంబ విలువల నేపథ్యంలో శివ నిర్వాణ ఈ కథను మనసుని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అదే సమయంలో కమర్షియల్ అంశాలను కూడా సమతూకంగా మేళవించారు. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పని చేస్తున్నారు శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# 'తుర్ఘుపే ఫిదా' సాంగ్ రిలీజ్

రుత్విక్‌ను హీరోగా పరిచయం చేస్తూ వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె.నిహారిక దాసరి నిర్మిస్తున్న చిత్రం 'రాజా ది రాజా'. నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమకథతో మేళవిస్తూ ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు. సినిమా నుంచి 'తుర్ఘుపే ఫిదా సాంగ్'ను విడుదల చేశారు. మార్క్ కె. రాబిన్ స్వరపరిచిన ఈ మెలోడీయస్ లవ్ ట్రాక్‌కు మనోజ్ జూలూరి సాహిత్యాన్ని అందించారు. హరిచరణ్, శక్తి శ్రీ గోపాలన్ గాత్రం పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సముద్ర తీరంలో చిత్రీకరించిన ఈ పాట విజువల్‌గా ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ, అందమైన లొకేషన్స్, ఫ్రెష్ విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. హరి కిరణ్ మాస్టర్, ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాటలో కనిపించిన రొమాంటిక్ ఫీల్, యూత్‌ఫుల్ ఎనర్జీ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. టీజర్‌తో ఆకట్టుకున్న 'రాజా ది రాజా' ఇప్పుడు 'తుర్ఘుపే ఫిదా' పాటతో మరింత ఆసక్తిని పెంచింది.



# సుప్రీంకోర్టుకు మీనాక్షి నటరాజన్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ అతుల్ ఎస్ చందుర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది. అయితే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఇలాంటి పిటిషన్ విచారణకు అనుకూలమా అనే అంశంపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌లో రిటర్నింగ్ అధికారి నిర్ణయం చట్టవిరుద్ధం, ఏకపక్షం, పక్షపాత ధోరణితో కూడుకున్నదిగా మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలను తిరస్కరించిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, తన అభ్యర్థిత్వాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. మీనాక్షి నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్‌మను సంఘ్వీ వాదనలు వినిపించారు. రిటర్నింగ్ అధికారి తప్పుగా నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం అభ్యర్థి కనీసం రెండేళ్ల శిక్ష విధించే అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే అఫిడవిట్‌లో పేర్కొనాల్సి ఉంటుందని ఆయన వాదించారు. ప్రస్తుత కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని, పూర్తి స్థాయి నేర విచారణ దశకు చేరుకోలేదని తెలిపారు. అందువల్ల నామినేషన్ తిరస్కరణకు ఆధారం లేదని సింఘ్వీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

**ఎన్నికల సంఘం అభ్యంతరం**

రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరవింద్ శర్మ జారీ చేసిన ఉత్తర్వులో మీనాక్షి నటరాజన్ సమర్పించిన అఫిడవిట్ అసంపూర్ణంగా ఉందని పేర్కొన్నారు. నామినేషన్‌తో పాటు సమర్పించిన ఫారం26లో ఒక కోర్టు ఫిర్యాదుకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదని పరిశీలనలో తేలినట్లు తెలిపారు. అందువల్ల నిబంధనల ప్రకారం ఆమె నామినేషన్‌ను తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది డీఎస్ నాయుడు కూడా పిటిషన్ ప్రస్తావనను వ్యతిరేకించారు. పిటిషన్ ప్రతిని ఎన్నికల సంఘానికి అందించలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. పూర్తి ప్రక్రియ పాటించకుండా అత్యవసర విచారణ కోరడం సరి కాదని అభిప్రాయపడ్డారు. విచారణ సందర్భంగా జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పిటిషన్ ఆవశ్యకత ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో సాధారణంగా ఎన్నికల ఫలితాల అనంతరం పిటిషన్ దాఖలు చేయడమే సరైన మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో పిటిషన్ ప్రాథమిక అర్హత అంశమే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. అయితే పిటిషన్‌లో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్దిన తర్వాత శుక్రవారం విచారణకు జాబితాలో చేర్చాలని ధర్మాసనం ఆదేశించింది.

# ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తోంది: కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా కాకుండా బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీ నాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ, బిహార్ రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ స్పందించిన తీరును వారు తీవ్రంగా తప్పుబట్టారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్‌రావులు మాట్లాడారు. ఈ సందర్భంగా పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ బిహార్ రాజ్యసభ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై మార్చి 5న ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినప్పటికీ, మూడు నెలల తర్వాత ఎన్నికల ప్రక్రియ ముగిసిపోయినందున చర్యలు తీసుకోలేమని సమాధానం ఇవ్వడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ విషయంలో మాత్రం తక్షణ నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. జగదీశ్వర్ రావు మాట్లాడుతూ రాజ్యసభ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించే అధికారం రిటర్నింగ్ అధికారికి లేదని, గతంలో ఇలాంటి సందర్భాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని నిర్ణయాలను సవరించిన ఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా, ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. బిజెపికి తగిన బలం లేకపోయినా మూడో అభ్యర్థిని బరిలోకి దించి రాజకీయ కుట్రకు తెరలేపిందని, ప్రాథమిక దశలో ఉన్న కేసులను సాకుగా చూపి రాజ్యసభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలను తిరిగి నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్రతను కాపాడలని కోరారు.

# ఉత్తరాన వడగాడ్పులు

(మొదటి పేజీ తరువాయి)

వీచే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. జూన్ ఆదివారం నుంచి నుంచి ఈనెల 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ సహా మిగతా జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగుతాయన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో వెల్లడించారు. ఈ కేసులో కేరళ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరు వేర్వేరు మార్గాల్లో ముగ్గురు బాధితులను నమ్మించి రూ.1.87 లక్షలు కాజేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 6న కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, డబ్బు లావాదేవీలు ఒకే నెట్‌వర్క్‌కు చెందిన ఖాతాల్లోకి వెళ్తున్నట్లు గుర్తించారు. దర్యాప్తులో 'గోల్డ్‌వ్వెస్ట్', 'క్వెస్ట్‌నెట్', 'క్యూనెట్' పేర్లతో గత 25 ఏళ్లుగా కార్యకలాపాలు సాగించిన నెట్‌వర్క్‌నే తాజాగా 'ఇగ్నైట్' పేరుతో మళ్లీ రంగంలోకి దిగినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. వాట్సాప్, జూమ్ సమావేశాలు, ప్రత్యక్ష భేటీల ద్వారా కొత్త సభ్యులను చేర్చుకుని డబ్బు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. నిం దితులపై మోసం, క్రిమినల్ కుట్ర, మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లు, ఐటీ చట్టం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి ఎంఎల్‌ఎం, మనీ సర్క్యులేషన్ పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిందితులు ఎస్‌ఆర్‌నగర్ కేసులో ఆఫ్రికా నంబర్‌తో వాట్సాప్ ద్వారా బాధితులను సంప్రదించి మిస్టర్ సెసె అనే వ్యక్తి బ్రెయినిపై , సిమెట్రా ఉత్పత్తుల పేరుతో రూ.61,639 వసూలు చేశారు. అరెస్టు అయిన నిందితుల్లో నోయిడాకు చెందిన ఒనియల్ గుప్తా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దినేష్‌కుమార్ సాహిల్, ప్రియాన్షు సక్సేనా, పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ దకాలియా, కోల్‌కతాకు చెందిన పరితోష్ కుమార్ దకాలియా, కెరళకు చెందిన రియాజ్ ఉన్నా రు. బాధితుల నుంచి వసూతు చేసిన సొమ్మును నిందితులు హాంగ్‌కాంగ్‌కు తరలించారని దర్యాప్తులో తేలిందని సజ్జనార్ వెల్లడించారు. హవాలా మార్గంలో మలేషియా కూడా తరలించారన్నారు.

# మరిన్ని శాఖలను ప్రతివాదులుగా చేర్చాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్‌ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులకు సంబంధించి న ప్రజాహిత వ్యాజ్యంలో ఉన్నత వి ద్యా మండలి, సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖలను కూడా ప్రతివాదులుగా చేర్చాలని హైకోర్టు పిటిషనర్ల కు సూచించింది. బకాయిల కారణంగా కొంతమంది విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలలు నిలిపివేస్తున్నాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించగా, ఇంకా రూ.125 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు కోర్టుకు వివరించారు. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# వేగవంతంగా పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులే టి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులకు సంబంధించి ఎన్‌జిటి కేసులు, ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్ తో నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాకు పూర్తి స్థాయి సాగునీరు రావాలంటే సీతమ్మ సాగర్ బ్యారేజీ త్వరగా పూర్తి కావడం అవసరమని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి శాఖ అధికారులు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం (అర్ అండ్ అర్) సమస్యలను కూడా వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆయన తెలిపారు.

**ఖమ్మం జిల్లా రైతులకు శాశ్వత సాగు నీటి భద్రత : ఉత్తమ్**

ఖమ్మం జిల్లాలో రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులు సహా అన్ని ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి ఎకరాకు సాగునీరే లక్ష్యం : మంత్రి పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం జిల్లాకు చాలా ముఖ్యమైన ప్రాజెక్టు అని, ఇది పూర్తయితే జిల్లాలో సాగునీటి పరిస్థితి పూర్తిగా మారిపోతుందని తెలిపారు. సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రధాన ప్రాజెక్టులను కూడా త్వరగా పూర్తిచేసి రైతులకు సాగు నీటి ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు.

## దుమ్ము గూడెం, చర్ల, భద్రాచలం ప్రాంతాలకు సాగు నీరు అందించాల్సిందే : కూనంనేని

సీతారామ ప్రాజెక్టు ద్వారా దుమ్ము గూడెం, చర్ల, భద్రాచలం ప్రాంతాలకు సాగు నీరు అందించాల్సిందే కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు రాష్ట్ర మంత్రులకు స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు ఈ ప్రాంతాలు ఎగువ ఉన్నాయని నీటిని అందించకపోవడం సరికాదని, లిఫ్ట్‌ల ద్వారా నీరు అందించాలని ఆయన సూచించారు. పెనుపాక నియోజకవర్గంలో అశ్వారావుపేట్, మణుగూరు, మండలంతో పాటు ఇల్లెందు నియోజవర్గంలో సైతం ఈ ప్రాజెక్టు ద్వారా నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. సూచించారు. కొత్తగూడెంలోని సింగ భూపాలం చెరువును అతి తక్కువ ఖర్చు రూ.5 కోట్లతో మరమ్మతులు చేపట్టాలని లేకపోతే ఇప్పటికే కుంగిన చెరువు తెగపోయే ప్రమాదం ఉందన్నారు. కొత్తగూడెంకు నట్టనడుమ ఉన్న ముర్రేడ్ వాగుకు రిటైరింగ్ వాల్ నిర్మించాలని లేకపోతే పట్టణం నీట మునుగుతుందన్నారు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి లిఫ్టుల మరమ్మతులు చేపట్టపోవడంతో 3.5 వేల ఎకరాలకు సాగుకు నోచుకోకుండా బీడు భూములుగా మిగిలాయని తెలిపారు. తక్షణమే లిఫ్టుల మరమ్మతులు చేపట్టి ఈ భూములను సా గులోకి తేచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించా రు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com